సోమవారం 19 అక్టోబరు 2026 https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



**రాష్ట్రపతి పాలన డిమాండ్..**

జగన్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే

- వివరాలు 2 లో..




పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల తొలి మెట్టు నామినేషన్ల దగ్గరే వైసీపీ పలాయన మార్గాలను వేసుకుంటుంది. అభ్యర్థుల్ని బరిలో నిలపడంకంటే.. ఎన్నికల ఘర్షణలను రేకెత్తించడంపైనే ఆ పార్టీ దృష్టి పెట్టింది. పార్టీ అధినేత జగన్ 'తిరగబడండి' అంటూ ఇస్తున్న పిలుపు.. ఎన్నికల ప్రక్రియను అపఖ్యాతి పాలు చేసే దుస్సాహసమే! ప్రక్రియ మొదలైన దగ్గర్నుంచీ పరిణామాలను పరికిస్తే.. పోలింగ్‌కు ముందే వైసీపీ ఓటమిని అంగీకరిస్తోందా.. అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. అదే సమయంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి.. 'స్థానిక ఎన్నికలు సజావుగా జరగలేదన్న అపఖ్యాతి బురద'ను ప్రజా ప్రభుత్వంపై చిలకరించే ముష్కర వ్యూహాలకు పదును పెడుతున్నట్టే కనిపిస్తోంది!

3






### నాడు ఎన్నికల కమిషనర్‌నే తప్పించారు..

## నేడు ప్రజాస్వామ్యంపై నీతులా జగన్?

- అధికారంలో ఉండి అరాచకాలపై నోరు విప్పని జగన్‌కు నేడు రాజ్యాంగం గుర్తొచ్చిందా?
- మాచర్లలో బొండా ఉమ, బుద్ధా వెంకన్నలపై జరిగిన దాడికి బాధ్యులెవరు?
- పుంగనూరు నుంచి నెల్లూరు వరకు ప్రతిపక్ష అభ్యర్థులపై జరిగిన దాడులకు సమాధానం చెప్పండి
- ప్రజాస్వామ్యం అంటే అధికారంలో ఉన్నప్పుడు ఒక నీతి.. నేడు మరో నీతా?
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజం

4



నాడు అప్రజాస్వామికంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌నే తప్పించిన జగన్ రెడ్డి నేడు ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా.. రాజ్యాంగబద్ధ పాలన సాగుతోందా.. చట్టం, న్యాయం పనిచేస్తున్నాయా.. అంటూ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజా మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై మంత్రి తీవ్రస్థాయిలో స్పందించారు.

### ఉనికి కోసం సాయిరెడ్డి తాపత్రయం



- విజయవాడ మేయర్ ఎన్నికలపై ఏ2 వ్యాఖ్యలు అర్థరహితం
- తిరుగులేని మెజారిటీతో వంగవీటిని గెలిపించి అందరి కుట్రలూ వమ్ము చేస్తాం
- విజయవాడ ఎంపి కేశినేని చిన్ని స్పష్టీకరణ

2

## దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా జగన్ నీతిసూక్తులు

- ఆయన హయాంలో స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయట
- నాడు జరిగిన అరాచకాలు రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరిచిపోరు
- దాడులు, దౌర్జన్యాలు, హింస, బలవంతపు ఏకగ్రీవాలు.. ఇవేవీ జగన్‌కు గుర్తులేవా?
- ఎస్ఈసీని కలిసిన జగన్ బయట మీడియాతో నీతి పన్నాలు మాట్లాడటం హాస్యాస్పదం
- తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ వర్ల రామయ్య

5



## దాడులు చేసి నంగనాచిలా ఫిర్యాదులు

- దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా గొడ్డలి పార్టీ నాయకుడి తీరు
- నామినేషన్లు ప్రారంభమైన నాటి నుంచి వైసీపీ ఆరాచకాలు
- వైసీపీ ఎంపీలు అవినాష్, మిధున్ రెడ్డి నేతృత్వంలో దాడులు
- ఏమీ ఎరుగనట్లు ఈసీకి ఫిర్యాదు: జగన్‌పై మంత్రి సవిత ఆగ్రహం
- 'స్థానికం'లో కూటమి క్లీన్ స్వీప్ ఖాయమని మంత్రి ధీమా

2



రప్పా... రప్పా నరకడంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది వారే... తమ పార్టీ వారితో నామినేషన్లు వేయనివ్వడం లేదు అంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందీ వారే... దెయ్యాలు వేదాలు వల్లించి నట్లుగా వ్యవహరిస్తున్నారంటూ జగన్‌రెడ్డిపై రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభ మైన నాటి నుంచి గొడ్డలిపార్టీ నాయకులు అరాచ కాలకు, దాడులకు తెరతీశారన్నారు. ఎన్నికల సంఘం, పోలీసులు తీసుకున్న కట్టుదిట్టమైన చర్యలతో గతంలో ఎన్నడూ లేనివిధంగా పులివెందుల, కడపలో అత్యధిక మంది నామినేషన్లు వేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

## మున్సిపల్ నామినేషన్లలో టీడీపీ ముందంజ

- 8,774 నామినేషన్లు దాఖలు దాఖలు
- హింసకు తావివ్వొద్దని ప్రతిపక్షానికి హితవు

7

# దాడులు చేసి నంగనాచిలా ఫిర్యాదులు

- దెయ్యాలు వేదాలు వల్లిస్తున్నట్టుగా గొడ్డలి పార్టీ నాయకుడి తీరు
- నామినేషన్లు ప్రారంభమైన నాటి నుంచి వైసీపీ ఆరాచకాలు
- వైసీపీ ఎంపీలు అవినాష్, మిధున్ రెడ్డి నేతృత్వంలో దాడులు
- ఏమీ ఎరుగనట్లు ఈసీకి ఫిర్యాదు
- జగన్‌పై మంత్రి సవిత ఆగ్రహం
- గతంలో ఎన్నడూ లేని విధంగా పులివెందుల, కడపలో భారీగా నామినేషన్ల దాఖలయ్యాయని వెల్లడి
- 'స్థానికం'లో కూటమి క్లీన్ స్వీప్ ఖాయమని మంత్రి ధీమా

పెనుకొండ/శ్రీసత్యసాయి (చైతన్యరథం): రప్పా... రప్పా నరకడంటూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది వారే... తమ పార్టీ వారితో నామినేషన్లు వేయనివ్వడం లేదు అంటూ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసిందీ వారే... దెయ్యాలు వేదాలు వల్లించి నట్లుగా వ్యవహరిస్తున్నారంటూ జగన్‌రెడ్డిపై రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల నామినేషన్ల పర్వం ప్రారంభమైన నాటి నుంచి గొడ్డలి పార్టీ నాయకులు అరాచకాలకు, దాడులకు తెరతీశారన్నారు. ఎన్నికల సంఘం, పోలీసులు తీసుకున్న కట్టుదిట్టమైన చర్యలతో గతంలో ఎన్నడూ లేనివిధంగా పులివెందుల, కడపలో అత్యధిక మంది నామినేషన్లు వేశారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు స్వీప్ చేయడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు.

శ్రీసత్యసాయిజిల్లా పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం తనను కలిసిన విలేకరులతో మంత్రి సవిత మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధికి చేసిందేమీ లేకపోవడంతో, ప్రజలకు ముఖం చూపే ధైర్యం గొడ్డలి పార్టీ నాయకులు చేయలేకపోతున్నారన్నారు. స్థానిక సంస్థల్లో ఘోర ఓటమి ఖాయమని తెలిసి అరాచకాలకు తెరతీశారన్నారు. నామినేషన్ల పర్వం ప్రారంభమైన నాటి నుంచి వైసీపీ ఎంపీలు అవినాష్‌రెడ్డి, మిధున్‌రెడ్డి నేతృత్వంలో పుంగనూరు, పులివెందుల, తిరుపతి, రాయచోటి వంటి ప్రాంతాల్లో దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు. రప్పా... రప్పా... నరకడంటూ ఆపార్టీ నేతలు తమ క్యాడర్‌ను రెచ్చగొట్టి ప్రజలపైకి ఉసికొల్పారని మంత్రి సవిత ఆగ్రహం వ్యక్తంచేశారు.

### పులివెందులలో నామినేషన్ల వెల్లువ

గొడ్డలి పార్టీ నాయకుడు జగన్ సొంత నియోజక వర్గమైన పులివెందులలో టీడీపీ సహా పలు పార్టీ నాయకులు భారీగా నామినేషన్లు దాఖలు చేశారని మంత్రి సవిత తెలిపారు. కడపలోనూ ఇదే తరహాలో




భారీ ఎత్తున నామినేషన్లు అందజేశారన్నారు. గతంలో ఎన్నడూ పులివెందుల, కడపలో ఇలా భారీ ఎత్తున నామినేషన్లు దాఖలు చేసిన చరిత్ర లేదన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం, పోలీసులు తీసుకున్న కట్టుదిట్టమైన చర్యలు, ప్రజాస్వామ్యం పరిరక్షణ వల్లే నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ ఎన్ని ఆరాచకాలకు పాల్పడిందో ప్రజలందరికీ గుర్తుందన్నారు. వారిలాగా నామినేషన్లు చింపడం, వేయకుండా అడ్డుకోవడం వంటి అరాచకాలకు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్పడ లేదని మంత్రి సవిత స్పష్టం చేశారు.

### నరకమన్నది వాళ్లే... ఫిర్యాదు చేసేందీ వాళ్లే

దెయ్యాలు వేదాలు వల్లించినట్లు జగన్ వ్యవహరిస్తున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. నామినేషన్ల సందర్భంగా రాష్ట్రంలో భారీఎత్తున అల్లర్లు సృష్టించింది గొడ్డలి పార్టీయేనన్నారు. ఈవిషయం ప్రజలందరికీ తెలుసన్నారు. కాని,జగన్ ఏమీ ఎరుగనట్లు రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదంటూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంపై ప్రజలు నవ్వుకుంటున్నారన్నారు. రప్పా... రప్పా... నరకమన్నది వాళ్లేనని, టీడీపీ నాయకుల పైనా, ప్రజలపైనా దాడులకు తెగబడింది వారేనని, ఏమీ ఎరుగనట్లు ఫిర్యాదు చేసింది గొడ్డలి పార్టీ నాయకుడేనని విమర్శించారు.స్థానిక సంస్థల్లో ఓటమి ఖాయమని తెలిసి, ఎన్నికలు జరగకుండా చూసేందుకు జగన్ కుట్రలు పన్నుతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు.

### క్లీన్ స్వీప్ చేస్తున్నాం

జగన్‌ను, గొడ్డలి పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని మంత్రి సవిత తెలిపారు. రెండున్నరేళ్ల కూటమి ప్రభుత్వపాలనలో ఎన్నో సంక్షేమపథకాలు,అభివృద్ధి కార్యక్రమలను చేపట్టామన్నారు. ప్రజలు సీఎం చంద్రబాబు నాయుడు పాలనపై ఎంతో నమ్మకంతో ఉన్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలు విజయం సాధించడం ఖాయమని, రాష్ట్రమంతటా క్లీన్ స్వీప్ చేయబోతున్నామని మంత్రి సవిత ధీమా వ్యక్తం చేశారు.

---

# ఉనికి కోసం సాయిరెడ్డి తాపత్రయం

- విజయవాడ మేయర్ ఎన్నికలపై ఏ2 వ్యాఖ్యలు అర్థరహితం
- తిరుగులేని మెజారిటీతో వంగవీటిని గెలిపించి అందరి కుట్రలూ వమ్ము చేస్తాం
- విజయవాడ ఎంపి కేశినేని చిన్ని స్పష్టీకరణ

అమరావతి (చైతన్యరథం): జగన్ అక్రమాస్తుల కేసుల్లో ఏ 2 గా ప్రసిద్ధుడైన విజయసాయిరెడ్డి ఉనికి చాటుకోవడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ధ్వజమెత్తారు. తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలే నైజంగా సాయిరెడ్డి పని చేస్తారనేది జగమెరిగిన సత్యమని మండిపడ్డారు. అయినా... ఇదే విషయాన్ని ప్రతినిత్యం చాటుకుంటూనే ఉన్నారు.



తాజాగా విజయవాడ మేయర్ అభ్యర్థిగా ఏబీ వెంకటేశ్వర్‌రావు పోటీ వెనుక టీడీపీ ఉందని మరో తప్పుడు ప్రచారాన్ని తలకెత్తుకున్నారు. ఏబీ వెంకటేశ్వర్‌రావు ఒక రిటైర్డ్ అధికారి. ఆయనకు తెలుగుదేశానికి ఏం సంబంధం..? మేయర్‌గా వ్యక్తిగత హోదాలో పోటీ చేసుకుంటుంటే... దాన్ని తెలుగుదేశానికి ఆపాదించడం కుట్రే. అయినా పన్నాగాలు, కుతంత్రాలు చేయాల్సిన అవసరం తెలుగుదేశం పార్టీకి లేదు. ఇలాంటి తప్పుడు ప్రచారాలతో కూటమి పార్టీల ఐక్యతను దెబ్బ తీయడానికి చేసే ప్రయత్నాలు ఫలించవు. 2014-19 మధ్య బీజేపీ నుంచి టీడీపీని దూరం చేయాలని చాలా కుట్రలు చేశానని స్వయంగా చెప్పుకున్న సాయిరెడ్డి గురించి అందరికీ తెలుసు. ఈసారి ఎవరెన్ని ప్రయత్నాలు చేసినా కూటమిని విడగొట్టలేరు... మా ఐక్యతను చెడగొట్టలేరు. అయినా ఇప్పుడు రాష్ట్ర ప్రజలు ఏ1 మాటలు నమ్మడానికి... ఏ2 మాటలు వినడానికి సిద్ధంగా లేరు. విజయసాయిరెడ్డి ఎన్ని ప్రయత్నాలు చేసినా, ఎంత బురద జల్లినా... కూటమి కలిసే ఉంటుంది. అంతా కలిసి విజయవాడ మేయర్‌గా వంగవీటి రాధాని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటాం. అన్ని చోట్లా కూటమి విజయంతో విజయసాయిరెడ్డి వంటి వాళ్ల నోళ్లు పూర్తిగా మూయిస్తామని ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు.

---

# రాష్ట్రపతి పాలన డిమాండ్.. జగన్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే

- వైసీపీ వారే గొడవలు సృష్టిస్తూ ప్రభుత్వంపై నిందలా?
- స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణే కూటమి ప్రభుత్వ లక్ష్యం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలంటూ వైఎస్సార్‌సీపీ చేస్తున్న డిమాండ్ రాజకీయ దృష్టి మళ్లింపు ఎత్తుగడగా టీడీపీ రాష్ట్రఅధ్యక్షుడు పల్లా శ్రీనివాస రావు కొట్టిపడేశారు.క్షేత్రస్థాయిలో వారే గొడవలు సృష్టిస్తూ, మరోవైపు రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ప్రచారం చేయడం వైసీపీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రపతి పాలన పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఆదివారం మీడియాతో పల్లా మాట్లాడుతూ జగన్‌రెడ్డితో పాటు వైసీపీ ముఠాపై ఉన్న క్రిమినల్ కేసుల అంశాన్ని ప్రస్తావిస్తూ.. అక్రమాస్తుల కేసులో జగన్‌రెడ్డి 16 నెలలపాటు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న విషయాన్ని గుర్తుచేశారు.



గతంలో వివేకానందరెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డిని అరెస్టు చేసేందుకు సీబీఐ అధికారులు వచ్చిన సందర్భంలో గొడ్డలిపార్టీ వ్యవహరించిన తీరును ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు.వారిపై ఉన్న ఆరోపణలకు సమాధానం చెప్పకుండా రాష్ట్రపతి పాలన డిమాండ్‌తో ప్రజల దృష్టిని మళ్లించాలని చూడటం రాజకీయ కపటత్వమని విమర్శించారు.

గత స్థానిక ఎన్నికల సమయంలో గొడ్డలి పార్టీ వ్యవహరించిన తీరును ప్రజలు గుర్తుంచుకున్నారని పల్లా అన్నారు. ప్రస్తుతం కూడా క్షేత్రస్థాయిలో వారే వివాదాలు సృష్టిస్తూ, మరోవైపు మీడియా ముందుకు వచ్చి రాష్ట్రపతి పాలన కోరడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఉద్రిక్తతలను పెంచి, ఆ నెపాన్ని కూటమి ప్రభుత్వంపై నెట్టే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే ముందు గత పాలనలో తమ వ్యవహారశైలిపై వైసీపీ ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్డీయే కూటమి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందని పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ప్రతి అభ్యర్థి ఎలాంటి ఆటంకాలు లేకుండా నామినేషన్ దాఖలు చేయడంతోపాటు, ప్రతి ఓటరు భయం లేకుండా తన ఓటు హక్కును వినియోగించుకునేలా పరిస్థితులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలిగించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వైసీపీ రెచ్చగొట్టే ప్రకటనలకు ప్రజలు ప్రభావితం కాకుండా వాస్తవాలను గమనించాలని ఆయన కోరారు. రాష్ట్రపతి పాలన పేరుతో రాజకీయ గందరగోళం సృష్టించడం మానుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించడమే కూటమి ప్రభుత్వ సంకల్పమని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

---

# స్థానిక ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రవాసాంధ్రులు కృషిచేయాలి

- ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి
- ప్రసార మాధ్యమాల ద్వారా కూటమి గెలుపునకు తోడ్పడాలి
- గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు డా. పిల్ గురు రాజా

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు డా.పిల్ గురురాజా పిలుపు ఇచ్చారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ, కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, స్థానిక సంస్థల ఎన్నికల్లో



కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ మంది ప్రవాసాంధ్రులు కూడా స్వగ్రామాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కృషి చేయాలి. ప్రవాసాంధ్రులు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తులతో తరుచుగా మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పనితీరును వివరించాలి. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను, రాష్ట్ర అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా తెలియజేయాలి. తమ ప్రచారం ద్వారా ప్రజల్లో అవగాహన పెంచి, కూటమి అభ్యర్థులకు మద్దతు లభించేలా ప్రతి ప్రవాసాంధ్రుడు తన వంతు కృషి చేయాలి. పల్లె నుంచి పట్టణం, నగరం నుంచి రాష్ట్రం, రాష్ట్రం నుంచి కేంద్రం వరకు ఒకే ప్రభుత్వం ఉన్నప్పుడే అభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ ఫలాలు అందుతాయి. డబుల్ ఇంజిన్ తరహా పాలనతో రాష్ట్ర అభివృద్ధి రెట్టింపు వేగంతో ముందుకు సాగుతుందని గురురాజా స్పష్టం చేశారు.

# ముందస్తు పలాయనం!

## ‘తిరగబడమంటున్న’ జగన్ పిలుపు వెనుక వైసీపీ ఓటమి భయం

## వైసీపీ అభ్యర్థులు నామినేషన్లకే దూరమవడం.. అందుకు సంకేతం?

**పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల తొలి మెట్టు నామినేషన్ల దగ్గరే వైసీపీ పలాయన మార్గాలను వేసుకుంటుంది. అభ్యర్థుల్ని బరిలో నిలపడంకంటే.. ఎన్నికల ఘర్షణలను రేకెత్తించడంపైనే ఆ పార్టీ దృష్టి పెట్టింది. పార్టీ అధినేత జగన్ ‘తిరగబడండి’ అంటూ ఇస్తున్న పిలుపు.. ఎన్నికల ప్రక్రియను అపఖ్యాతి పాలు చేసే దుస్సాహసమే! ప్రక్రియ మొదలైన దగ్గర్నుంచీ పరిణామాలను పరికిస్తే.. పోలింగ్‌కు ముందే వైసీపీ ఓటమిని అంగీకరిస్తోందా.. అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. అదే సమయంలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి.. ‘స్థానిక ఎన్నికలు సజావుగా జరగలేదన్న అపఖ్యాతి బురద’ను ప్రజా ప్రభుత్వంపై చిలకరించే ముష్కర వ్యూహాలకు పదును పెడుతున్నట్టే కనిపిస్తోంది!**



అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని 100 పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల ప్రక్రియ మొదలైంది. 13 మున్సిపల్ కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీలకు 28న పోలింగ్ జరగనుంది. మొత్తం 3,942 కార్పొరేటర్, కౌన్సిలర్ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియ అక్టోబర్ 16న మొదలై ఆదివారం మధ్యాహ్నం 3 గంటలతో ముగిసింది. నామినేషన్ల స్వీకరణకు రాష్ట్ర ఎన్నికల సంఘం 5,485 కేంద్రాలను ఏర్పాటు చేసింది. సోమవారం నామినేషన్ల పరిశీలన, అక్టోబర్ 21 వరకు ఉపసంహరణకు గడువు ఉంటుంది. అక్టోబర్ 28న పోలింగ్, 30న లెక్కింపు జరిపేందుకు ఎన్నికల సంఘం రంగం సిద్ధం చేసింది. గడచిన మూడు రోజుల్లో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులతోపాటు స్వతంత్రులూ పెద్ద సంఖ్యలోనే నామినేషన్లు దాఖలు చేశారు.

గడువు ముగిసే సమయానికి కార్యాలయ ప్రాంగణాల్లో ఉన్నవారందరికీ అధికారులు టోకెన్లు ఇచ్చి మరీ నామినేషన్లు స్వీకరించారు. అంటే చివరి నిమిషంలో వచ్చిన అభ్యర్థులకూ ఎన్నికల యంత్రాంగం అవకాశమిచ్చింది. అయినా కొందరు వైసీపీ అభ్యర్థులు సమయానికి చేరుకోలేక నామినేషన్లు వేయలేకపోయామని చెప్పుకోవడం.. ఓటమి భయంతోనే. దాదాపు 25 మంది వైసీపీ అభ్యర్థులు నామినేషన్ వేయలేకపోయినట్టు సమాచారం అందుతోంది. ప్రకాశం జిల్లా దర్శిలో కౌన్సిలర్ అభ్యర్థులు పత్రాలు వేయకుండానే వెళ్లిపోయారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్ వేయలేదని సమాచారం. పిడుగురాళ్లలో చైర్మన్ అభ్యర్థి 20 నిమిషాలు ఆలస్యంగా రావడంతో అవకాశం కోల్పోయారు. అభ్యర్థులను ఎంపిక చేసుకోవడం, వారిని సమయానికి కేంద్రాలకు చేర్చడం ఏ పార్టీకైనా ప్రాథమిక బాధ్యత. అయితే ఇక్కడ విచిత్రంగా.. వైసీపీ తన విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తించడంలో విఫలమై.. నెపాన్ని అధికార పార్టీపై నెట్టేసే పనిలో నిమగ్నమైంది.

### ఎన్నికల ప్రక్రియపై ‘తిరగబడమంటున్న’ జగన్..

నామినేషన్ల చివరి రోజు.. తాడేపల్లి నుంచి జగన్ రాజకీయ కార్యాచరణ చూస్తే, ఆయన లక్ష్యం ఎన్నికల్లో గెలవడం కంటే ఎన్నికల వాతావరణాన్ని దెబ్బతీయడమే అనిపిస్తుంది. బెంగళూరు నుంచి తాడేపల్లికి చేరిన జగన్.. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ను కలిశారు. రాష్ట్రంలో ఒక్క వైసీపీ అభ్యర్థి నామినేషన్ వేయలేకున్నా.. ఆ అపకీర్తి కమిషన్‌కే దక్కుతుందంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శించడం హాస్యాస్పదం. అటుపిమ్మట గవర్నర్‌ను కలిసి జగన్.. ఎనిమిదిచోట్ల ఒక్క నామినేషన్ కూడా వేయనివ్వ లేదంటూ తమ పార్టీ వైఫల్యాన్ని అధికార పార్టీపై గుమ్మరించే ప్రయత్నం చేశారు. అన్నిటికంటే కీలకమైనది –ఆయన తమ పార్టీ శ్రేణులకు ఇచ్చిన పిలుపు.. ప్రజాస్వామ్యవాదులకు విస్మయాన్ని కలిగించింది. ప్రజాస్వామ్యబద్ధంగా సాగుతోన్న ఎన్నికల ప్రక్రియపై పార్టీ కార్యకర్తలంతా తిరగబడాలంటూ జగన్ ఇచ్చిన పిలుపు –ప్రజాస్వామ్యంపట్ల జగన్ వైఖరిని తేటతెల్లం చేసింది.

ఉద్రిక్త వాతావరణం సృష్టించి పబ్బం గడుపుకుందామనే జగన్ వైఖరి.. నామినేషన్ల మొదటి రోజే పుంగనూరు, రాయచోటి, తిరుపతివంటి చోట్ల తేటతెల్లమైంది. పుంగనూరు ఘర్షణలకు సంబంధించి వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిపై నాలుగు కేసులు నమోదయ్యాయి. మరో 250మందికి పైగా వైసీపీ నేతలపైనా కేసులుపడ్డాయి. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించి వందలాది మందితో కాన్వాయ్‌గా రావడమే ఘర్షణలకు దారితీసిందని అధికార వర్గాలే చెబుతున్నాయి. ఇలాంటి వాతావరణం కొనసాగితే, ‘ఎన్నికలు స్వేచ్ఛగా జరగలేదు’ అనే వాదనకు పదునుపెట్టి.. ఓటమి తరువాత ఆ వాదనను తెరపైకితెచ్చే కపటయోచన వైసీపీ వైఖరిలో స్పష్టమవుతోంది.

### ఓటమి భయంతో పోటీకి ముందే తప్పుకుంటున్న శ్రేణులు

వైసీపీలో ఓటమి భయం ఎంతగా పేరుకుపోయిందో పుంగనూరు ఉదంతం ఒక్కటి చాలు. 2024లో వైసీపీ గెలిచిన కొద్ది స్థానాల్లో ఇదీ ఒకటి. ఈ నియోజకవర్గం అక్కడి పెద్దిరెడ్డి కుటుంబానికి పట్టున్న ప్రాంతంగా పేరుంది. అక్కడ పార్టీ ఒక్క నామినేషన్ కూడా వేయలేదు. మున్సిపల్ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రకటించారు. పుంగనూరుకు రావద్దంటూ పోలీసులు పెద్దిరెడ్డికి, మిథున్‌రెడ్డికి నోటీసులు ఇచ్చారు. వారు వెళ్లకపోవడంతో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లకు రాలేదని సమాచారం. తమ ఇలాకాగా చెప్పుకునే వైసీపీ పెద్దలు.. మొత్తం పుంగనూరునే ఎన్నికల బరికి దూరంపెట్టడం.. వైసీపీ ఓటమి భయంలోని తీవ్రతను అంచనా వేసుకోవచ్చు. ఘోర పరాజయం ఎదురైతే.. పెద్దిరెడ్డి కుటుంబ రాజకీయ భవిష్యత్తు, ప్రతిష్ఠవంటి అంశాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారన్న చర్చ రాజకీయ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. ఓడిపోతే ఆ పరాజయం కుటుంబ ప్రతిష్ఠపై పడుతుంది. పోటీ చేయకపోతే బహిష్కరణగా చెప్పుకోవచ్చు. ఈ లెక్కే ఇందులో పనిచేసి ఉండొచ్చన్న మాట రాజకీయ వర్గాలనుంచి వినిపిస్తోంది. ఇదే సమయంలో వైసీపీ అంతర్గత సమావేశం గురించి వచ్చిన సమాచారాన్నీ గమనించాలి. అభ్యర్థుల గెలుపోటములతో సంబంధం లేకుండా వారికి అండగా నిలవాలని జగన్ నియోజకవర్గ బాధ్యులకు సూచించారన్నది గట్టిగా వినిపిస్తోన్న మాట. ఈ సూచన ఓటమికి మానసికంగా సిద్ధమవుతున్న నాయకత్వాన్ని సూచిస్తోంది. శ్రేణుల్ని గెలుపు కోసం సిద్ధం చేసేవారు సాధారణంగా ఇలా మాట్లాడరు.

### కోర్టుల్లో వరుస ఎదురుదెబ్బలు

నామినేషన్ల గడువును పెంచాలంటూ వైసీపీ హౌస్‌మోషన్ పిటిషన్ వేసింది. హైకోర్టు దాన్ని కొట్టేసింది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చాక జోక్యం చేసుకోలేమని ఉన్నత న్యాయస్థానం విస్పష్టంగా తేల్చింది. కోర్టులను ఆశ్రయించి.. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్‌నే మార్చేద్దామనుకున్న జగన్ అత్యాశ.. కోర్టు గుమ్మంలోనే నీరుగారిపోయింది. జగన్‌కు ఇది కొత్త విషయం కాదని, గతంలోనూ స్థానిక ఎన్నికలను ఆపడానికి కేసులు వేసిన ఘట్టాలను టీడీపీ నేతలు సందర్భోచితంగా గుర్తు చేస్తున్నారు.

### 2021 అద్దంలో వైసీపీ ముఖం

జగన్ ఇప్పుడు ఎన్నికల స్వేచ్ఛ గురించి మాట్లాడుతుంటే, 2021నాటి స్థానిక ఎన్నికల రికార్డు గుర్తుకు రావడం సహజం. అప్పట్లో వైసీపీ అధికారంలో ఉంది. నామినేషన్ల సమయంలో ప్రతిపక్ష అభ్యర్థులపై దాడులు జరిగాయి. బెదిరింపులతో ఉపసంహరణలు చేయించారు. వైసీపీ కుట్రల చరిత్ర చెరిపేస్తే చెరిగిపోయేది కాదు. అప్పట్లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్న నిమ్మగడ్డ రమేష్ కుమార్, 2020 మార్చి 18న కేంద్ర హోంశాఖ కార్యదర్శికి లేఖ రాసి, తనకు, తన కుటుంబానికి రక్షణ కావాలని కోరిన విషయం రికార్డుల నుంచి చెరిగిపోదు.

ఏకగ్రీవాల విషయంలోనూ, కడప జిల్లాలో ఎంపీటీసీ స్థానాల్లో దాదాపు 80శాతం ఏకగ్రీవమయ్యాయన్న ఆనాటి గణాంకాలను, వైసీపీ దురాగతాలను రాజకీయ విశ్లేషకులు ప్రత్యేకంగా ప్రస్తావిస్తోన్న అంశం స్పష్టంగా కనిపిస్తోన్నదే. ఆనాటి ఎన్నికలు ఏ స్థాయిలో ఏకపక్షంగా జరిగాయో ప్రజలకు తెలీంది కాదు. అందుకే –స్థానిక ఎన్నికలలో వైసీపీకి అన్యాయం జరుగుతోందంటూ జగన్ గొంతచించుకున్నా.. ప్రజలు నవ్వుకుంటున్నారు. తన ఐదేళ్ల పాలనలో ఎన్నికల వ్యవస్థల విశ్వసనీయతను జగన్ ఎంత పలుచన చేశాడన్నది ప్రజలు కళ్లారా చూసిందే. ప్రతిపక్ష హోదా కూడా దక్కని స్థాయిలో జగన్‌ను కూర్చోబెట్టింది ఇందుకే.

### ఓటమిని ముందే అంగీకరించినట్టేనా?

వైసీపీకి ప్రజాబలం లేదన్నది 2024లో 175 స్థానాల్లో కేవలం 11 సీట్లకు పరిమితమైనపుడే అర్థమైంది. జగన్ అసాధారణ ధోరణితో క్షేత్రస్థాయిలో వైసీపీకి కొన ఊపిరి కూడా లేని స్థితి. పులివెందులలో కూడా పరిస్థితి సవాలుగా మారింది. అక్కడ ఇటీవలి జెడ్పీటీసీ ఉపఎన్నిక ఫలితాన్ని మున్సిపల్ ఎన్నికలకు నేరుగా కొలమానంగా తీసుకోలేమని విశ్లేషకులు అంటున్నా, జగన్‌కు సొంత ప్రాంతంలో ఎదురయ్యే ఫలితం రాష్ట్ర రాజకీయాల్లో చర్చకు దారితీస్తుందని భావిస్తున్నారు. బరిలోకి దిగేందుకు జగన్ నిర్ణయించిన అభ్యర్థులు ముందుకు రావడం లేదు. కొన్నిచోట్ల నామినేషన్లు వేయని అభ్యర్థులు, గడువు దాటి వచ్చినవారు, పూర్తిగా పోటీకి దూరమైన పుంగనూరు.. ఇవన్నీ వైసీపీ క్యాడర్‌లో అనాసక్తిని స్పష్టం చేస్తోంది. గవర్నర్, ఎన్నికల కమిషనర్, న్యాయస్థానాలకు వెళ్లడం, ‘తిరోగమన ఫలితాన్ని వ్యవస్థలపైకి నెట్టివేసే ప్రయత్నమే’నని పార్టీ శ్రేణులే వ్యాఖ్యానిస్తున్నారు.

స్థానిక ఎన్నికలు కేవలం ఆరంభ రేఖ మాత్రమేనని, అసలు పోరు 2029లోనే ఉంటుందని జగన్ పదేపదే చెప్పడం కూడా.. వైసీపీ అసమర్థతపై ఒక నిర్ణయానికి వచ్చేయడమేనని పరిశీలకులు అంటున్నారు. ఎన్నికలకు ముందే వాటి ప్రాధాన్యాన్ని తగ్గించి చెప్పడం, ఓటమి వస్తే దాని దెబ్బ తగ్గించుకునే ప్రయత్నంగానూ విశ్లేషిస్తున్నారు.

ఎన్నికల్లో గెలుపోటములు సహజం. కానీ ఓటమి భయంతో ఎన్నికల ప్రక్రియనే పక్కదారి పట్టించే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి మంచిదికాదన్న ఇంగితం వైసీపీ గుర్తెరగాలి. ‘తిరగబడండి’ అనే పిలుపు, పోటీకి దూరం అవుతున్న శ్రేణులు, సంస్థలపై ముందస్తు విమర్శలు.. ఇవన్నీ ఒకే దిశను చూపిస్తున్నాయి. అదేమిటంటే, ఎన్నికల తీర్పును ఎదుర్కొనే ధైర్యంకంటే, తీర్పుపై సందేహాలు రేపే వ్యూహమే వైసీపీ నాయకత్వానికి సులువైన మార్గంగా కనిపిస్తోంది. అక్టోబర్ 28న ఓటర్లు ఇచ్చే తీర్పు వైసీపీ వ్యూహానికి సమాధానం ఇవ్వకపోదు!

## నాడు ఎన్నికల కమిషనర్‌నే తప్పించారు..

# నేడు ప్రజాస్వామ్యంపై నీతులా జగన్?

- అధికారంలో ఉన్నప్పుడు స్థానిక ఎన్నికల్లో చేసిన అరాచకాలపై నోరు విప్పని జగన్‌కు నేడు రాజ్యాంగం గుర్తొచ్చిందా?
- మాచర్లలో బొండా ఉమ, బుద్ధా వెంకన్నలపై జరిగిన దాడికి బాధ్యులెవరు?
- పుంగనూరు నుంచి నెల్లూరు వరకు ప్రతిపక్ష అభ్యర్థులపై జరిగిన దాడులకు సమాధానం చెప్పండి
- వైసీపీ హయాంలో ప్రాణరక్షణే ప్రశ్నార్థకమై పరిషత్ ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చిన పరిస్థితి మరిచిపోయారా?
- ఎస్ఈసీ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ పదవీకాలాన్ని కుదించిన మీరా ఎన్నికల సంఘం స్వతంత్రత గురించి మాట్లాడేది?
- ప్రజాస్వామ్యం అంటే అధికారంలో ఉన్నప్పుడు ఒక నీతి.. నేడు మరో నీతా?
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ధ్వజం

అమరావతి (చైతన్యరథం): నాడు అప్రజాస్వామికంగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌నే తప్పించిన జగన్ రెడ్డి నేడు ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా.. రాజ్యాంగబద్ధ పాలన సాగుతోందా.. చట్టం, న్యాయం పనిచేస్తున్నాయా.. అంటూ గొడ్డలి పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాజా మీడియా సమావేశంలో చేసిన వ్యాఖ్యలపై మంత్రి తీవ్రస్థాయిలో స్పందించారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, నేడు మరో విధంగా ప్రజాస్వామ్యాన్ని నిర్వచించడం తగదని పేర్కొన్నారు. నేడు ఎన్నికల సంఘం, పోలీసు యంత్రాంగం, నామినేషన్ల ప్రక్రియపై జగన్ సంధిస్తున్న ప్రశ్నలనే 2020 స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వైసీపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు అడిగారని గుర్తుచేశారు. ఆనాడు ప్రతిపక్ష అభ్యర్థులపై దాడులు, బెదిరింపులు, నామినేషన్ పత్రాల ధ్వంసం, బలవంతపు ఉపసంహరణలపై వచ్చిన ఫిర్యాదులకు నాటి ప్రభుత్వం ఇచ్చిన సమాధానమేమిటని నిలదీశారు. ప్రజాస్వామ్య పరిరక్షణపై ఉపన్యాసాలు ఇచ్చే ముందు ఐదేళ్ల వైసీపీ పాలనలో చోటుచేసుకున్న వివాదాలపై జగన్ ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### ఎన్నికలనే బహిష్కరించాల్సి వచ్చిన పరిస్థితి మరిచిపోయారా?

వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు స్థానిక ఎన్నికల్లో పోటీ చేయడం కంటే కార్యకర్తల ప్రాణాలను కాపాడుకోవడమే ప్రధాన సమస్యగా మారిందని నాటి పరిస్థితులను అచ్చెన్నాయుడు గుర్తుచేశారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గస్థాయి వరకు ప్రతి పక్ష అభ్యర్థులు ఎదుర్కొన్న బెదిరింపులు, భౌతిక దాడులు, నామినేషన్ల అడ్డగింత లపై ఎన్నో ఫిర్యాదులు చేసినా స్వేచ్ఛా యుత వాతావరణం నెలకొంటుందని విశ్వాసం కలగలేదని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై తీవ్ర అభ్యంతరాలు, రాష్ట్ర ఎన్నికల సంఘం వ్యవహారశైలిపై అపనమ్మకం నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించిందని తెలిపారు. దాదాపు నాలుగు దశాబ్దాల రాజకీయ చరిత్ర కలిగిన పార్టీ ఇలాంటి అసాధారణ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందంటే పరిస్థితుల తీవ్రతను అర్థం చేసుకోవాలని అన్నారు. నాడు టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయడానికి రక్షణ కోరినప్పుడు స్పందించని వైసీపీ నాయకత్వం ఇప్పుడు అదే సమస్యలను ప్రస్తావించడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

### మాచర్ల ఘటన గుర్తులేదా?

2020లో మాచర్లలో నామినేషన్ల ప్రక్రియకు సంబంధించిన వివాదాల నేపథ్యంలో టీడీపీ నాయకులు బొండా ఉమామహేశ్వరరావు, బుద్ధా వెంకన్న ప్రయాణిస్తున్న వాహనంపై కర్రలు, రాళ్లతో దాడి జరిగిన ఘటనను జగన్ గుర్తుచేసుకోవాలని అచ్చెన్నాయుడు అన్నారు. ఆ ఘటనలో వాహనం ధ్వంసమవడంతో పాటు వారి వెంట ఉన్న న్యాయవాది గాయపడిన విషయాన్ని ప్రస్తావించారు. వైసీపీ కార్యకర్తలే దాడికి పాల్పడ్డారని అప్పట్లో టీడీపీ ఆరోపించినప్పటికీ అధికార పార్టీ ఆ ఆరోపణలను ఖండించిందని తెలిపారు. ఒక మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ప్రయాణిస్తున్న వాహనంపైనే దాడి జరిగితే గ్రామాల్లో పోటీ చేస్తున్న సామాన్య కార్యకర్తల భద్రతపై ఎంతటి ఆందోళన నెలకొని ఉంటుందో ఆలోచించాలని ప్రశ్నించారు. నేడు తమ ఎంపీలకు రక్షణ లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న జగన్, ఆనాడు ప్రతిపక్ష నాయకుల భద్రతపై ఎందుకు అదే స్థాయిలో స్పందించలేదని నిలదీశారు.

### మహిళా అభ్యర్థులపైనా దాడులు

అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా పుంగనూరులో జనసేన అభ్యర్థి చినరాయుడు నామినేషన్ పత్రాలను చించివేశారన్న ఫిర్యాదులు, నెల్లూరులో బీజేపీ మహిళా అభ్యర్థి బి.మానెమ్మపై కత్తితో దాడి జరగడంతో ఆమెతో పాటు అల్లుడు గాయపడిన



ఘటనను మంత్రి ప్రస్తావించారు. తిరుపతి రూరల్‌లో టీడీపీ మహిళా అభ్యర్థి నామినేషన్ పత్రాలను ధ్వంసం చేశారన్న ఆరోపణలు వచ్చాయని, అనంతపురంలో జనసేన నాయకుడు మధుసూదన్‌రెడ్డిపై రాళ్ల దాడి జరిగినట్లు అప్పట్లో వార్తలు వెలువడ్డాయని తెలిపారు. కడప, కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో రాజకీయ ఘర్షణలు చోటుచేసుకోగా, ఉమ్మడి గోదావరి జిల్లాల్లోనూ అభ్యర్థులను బెదిరించి నామినేషన్లు ఉపసంహరింపజేస్తున్నారని జనసేన నాయకత్వం ఆందోళన వ్యక్తం చేసిందని గుర్తుచేశారు. ఈ ఘటనలపై నాటి ప్రభుత్వం నిర్వహించిన విచారణలు, తీసుకున్న చర్యలను జగన్ వెల్లడించాలని డిమాండ్ చేశారు. నేడు మహిళా అభ్యర్థులపై దాడులను ప్రస్తావిస్తున్న వైసీపీ అధినేత, అప్పట్లో ప్రత్యర్థి పార్టీల మహిళలు ఎదుర్కొన్న ఇబ్బందులపైనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

### నిమ్మగడ్డ విషయంలో హైకోర్టు తీర్పును మర్చిపోయారా?

రాజ్యాంగబద్ధ సంస్థల స్వతంత్రతపై వ్యాఖ్యలు చేస్తున్న జగన్‌కు 2020లో రాష్ట్ర ఎన్నికల సంఘంతో నాటి వైసీపీ ప్రభుత్వానికి జరిగిన వివాదం మరిచిపోయారా అని అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో మార్చి 15న స్థానిక ఎన్నికలను అప్పటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ వాయిదా వేయగా, అనంతరం వైసీపీ ప్రభుత్వం ఆర్డినెన్స్ నంబర్ 5 ద్వారా కమిషనర్ పదవీకాలాన్ని ఐదేళ్ల నుంచి మూడేళ్లకు తగ్గించిందని వివరించారు. ఈ చర్యతో నిమ్మగడ్డ పదవి కోల్పోగా, 2020 మే 29న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సంబంధిత ఆర్డినెన్స్‌ను, ప్రభుత్వ ఉత్తర్వులను కొట్టివేసి ఆయనను తిరిగి నియమించాలని ఆదేశించిందని గుర్తుచేశారు. ఎన్నికల కమిషనర్ పదవీకాలాన్ని మార్చేందుకు నాటి ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని న్యాయస్థానం తప్పుబట్టిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయాలతో విభేదించే హక్కు ప్రభుత్వానికి ఉన్నప్పటికీ దాని రాజ్యాంగ స్వతంత్రతను గౌరవించాల్సిన బాధ్యత కూడా ఉంటుందని స్పష్టం చేశారు.

### నాటి ఆరోపణలకు సమాధానం ఏది?

2020 స్థానిక ఎన్నికల వివాదాల సందర్భంగా హైకోర్టు విచారణ రికార్డుల్లో ప్రతిపక్షాలకు చెందిన అభ్యర్థుల నామినేషన్లను అడ్డుకున్న 35 ఘటనలు, బలవంతంగా ఉపసంహరింపజేసిన 23 సందర్భాలు, నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులపై జరిగిన 55 హింసాత్మక ఘటనలకు సంబంధించిన ఆరోపణలు ప్రస్తావనకు వచ్చాయని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఇవి కోర్టు నిర్ధారించిన నేరాల గణాంకాలు కాకపోయినా, అప్పటి ఎన్నికల వాతావరణంపై వ్యక్తమైన ఆందోళన తీవ్రతను తెలియజేస్తున్నాయని అన్నారు. అప్పటి ఎన్నికల కమిషనర్ కేంద్ర హోంశాఖకు రాసిన లేఖలో 2,362 ఎంపీటీసీ, 126 జెడ్పీటీసీ స్థానాలు ఏకగ్రీవమైనట్లు పేర్కొన్నారని గుర్తుచేశారు. భారీ సంఖ్యలో ఏకగ్రీవాలు నమోదైన పరిస్థితుల్లో ప్రత్యర్థి అభ్యర్థులకు సమాన అవకాశాలు లభించాయా అనే ప్రశ్నలకు నాటి పాలకులు స్పష్టత ఇవ్వాలని కోరారు. ఏకగ్రీవ ఎన్నికలన్నింటినీ అక్రమాలుగా పరిగణించలేమని, అయితే వాటికి సంబంధించి వచ్చిన నిర్దిష్ట ఫిర్యాదులపై విచారణ జరగడం ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసానికి అవసరమని అభిప్రాయపడ్డారు.

### మిథున్‌రెడ్డి ఘటనపై సమగ్ర విచారణ జరగాలి

పుంగనూరులో ఎంపీ మిథున్‌రెడ్డి వాహన శ్రేణిపై జరిగిన దాడి, నామినేషన్ కేంద్రాల వద్ద ఘర్షణలు, పోలీసుల వ్యవహారశైలిపై జగన్ చేసిన ఆరోపణలను చట్టపరంగా పరిశీలించాలని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సంఘటనలకు సంబంధించిన పూర్తి దృశ్యాలు, సీసీటీవీ రికార్డులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు, ఇరుపక్షాల ఫిర్యాదుల ఆధారంగా వాస్తవాలను నిర్ధారించాలన్నారు. హింసకు పాల్పడిన వ్యక్తులు ఏ పార్టీకి చెందినవారైనా చర్యలు తీసుకోవాలని, రాజకీయ హోదా ఎవరికీ చట్టం నుంచి మినహాయింపు ఇవ్వదని స్పష్టం చేశారు. అభ్యర్థులు నిర్భయంగా నామినేషన్లు సమర్పించే వాతావరణం కల్పించడం ఎన్నికల యంత్రాంగం, పోలీసుల బాధ్యతని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం అంటే అధికారంలో ఉన్నవారికి ప్రత్యేక హక్కులు, ప్రతిపక్షంలో ఉన్నవారికి పరిమిత అవకాశాలు కల్పించడం కాదని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ప్రతి అభ్యర్థికీ పోటీ చేసే స్వేచ్ఛ, ఓటరుకు నిర్భయంగా ఓటు వేసే హక్కు, బాధితుడికి న్యాయం పొందే అవకాశం ఉండాలన్నారు. గతంలో జరిగిన సంఘటనలపై ఒక ప్రమాణం, ప్రస్తుతం జరుగుతున్న ఘటనలపై మరో ప్రమాణం అనుసరించడం సరికాదని పేర్కొన్నారు. నేడు జగన్ లేవనెత్తిన ప్రతి ఆరోపణపై నిష్పక్షపాత విచారణ జరగాలని కోరుతున్నామని, అదే న్యాయసూత్రం వైసీపీ పాలనలో బాధితులైన ప్రతిపక్ష అభ్యర్థులు, కార్యకర్తలకూ వర్తించాలన్నదే తమ అభిప్రాయమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో పెచ్చుమీరిన గొడ్డలి పార్టీ అరాచకాలు

- స్థానిక ఎన్నికల్లో ఓటమిని అంగీకరించలేకనే దాడులు, దౌర్జన్యాలు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

తూర్పు నాయుడుపాలెం/ప్రకాశం (చైతన్యరథం): రాష్ట్రంలో గొడ్డలి పార్టీ అరాచకాలు పెచ్చు మీరాయని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. ఆదివారం నాడు ప్రకాశం జిల్లా టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.....స్థానిక ఎన్నికల్లో ఓటమి తప్పదనే భయంతోనే గొడ్డలి పార్టీ దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతోందని మండిపడ్డారు. పుంగనూరు, చిత్తూరు, మదనపల్లెలో గొడ్డలి పార్టీ హింసకు ప్రేరేపించింది.

దర్శిలో ఏకంగా ఎస్సైపై గొడ్డలి పార్టీ కార్యకర్తలు దాడి చేశారు. 5 ఏళ్ళ పాలనలో ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన జగన్ నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం సిగ్గుచేటు. నాడు సొంత బాబాయిని చంపి నారాసుర రక్త చరిత్ర అంటూ చంద్రబాబు చేతిలో కత్తి పెట్టి సాక్షి పత్రికలో అసత్య కథనాలు రాయించిన దుర్మార్గుడు జగన్.

ప్రజలు ఛీత్కరించినా సిగ్గు లేకుండా మళ్లీ నారాసుర రక్త చరిత్ర అంటూ అబద్ధాలు మాట్లాడుతున్నారు. రాష్ట్ర ప్రజలు జగన్ మాయ మాటలు నమ్మే పరిస్థితి లేదు. రాష్ట్రంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా స్థానిక ఎన్నికల్లో స్వేచ్ఛగా నామినేషన్ వేస్తున్నారు. దర్శిలో పోలీసులపై దాడి చేసిన గొడ్డలి పార్టీ గూండాలపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని మంత్రి డా.స్వామి స్పష్టం చేశారు.



# దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా జగన్ నీతిసూక్తులు

- ఆయన హయాంలో స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయట
- నాడు జరిగిన అరాచకాలు రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరిచిపోరు
- దాడులు, దౌర్జన్యాలు, హింస, బలవంతపు ఏకగ్రీవాలు.. ఇవేవీ జగన్‌కు గుర్తులేవా?
- ఎస్ఈసీని కలిసిన జగన్ బయట మీడియాతో నీతి పన్నాలు మాట్లాడటం హాస్యాస్పదం
- తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన ఎమ్మెల్సీ వర్ల రామయ్య

అమరావతి (చైతన్యరథం): వైఎస్ జగన్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లె వేయడం అనే నానుడికి సరిగ్గా సరిపోతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ వర్ల రామయ్య ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)ని కలిసిన అనంతరం మీడియా ముందు జగన్ మాట్లాడిన తీరు అత్యంత హాస్యాస్పదంగా, సిగ్గుచేటుగా ఉందని మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వర్ల రామయ్య మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లపాటు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మీడియా ముందుకు వచ్చింది వేళ్లమీద లెక్కపెట్టే రోజులు మాత్రమేనన్నారు. అలాంటి వ్యక్తి నేడు ఎస్ఈసీ వద్దకు వెళ్లి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

## 2021 నాటి రక్తచరిత్ర జగన్‌కు గుర్తు లేదా?

2021లో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో ప్రత్యర్థులను ఏ విధంగా భయభ్రాంతులకు గురిచేశారు? నామినేషన్ పత్రాలను ఎలా లాక్కుని చించేశారు? బలవంతపు ఏకగ్రీవాలతో ప్రజాస్వామ్యాన్ని ఏ విధంగా అపహాస్యం చేశారో రాష్ట్ర ప్రజలంతా చూశారు. ఆ రక్తచరిత్రను రాసిన వ్యక్తి ఈరోజు నిష్పాక్షికత, న్యాయం గురించి మాట్లాడటం పచ్చిబూతు కాక మరేమిటి? రాష్ట్రంలో ఎక్కడా స్వేచ్ఛగా నామినేషన్లు వేయనివ్వడం లేదని జగన్ పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. జగన్ మోహన్ రెడ్డికి నేరుగా సవాల్ విసురుతున్నాను. రాష్ట్రంలో ఏ కేంద్రం వద్ద వైఎస్సార్సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకున్నారో చెప్పండి? నేనే స్వయంగా అక్కడికి వస్తాను. మిమ్మల్ని ఎవరు అడ్డుకున్నారు? గుంపులు గుంపులుగా వచ్చి దౌర్జన్యాలు చేసేది మీరే, కర్రలు, కత్తులు, సారా సీసాలతో రౌడీయిజం సృష్టించేది మీ శ్రేణులే. కార్లను తగలబెట్టి, డ్యూటీలో ఉన్న పోలీసులపై సైతం దాడులకు పాల్పడేది మీ పార్టీ రౌడీలే. మీరే అరాచకాలు సృష్టించి, తిరిగి పోలీసులు.. సీఎం చంద్రబాబు నాయుడుకి కొమ్ము కాస్తున్నారంటూ ఏడ్వడం సరిగ్గా మొగుణ్ణి కొట్టి మొగసాలకెక్కినట్లుగా ఉంది. నామినేషన్ కేంద్రాల వద్ద పత్రాలు చించేస్తున్నారంటూ, పారామిలిటరీ బలగాలను దించాలని జగన్ డిమాండ్ చేయడం ఎన్నికల్లో ఓటమి భయంతో సాగిస్తున్న విన్యాసమే తప్ప మరొకటి కాదు. కూటమి ప్రభుత్వంలో ప్రతి పౌరుడికీ పూర్తి రక్షణ ఉంది, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరుగుతాయి. జగన్ ఇప్పటికైనా తన అసత్య ప్రచారాలు, కల్లిబొల్లి నాటకాలు మానుకోవాలని వర్ల రామయ్య హెచ్చరించారు.



## 2021లో మీరేమైనా మార్చారా?

స్ట్రాంగ్‌రూమ్‌ల్లో బ్యాలెట్ బాక్సులు మారుస్తారంటూ జగన్ మోహన్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేయడం చూస్తుంటే 'దొంగే దొంగ అన్నట్లుంది' అని వర్ల రామయ్య తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషనర్ వద్దకు వెళ్లి, బయటకు వచ్చి మీడియా ముందు జగన్ మాట్లాడిన ప్రతి మాటనూ నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నామని తెలిపారు. 'స్ట్రాంగ్ రూమ్స్‌లో బ్యాలెట్ బాక్సులు మారుస్తారని అనుమానంగా ఉంది' అని జగన్ మాట్లాడుతున్నారు. అసలు ఆ అనుమానం మీకెందుకు వచ్చింది జగన్ మోహన్ రెడ్డీ? మీరు సీఎంగా ఉన్నప్పుడు 2021 స్థానిక ఎన్నికల్లో మీరేమైనా బ్యాలెట్ బాక్సులను మార్చారా? మీ మనసులో ఆ దొంగ బుద్ధులు ఉన్నాయి కాబట్టే ఇతరులపైనా ఆ అనుమానం వస్తోంది. సీఎం చంద్రబాబుకి అనుగుణంగా పోలీసులు పనిచేస్తున్నారని, పోలీసులతో కలిసి ప్రభుత్వం 'మాఫియా'గా తయారైందని జగన్ అసంబద్ధ ప్రేలాపనలు చేస్తున్నారు. గతంలో మీ ఐదేళ్ల పాలనలో పోలీసు వ్యవస్థను ఏ విధంగా పాడుచేశారు, మీ సొంత రాజకీయ కక్షల కోసం ఎలా వాడుకున్నారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. మీ హయాంలో పోలీసులు మీకు ఊడిగం చేసినట్లుగా, ఈరోజు వారిని వాడుకోవాలనే ఆలోచన చంద్రబాబుకు లేదు, అలాంటి అవసరం కూడా కూటమి ప్రభుత్వానికి లేదు. చంద్రబాబు పాలనలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. నిమ్మగడ్డ రమేష్ కుమార్ ఎస్ఈసీగా ఉన్నప్పుడు మేం స్థానిక ఎన్నికలకు వెళ్లాం, ప్రజలకు మంచి చేశాం కాబట్టే క్లీన్ స్వీప్ చేశాం అని జగన్ గొప్పలు చెప్పుకుంటున్నారు. ప్రజలు మెచ్చి స్వచ్ఛందంగా పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓట్లు వేస్తే మీకు అన్ని సీట్లు వచ్చాయా? 2021లో మీరు చేసిన అరాచకాలు, బెదిరింపులు, కిడ్నాప్‌లు, బలవంతపు ఏకగ్రీవాల చరిత్ర అందరికీ గుర్తుంది. మీరు చేసింది ప్రజాస్వామ్య ఖూనీ తప్ప ప్రజాతీర్పు కాదు. చంద్రబాబుకి స్వేచ్ఛగా ఎన్నికలు జరిపే ధైర్యం లేదంటూ జగన్ మాట్లాడటం అత్యంత హాస్యాస్పదం. జగన్ మాట్లాడిన ప్రతి మాటా పచ్చి అబద్ధాల పుట్ట. ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిపోవడంతోనే సానుభూతి కోసం జగన్ ఇలాంటి విన్యాసాలకు తెరలేపారని వర్ల రామయ్య ఎద్దేవా చేశారు.

## బలవంతపు ఏకగ్రీవాల రక్తచరిత్ర

2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారాన్ని, పోలీసు యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సాగించిన అరాచకాలను, బలవంతపు ఏకగ్రీవాల పర్వాన్ని ఎమ్మెల్సీ వర్ల రామయ్య గణాంకాలతో సహా ఎండగట్టారు. నాడు వ్యవస్థలను ధ్వంసం చేసి, నేడు నీతులు మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. నాడు స్థానిక ఎన్నికల్లో జగన్ రెడ్డి ప్రభుత్వం పోలీసులను మాఫియాలా వాడుకుని అరాచకం సృష్టించిందని మండిపడ్డారు. రాష్ట్రంలో మొత్తం 2,794 మున్సిపల్ వార్డులు ఉంటే ఏకంగా 578 వార్డులను ఏకగ్రీవం చేసుకున్నారు. దాదాపు 13,000 సర్పంచ్ స్థానాల్లో ఏకంగా 2,197 సర్పంచ్ పదవులను ఏకగ్రీవం చేసుకున్నారు. 10,047 ఎంపీటీసీ స్థానాల్లో 2,371 ఎంపీటీసీలను ఏకగ్రీవం చేశారు. మొత్తం 660 జడ్పీటీసీలకు గాను 126 జడ్పీటీసీలను ఏకగ్రీవం చేసుకున్నారు. ప్రపంచంలో ఎక్కడైనా ఇన్ని స్థానాలు ఏకగ్రీవం కావడం సాధ్యమా? అభ్యర్థుల ఇళ్లలో దొంగ సారా సీసాలు పెట్టి తప్పుడు కేసులు బనాయించడం, అభ్యర్థులను పోలీసులతో కిడ్నాపులు చేయించడం, నామినేషన్లు వేయకుండా ఇంటి ముందు కాపలాలు పెట్టి బెదిరించడం వల్లే ఇవన్నీ జరిగాయని ధ్వజమెత్తారు. పుంగనూరు నియోజకవర్గంలో 84 గ్రామ పంచాయతీలు ఉంటే 82 ఏకగ్రీవం చేసుకున్నారు. అలాగే మాచర్లలో 74కు 74 పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. అక్కడ ఉన్నది ప్రజానాయకులా లేక ఫ్యాక్షనిస్టులా? ఇది పచ్చి దౌర్జన్యం, అరాచకం కాదా అని నిలదీశారు. వైసీపీ ప్రభుత్వ దుర్మార్గాలు, దాడులు భరించలేక నాటి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కంటనీరు పెట్టుకున్నారని వర్ల రామయ్య గుర్తుచేశారు. ఇవి ఎన్నికలే కావంటూ కేంద్ర హోంమంత్రికి 8 పేజీల సుదీర్ఘ లేఖ రాసిన సంగతి జగన్ రెడ్డి మరిచిపోయారా? అలాంటి ఎన్నికలను తాము ప్రశాంతంగా నిర్వహించామని జగన్ చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పుంగనూరులో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సాగించిన దౌర్జన్యాలను చూసి, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు ఆయన్ను ఇంటి నుంచి బయటకు రావద్దని 2021 ఫిబ్రవరి 6న నాటి ఎస్ఈసీ గృహ నిర్బంధ ఉత్తర్వులు జారీ చేసింది వాస్తవం కాదా? దీనికి జగన్ మోహన్ రెడ్డి ఏం సమాధానం చెబుతారు? సమాధానం చెప్పే ధైర్యం ఉందా? అని వర్ల రామయ్య ప్రశ్నించారు. గతంలో ప్రజాస్వామ్యాన్ని తుంగలో తొక్కిన జగన్ మోహన్ రెడ్డి, ఇప్పుడు ప్రతిపక్షంలోకి రాగానే నీతులు వల్లిస్తూ మాట్లాడటం హాస్యాస్పదమని, ఆయన కపట నాటకాలను రాష్ట్ర ప్రజలు ఎవరూ నమ్మరని స్పష్టం చేశారు.

## జగన్‌కు నైతిక హక్కు లేదు

2021 స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయంటూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని, అసలు ప్రజల ముందుకు వచ్చి మాట్లాడే నైతిక హక్కే ఆయనకు లేదని వర్ల రామయ్య ధ్వజమెత్తారు. నాటి డీజీపీ గౌతమ్ సవాంగ్ ఇచ్చిన అధికారిక నివేదికలే వైసీపీ హయాంలో జరిగిన రక్తచరిత్రకు సజీవ సాక్ష్యాలని స్పష్టం చేశారు. 2021 ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జగన్ బుకాయిస్తున్నారు. ఆనాడు మీ ప్రభుత్వంలో డీజీపీగా పనిచేసిన గౌతమ్ సవాంగ్ ఇచ్చిన అధికారిక లెక్కలేమిటో జగన్ ఒక్కసారి గుర్తుచేసుకోవాలి. నామినేషన్ల ప్రక్రియ సమయంలోనే రాష్ట్రవ్యాప్తంగా 57 చోట్ల తీవ్ర హింసాత్మక ఘటనలు జరిగాయి. జడ్పీటీసీ, ఎంపీటీసీ నామినేషన్లలో 43 చోట్ల, మున్సిపాలిటీల్లో 14 చోట్ల భారీ హింసాకాండ చెలరేగింది. గుంటూరు, మాచర్ల, సత్తెనపల్లి, పల్నాడు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో రక్తపాతం సృష్టించారు. పోలింగ్ రోజున 33 తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. కేవలం పల్నాడు జిల్లాలోనే 22 కేసుల్లో 581 మంది ముద్దాయిలు ఉన్నారు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో 7 కేసుల్లో 728 మంది, తిరుపతి జిల్లాలో 4 కేసుల్లో 61 మంది నిందితులుగా తేలారు. మీ పార్టీ నేతలు, కార్యకర్తల దౌర్జన్యాలపై ఏకంగా 1,370 మందిపై క్రిమినల్ కేసులు నమోదైన రికార్డులు ఉన్నాయి. ఇదా మీరు ప్రశాంతంగా ఎన్నికలు జరిపిన లక్షణం? తెనాలిలో నామినేషన్ వేయడానికి సిద్ధమవుతున్న అభ్యర్థులపై దొంగ సారా కేసులు బనాయించారు. ఒక మహిళా అభ్యర్థి తన నామినేషన్ పత్రాలను కాపాడుకోవడానికి జాకెట్టులో పెట్టుకుని కార్యాలయానికి వెళ్తే, ఆ పత్రాలను కూడా లాగి చించేసిన దుర్మార్గులు మీ పార్టీ రౌడీలు. 70 ఏళ్ల వృద్ధుడు నామినేషన్ వేయడానికి వస్తే కర్రలతో రక్తం కారేటట్టు కొట్టి రోడ్లపై పరుగులు పెట్టించారు. ఇలాంటి పాపాలు చేసిన మీరు ఈరోజు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతుంటే సిగ్గుతో తలదించుకోవాలి. 2021లో జగన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగినవి ఎన్నికలే కావని నాటి ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. నాటి ఎన్నికల కమిషనర్ రాసిన లేఖలు, నమోదైన హింసాత్మక ఘటనల తాలూకు నివేదికలు, వైసీపీ సాగించిన అరాచకాల భాగవతం మొత్తం కేంద్ర హోం శాఖ వద్ద పక్కాగా నమోదై ఉన్నాయి. ఎన్నికల కమిషనర్‌ను కలిసి వచ్చిన తర్వాత మీడియా ముందు జగన్ మోహన్ రెడ్డి మాట్లాడిన ప్రతి మాటా తప్పుల తడక, అబద్ధాల పుట్ట. అధికారం కోల్పోయాక కూడా తప్పుడు మాటలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన జగన్ రెడ్డికి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే ఏ ఒక్క నైతిక హక్కూ లేదని వర్ల రామయ్య తేల్చిచెప్పారు.

# వైసీపీ విధ్వంసాలపై ఎస్ఈసీకి టీడీపీ ఫిర్యాదు

- పులివెందుల, దర్శి, రాయచోటి ఘటనలపై ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్ అందజేత
- ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్



అమరావతి(చైతన్యరథం):రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సాగించిన దౌర్జన్యాలు, విధ్వంసాల పై తెలుగుదేశం పార్టీ ప్రతినిధి బృందం ఆదివారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు ఫిర్యాదు చేసింది. పులివెందుల, దర్శి, రాయచోటి,తదితర ప్రాంతాల్లో వైసీపీశ్రేణులు సాగించిన దాడులు, విధ్వంసాలు, ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు,ఎమ్మెల్సీ వర్ల రామయ్య, ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్.రాజశేఖర్‌లతో కూడినబృందం ఎన్నికల కమిషనర్‌కు సమగ్ర లిఖితపూర్వక ఫిర్యాదును అందజేసింది.దర్శి, రాయచోటి ప్రాంతాల్లో నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా టీడీపీ అభ్యర్థులు, పోలీసులపై వైసీపీ గూండాలు సాగించిన దౌర్జన్యాలు, బెదిరింపులు,వాహనాల ధ్వంసానికి సంబంధించిన స్పష్టమైన వీడియో ఆధారాలతో కూడిన పెన్‌డ్రైవ్‌ను ఎన్నికల కమిషనర్‌కు సమర్పించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ పోలీసులపై దాడులకు పాల్పడిన దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, కడప ఎంపీ అవినాష్‌రెడ్డిలపై తక్షణమే కేసులు నమోదుచేసి కఠిన చర్యలుతీసుకోవాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు.

చైతన్యరథం

# గతం మరిచి నేడు నీతులా?

- జగన్‌పై ఎమ్మెల్యే ధూళిపాళ్ల మండిపాటు
- అధికారంలో ఉన్నప్పుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన గొడ్డలిపార్టీ
- నాడు స్థానిక ఎన్నికల్లో వైసీపీ నేతల అరాచకాలకు అంతేలేదు, నేడు ఓటమి భయంతో విధ్వంసం
- ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికల నిర్వహణకు కట్టుబడిన కూటమి ప్రభుత్వం
- పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్

అమరావతి (చైతన్యరథం): వైసీపీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన ఘోరాలు, అరాచకాలను మరిచిపోయి నేడు జగన్‌రెడ్డి నీతిసూత్రలు వల్లిస్తున్నాడని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. తమ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్యయుతంగా జరిగాయని చెప్పుకుంటున్నారు.. అప్పటి రాష్ట్ర ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయని అబద్ధాలు చెబుతున్నారు.. కానీ ఆనాడు స్థానిక ఎన్నికలు జరిగిన తీరును రాష్ట్ర ప్రజలు మర్చిపోలేదన్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అధికారంలో ఉన్నప్పుడు జగన్మోహన్ రెడ్డి మంత్రులను, ఎమ్మెల్యేలను బెదిరించారు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో వందకు వందశాతం ఫలితాలు సాధించకపోతే మంత్రి పదవులు ఉండవు..ఏకగ్రీవాలు చేయకపోతే రాబోయే ఎన్నికల్లో టికెట్లు ఉండవని హెచ్చరించారన్నారు. ఆ బెదిరింపులతోనే రాష్ట్రంలో ఎన్నడూ లేని స్థాయిలో ఏకగ్రీవాలు జరిగాయి. కడప జిల్లాలో 553ఎంపీటీసీల్లో 439 (దాదాపు 80శాతం), 50 జెడ్పీటీసీ సభ్యుల్లో 38 (78 శాతం) ఏకగ్రీవాలు అయ్యాయి.ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే కాదు, భారతదేశ చరిత్రలోనూ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంత పెద్ద ఎత్తున ఏకగ్రీవాలు ఎప్పుడూ జరగలేదు. ఇవి బెదిరింపులు, దౌర్జన్యాలు, కిడ్నాప్‌ల ద్వారా సాధించినవే. పులివెందుల, పుంగనూరు, ధర్మవరం, ఉమ్మడి గుంటూరు జిల్లాలో నామినేషన్లు వేసే సమయంలో టీడీపీ అభ్యర్థులపై దాడులు చేశారు. మాచర్లలో తెలుగుదేశంపార్టీ నాయకులు బోండా ఉమ, ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, న్యాయవాది కిశోర్‌ల కారుపై వైసీపీ నాయకులు దాడి చేశారు. పోలీస్ స్టేషన్లలో అభ్యర్థులను పిలిపించి తుపాకి పెట్టి బెదిరించి విత్‌డ్రా చేయించిన సంఘటనలు ఉన్నాయి. కిడ్నాప్‌లు జరిగాయి. చిత్తూరు, గుంటూరు జిల్లాల్లో దౌర్జన్యాలు జరిగిన ప్రాంతాల్లో ఎస్పీలను బదిలీ చేయాలని, పలమనేరు, శ్రీకాళహస్తి, పులివెందు లలో డీఎస్పీలపై చర్యలు తీసుకోవాలని స్టేట్ ఎలక్షన్ కమిషన్ సిఫార్సు చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న స్టేట్ ఎలక్షన్ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ పైనే కుల ముద్ర వేసి బురదచల్లారు. ఆయన కుటుంబాన్ని బెదిరించారు. ప్రాణహాని ఉందని, కేంద్ర బలగాల రక్షణ కావాలని కేంద్ర హోం సెక్రటరీకి నిమ్మగడ్డ లేఖ రాశారంటే ఎంతలా బెదిరిపోయారో అర్థం చేసుకోవచ్చు. స్థానిక ఎన్నికల సందర్భంగా పెద్ద ఎత్తున జరిగిన దాడులు, ఉపసంహరణల గురించి ఆ లేఖలో స్పష్టంగా పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీతోపాటు బీజేపీ, జనసేన అభ్యర్థులపై కూడా దాడులు జరిగినట్లు నివేదించారని ధూళిపాళ్ల గుర్తుచేశారు.



**గతం మరిచి నీతులా..**

అవన్నీ మర్చిపోయిన జగన్ ఇవాళ ప్రజాస్వామ్య పరిరక్షకుల్లా మాట్లాడుతున్నారు. కానీ అధికారంలో ఉన్నప్పుడు రాజ్యాంగ వ్యవస్థలనే బెదిరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను పాటించాల్సిన అవసరం లేదని చెప్పి అధికారాన్ని అడ్డగించారు. ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్న సమయంలో మళ్లీ అదే ప్రాంతాల్లో – పులివెందుల, పలమనేరు, రాయచోటి, పుంగనూరు – దౌర్జన్యాలు చేస్తున్నారు. కర్ణాటక నుంచి రౌడీలను, పంజాబ్ నుంచి సాయుధ ముఠాలను తీసుకొచ్చి విధ్వంసం సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నారు. ఎంపీలు వీధి గుండాల్లా ప్రవర్తిస్తున్నారు. ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసిన తర్వాత కూడా అరాచకాలకు పాల్పడుతున్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్టీ రామారావు నుంచి చంద్రబాబు నాయుడు వరకు ప్రజాస్వామ్యాన్ని నమ్మిన పార్టీ. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నాం. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అందించిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుకున్న ప్రజలు మాతో నడుస్తున్నారు. దాన్ని చూసి భయపడి కొన్ని చోట్ల విధ్వంసం సృష్టించి ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. వైసీపీ నాయకులు 2021 స్థానిక ఎన్నికల్లో చేసిన పాపాల ఫలితం ఇప్పుడు అనుభవించబోతున్నారు. ప్రజలు గతాన్ని గుర్తుంచుకొని, ప్రజాస్వామ్యాన్ని కాపాడే శక్తులను బలపరుస్తారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల స్పష్టం చేశారు.

---

## మచిలీపట్నం మున్సిపాలిటీపై
# కూటమి జెండా ఎగరేస్తాం

- మంత్రి కొల్లు రవీంద్ర ఉద్ఘాటన




మచిలీపట్నం (చైతన్యరథం): గొడ్డలిపార్టీ నాయకులు కావాలనే స్థానిక ఎన్నికల సందర్భంగా అల్లర్లు సృష్టిస్తున్నారని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సయిజ్‌శాఖల మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. కృష్ణా జిల్లా కేంద్రం మచిలీపట్నంలో ఆదివారం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా అబ్దుల్ హమీదా నామినేషన్ నామినేషన్ కార్యక్రమానికి హాజరైన మంత్రి రవీంద్ర మాట్లాడుతూ గొడ్డలి పార్టీ నాయకులు కావాలనే రాష్ట్రంలో అరాచకాలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. మచిలీపట్నం మున్సిపాలిటీపై కూటమి జెండా ఎగరేస్తామని ఉద్ఘాటించారు. కూటమి నాయకులంతా ఒకే తాటిపై కలిసి నడుస్తున్నాం. మచిలీపట్నం మున్సిపాలిటీ అభివృద్ధి ప్రధాన అజెండాగా అడుగులేస్తున్నామని తెలిపారు.

గతంలో వైసీపీ పాలనలో మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను బెదిరించారు, దాడులు చేశారు. మాచర్లలో టీడీపీ నాయకులు బొండా ఉమా, బుద్ధా వెంకన్నపై వైసీపీ మూకలు హత్యాయత్నం చేశారు. అనంతరం దాడులు చేసిన వాళ్ళకి మున్సిపల్ చైర్మన్ పదవి ఇచ్చిన జగన్ దుర్మార్గాలను ప్రోత్సహించారు. నాడు స్థానిక సంస్థల ఎన్నికల్లో గొడ్డలి పార్టీ నాయకులు చేసిన అరాచకాలు జనాలు నేటికీ మర్చిపోలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో గొడ్డలి పార్టీ దుస్థితి జగన్‌రెడ్డికి అర్థమైపోయింది. పోటీ చేయడానికి అభ్యర్థులు కూడా దొరికే పరిస్థితి లేకపోవడంతో కూటమిపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తున్నాడు. మచిలీపట్నం మున్సిపల్‌కార్పొరేషన్ ఎన్నికలు జరగనీయకుండా పేర్ని నానితో కేసులు వేయించాడు. ఎన్నికలు జరగకూడదు.. ఈరాష్ట్రానికి రావాల్సిన 16వ ఆర్థిక సంఘం నిధులు రాకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా కుట్రలు చేస్తున్నారు. ఆ కేసులన్నీ కోర్టుల్లో వీగిపోయాయి. రాష్ట్రంలో స్వేచ్ఛా వాతావరణంలో ఎన్నికలు నిర్వహిస్తామని మంత్రి రవీంద్ర స్పష్టంచేశారు. మచిలీపట్నంలో అభివృద్ధికార్యక్రమాలు మరింత వేగవంతం చేస్తాం. కూటమి అభ్యర్థిని భారీమెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. వైసీపీ పాలనలో మచిలీపట్నంలో కనీస అభివృద్ధి కూడా చేయలేదన్నారు. ఇలాఉంటే మంత్రి కొల్లు రవీంద్రతో కలిసి భారీర్యాలీగా వెళ్ళి హమీదా నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు,వేలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

---

# గురివింద గింజ తీరులా జగన్ వైఖరి

- స్థానిక ఎన్నికలను అడ్డుకునేందుకే వైసీపీ నేతల విధ్వంసం
- నంగనాచిలా ఎస్ఈసీని కలిసి జగన్ ఫిర్యాదు
- పులివెందుల, రాయచోటి, దర్శి ఘటనలు ఎందుకు వివరించలేదు?
- పుంగనూరులో పోటీలేదని ప్రకటించిన పెద్దిరెడ్డికి వచ్చే ఎన్నికల్లో టికెట్ లేనట్లేనా
- కోర్టుల్లో వైసీపీకి వరుస ఎదురుదెబ్బలతో గొడ్డలిపార్టీ అల్లర్లు
- మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు ధ్వజం

అమరావతి (చైతన్యరథం): గురివింద గింజ తన నలుపెరగదు.. అన్నట్లుగా జగన్‌రెడ్డి వైసీపీ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చేసిన అక్రమాలు, విధ్వంసాలు, ఏకగ్రీవాలు మరిచిపోయి నేడు నీతులు వల్లించటం బాధాకరమని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా రాష్ట్రంలో జరిగిన పరిణామాలపై ఫిర్యాదు చేసేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్(ఎస్ఈసీ)ను కలిసిన జగన్‌రెడ్డి.. పులివెందుల,దర్శి,రాయచోటిలో ఆపార్టీ నాయకులు, ఎంపీలు చేసిన విధ్వంసాలను ఎందుకు వివరించలేదని ప్రశ్నించారు. పులివెందుల్లో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఎన్నికల కోడ్ ఉల్లంఘించటమే కాకుండా ఘర్షణ వాతావరణం సృష్టించారని మండిపడ్డారు. ఎంపీగా ఉన్న అవినాష్ రెడ్డి 500మంది అనుచరులు, రౌడీలతో కార్లతో పోలింగ్ స్టేషన్ లోనికి వెళ్లడం ఏమిటని ధ్వజమెత్తారు.ఎన్నికలకోడ్‌ను ఉల్లంఘించిన అవినాష్‌ను పోలీసులు నిలువరిస్తే తిరిగి వారిపైనే దాడి చేయడం ప్రజాస్వామ్యమా అని దుయ్యబట్టారు. వైసీపీ పార్టీకి కోర్టుల్లో వరుస ఎదురుదెబ్బలు తగలడంతో విధ్వంసాలు సృష్టించి స్థానిక సంస్థల ఎన్నికలను ఎలాగైనా అడ్డుకోవాలని చూస్తోందని విమర్శించారు.



**పుంగనూరులో పెద్దిరెడ్డికి టికెట్ లేదా జగన్?**

ఏ నియోజక వర్గంలో ఏకగ్రీవాలు అవుతాయో ఆ ప్రాంతంలో పార్టీ నాయకులకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇవ్వనని జగన్మోహన్ రెడ్డి బహిరంగంగానే చెప్పారు. పుంగనూరులో స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దిరెడ్డి కుటుంబం పోటీ చేయదని అక్కడి వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి ప్రకటించారు. జగన్ చెప్పినట్లు తర్వాత ఎన్నికల్లో పెద్దిరెడ్డి, ఆయన కుమారుడు మిథున్ రెడ్డికి టికెట్ లేనట్లేనా? 2029 ఎన్నికల్లో వారు వైసీపీ పార్టీ నుంచి పోటీ చేయరా? గత ఎన్నికల్లో ఇదే నియోజక వర్గంలో పెద్దిరెడ్డి కుటుంబం 85శాతం ఏకగ్రీవాలు చేయడం వాస్తవం కాదా? అప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా? ఇవాళ దర్శిలో 500 మందితో నామినేషన్ వేయడానికి వెళ్లిన ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పోలీసులను ఎదిరించి అక్కడ ఎస్సైను కర్రలతో తల పగలగొట్టడం చట్టబద్ధమా? వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల బరిలో తెల్చుకోలేక విధ్వంసాలు సృష్టించి ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారని అశోక్‌బాబు దుయ్యబట్టారు.

**కోర్టుల్లో వరుస ఎదురుదెబ్బలతో దిక్కుతోచక విధ్వంసాలు**

ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు ప్రజల బలమే ముఖ్యం. వైసీపీకి ప్రజాబలం 2024 ఎన్నికలతో తుడిచిపెట్టుకు పోయింది. అందుకే కోర్టుల్లో కేసు వేసి స్థానిక ఎన్నికలను అడ్డుకోవాలని చూస్తోంది. స్థానిక ఎన్నికలను అడ్డుకోవాలని సుప్రీం కోర్టు వరకు వెళ్లారు. నామినేషన్లకు గడువు పెంచాలని కోరుతూ హైకోర్టులో మరో కేసు వేశారు. ఈ కేసులన్నింటినీ కోర్టులు కొట్టేశాయి. వైసీపీ నాయకులకు అన్నింట్లో నిరాశే. అందుకే ఎలైనా స్థానిక ఎన్నికలు అడ్డుకోవాలని ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్నారు. రౌడీలతో, కిరాయి గుండాలతో దాడులకు పాల్పడుతున్నారు. ఇప్పటికే 11 సీట్లతో వైసీపీ కొన ఊపిరితో ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ఆశ కూడా పోతుంది. వైసీపీకి ప్రజాబలం బాగా తగ్గిపోతోంది. నామినేషన్ వేసిన ప్రతి ఒక్కరికీ ఎస్కార్ట్ ఇవ్వాలి. పోలింగ్ గదుల్లో సీసీ కెమెరాలు పెట్టాలని జగన్ వింత వాదనలు చేస్తున్నారు. గత ఎన్నికల్లో జగన్ రెడ్డి చేసిన అరాచకాలు మరిచిపోయారు. నామినేషన్లు వేయకుండా తలలు పగులకొట్టారు. అభ్యర్థులను కిడ్నాప్ చేశారు. అన్నీ చేసిన జగన్ ఇప్పుడు శాంతిభద్రతలు గురించి మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించనట్లే. తండ్రి పేరుతో ఇన్నేళ్లు జగన్ రాజకీయాల్లో నెట్టుకొచ్చారు. ఇక ఆ ఆటలు సాగవు. 2019 ఎన్నికల్లో ఒక్క అవకాశం అంటూ అధికారం ఎక్కిన జగన్ ఓటర్లను మోసం చేశారు. వైసీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నప్పటికి.. ఈ సమయంలో తెలుగుదేశం కార్యకర్తలు కూడా సమన్వయం పాటించాలని కోరారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ జరిగేలా పోలీసులు, ఎన్నికల సంఘం అధికారులు చర్యలు తీసుకోవాలని అశోక్‌బాబు సూచించారు

# ప్రజాస్వామ్య హంతకుడు
# ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటమా?

మనం ప్రజాస్వామ్యంలో, రాజ్యాంగబద్ధ పాలనలో ఉన్నామా.. రాష్ట్రంలో చట్టం, న్యాయం ఉందా.. కనీసం నామినేషన్లు కూడా వేయనివ్వడం లేదు.. అధికారులు కనీసం నామినేషన్ పత్రాలు తీసుకోవడం లేదు.. రాష్ట్రంలో అధర్మ, రక్త చరిత్ర నడుస్తోంది... టీడీపీ నేతలకు పోలీసులు సహకరిస్తున్నారు.. ఎన్నికలకు రెండు రోజుల ముందే రిజర్వేషన్లు ఖరారు చేశారు.. రిజర్వేషన్ ఇచ్చిన వెంటనే ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు.. రాష్ట్రంలో రాజ్యాంగం కుప్పకూలింది.. ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంది అంటూ పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్ రెడ్డి శుభాషితాలు, సూక్తులు వినిపించారు. అసలు ప్రజాస్వామ్య హంతకుడు జగన్ రెడ్డే. ఒక హిట్లర్, ముస్సోలిని, ఈడీ అమీన్, కిమ్ ఆలోచనల ప్రతి రూపమే జగన్ రెడ్డి. అయిదేళ్ల అహంకారంతో, ఫ్యూడలిస్టు స్వభావంతో పరిపాలన సాగించిన జగన్ రెడ్డి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం గురుంచి మాట్లాడటం చూసి ప్రజాస్వామ్య వాదులు సిగ్గుతో తలదించుకొంటున్నారు. ఆయన హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని పాతరేసిన పెద్ద నియంత. ప్రజాస్వామ్యంలో జగన్ వంటి దుర్మార్గపు రాజకీయ నాయకుడిని ప్రజలు ఎప్పుడు చూచి వుండరు. ఆయన పాలనలో ఆంధ్రప్రదేశ్‌లో, చట్టాలు. లా-అండ్ ఆర్డర్ నిర్వీర్యం అయ్యాయి. ప్రజాసామ్యం, రాజ్యాంగం, విలువలతో నాకు సంబంధం లేదు.. నేను చేసిందే చట్టం.. నేను చెప్పిందే రాజ్యాంగం అన్న విధంగా నిరంకుశంగా, వ్యవహరించిన జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం అంటూ మొసలి కన్నీరు కారుస్తున్నారు. ఆయన ప్రజాస్వామ్యం, రాజ్యాంగం, విలువలు అంటూ ఎన్ని నీతులు చెప్పినా ప్రజాస్వామ్య ప్రియుడు అంటే ఎవ్వరూ నమ్మరు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ధనస్వామ్యం, దాదాగిరి, అరాచకంతో ప్రజాస్వామ్య విలువలను బహిరంగంగా బలి ఇచ్చారు. ఆర్డినెన్సు ద్వారా ఎన్నికల సంఘానికి వుండే అధికారాలను జగన్ ప్రభుత్వం తన చేతుల్లోకి తీసుకొన్నది. ప్రతిపక్షం నుండి ఎవరైనా గెలిచినా డబ్బు, మద్యం పంపిణీచేశారని కేసులుపెట్టి వారిపై అనర్హత వేటు వేసి వారిని తొలగించేందుకు కుట్ర పన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం రాజ్యాంగ వ్యవస్థల్ని భ్రష్టు పట్టించే ప్రక్రియలో తండ్రి వైఎస్ కంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివిన జగన్ సామ, దాన, దండోపాయాలతో ఓట్లను కొల్లగొట్టడానికి తన ముఠాను వుసిగొల్పారు. జగన్ స్వామ్యంలో జనస్వామ్యం జీవచ్ఛవం అయింది. అయిదేళ్ల ప్రజాస్వామ్యాన్ని నరికి పోగులు పెట్టినందుకే 2024 ఎన్నికల్లో పీకి కుప్పలు పెట్టి రెండు పంగ నామాలు పెట్టి ప్రతిపక్షానికి కూడా పనికిరారని తరిమేశారు ఆంధ్రా ప్రజలు. అధికారంలోకి వస్తే గంగమ్మ తల్లి జాతరలో ఒక్కొక్కడిని పొట్టేళ్లను నరికినట్టు రప్పా రప్పా నరుకుతాం అంటూ ఫ్లెక్సీలను పట్టుకుని ఆయన మంద చేసిన ర్యాలీలలో ఊరేగుతూ ఆ నరుకుడు భాషను వెనకేసుకొచ్చిన పెద్ద మనిషి నేడు ప్రజాస్వామ్యంలో ఉన్నామా? అంటూ దీర్ఘాలు తీస్తూ నవరస నటనా చాతుర్యాన్ని ప్రదర్శిస్తున్నారు సిగ్గులేకుండా.



### మీ దాష్టీకం, అరాచకం సామాన్యమైనదా?

జగన్ రెడ్డి హయాంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో జరిగిన దురన్యాయాలు,దురాగతాలు ఒకటా? రెండా. శ్రీకాకుళం నుండి చిత్తూరు వరకు నానా రకాల కుత్సితాలు, కుతంత్రాలు, బెదిరింపులు, దౌర్జన్యాలు, కొనుగోళ్ళు నిర్లజ్జగా సాగాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని, నిబంధనలను ఖే ఖాతరు చేస్తూ వైసీపీ నాయకులు ధనబలంతో, అధికార బలంతో, పోలీసుబలంతో బరితెగించి ప్రజాస్వామ్యాన్ని పాతరేసారు. ధనబలం, భుజబలం, అధికారం బలం వంటి దశ మహాపాతకాలతో ప్రజాస్వామ్యం పరువు ప్రతిష్టను దిగజార్చారు.ఎన్నికల ప్రక్రియను ఆసాంతం రాజకీయ సంతగా మార్చింది వైసీపీ.గతంలో ఎన్నడూ ఏ ఎన్నికల్లోనూ ఆ విధమైన దాదాగిరి, దమన కాండ జరగలేదు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జగన్ సాగించిన దాష్టీకం, అరాచకం సామాన్యమైనది కాదు. ఆయన సృష్టించిన అడ్డంకులు, దాడులు మూలంగా అనేక చోట్ల పంచాయితీ, పురపాలక ఎన్నికల్లో ప్రతిపక్ష తెలుగుదేశం నామినేషన్ వెయ్యలేకపోయింది. బెదిరింపులతో, వేధింపులతో అధిక సంఖ్యలో ఇష్టానుసారం ఏకగ్రీవాలు చేసుకొన్నారు. చివరకు కొందరు పోలీసులు కూడా ప్రతిపక్ష అభ్యర్థులను పోలీసు స్టేషన్లకు పిలిపించి నామినేషన్స్ ఉపసంహరింపచేశారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగితే ఎన్నికల్లో పైచేయి సాధించడం సాధ్యం కాదన్న భయం జగన్‌రెడ్డిని వెంటాడింది. అందుకే బెదిరింపులకు, ప్రలోభాలకు, దౌర్జన్యాలకు, నిర్బంధాలకు దిగి భయభ్రాంతులకు గురిచేసారు. రాష్ట్రంలో ఫ్యాక్షనిజం ఇనుప పాదాల కింద ప్రజాస్వామ్యం అణగ దొక్కబడింది. ప్రజాస్వామ్య, రాజ్యాంగ వ్యవస్థల్ని భ్రష్టు పట్టించే దుర్లక్షణాల్లో తండ్రి వైఎస్ కంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివిన జగన్ స్థానిక, పురపాలక ఎన్నికల్లో ఓట్లు కొల్లగొట్టేందుకు ఏ అవకాశాన్ని వదులు కోవద్దంటూ తన ముఠాని ఉసిగొల్పారు. అటువంటి దగాకోరు, దమనకాండ ఎన్నికలను ప్రజలు ఎన్నడూ చూసి వుండరు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని దోచిన పాపిష్టి డబ్బే స్థానిక ఎన్నికల్లో వైసీపీ పెట్టుబడిగా మారింది. పంచాయితీ ఎన్నికల్లో కోట్లాది రూపాయలు వెదజల్లి ఓటర్లను ఓడించారు. పురపాలక, నగర పాలక ఎన్నికల్లో వేలకోట్లు వెదజల్లి ఎన్నికల్లో గెలిచి.. తన పరిపాలన చూసి ప్రజలు తనకు ఓట్లు వేసి గెలిపించారని చెప్పుకోన్నారు. రాష్ట్రంలో తమ పార్టీ తప్ప మరొక పార్టీ కూడదు అన్న విధంగా వ్యవహరించింది అప్పటి అధికార పక్షం వైసీపీ.

### మీరు ప్రజాస్వామ్య వాదులా?

ప్రజాస్వామ్యాన్ని హత్యచేసిన హంతకుడే నేడు ప్రజాస్వామ్యాన్ని కాపాడండి అంటూ గవర్నర్‌ను కలవడానికి వెళ్లి నందుకు సిగ్గు పడాలి. జగన్ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అనైతికమైన, అప్రజాస్వామిక విధానాల ద్వారా జరిగిన రాజకీయ దాడులు ప్రజాస్వామ్య వాదుల్ని నిచ్చేష్టులను చేసాయి. రాజకీయాన్ని భ్రష్టు పట్టించి ప్రజాస్వామ్యాన్ని మేడిపండుగా మార్చిన జగన్‌రెడ్డి ప్రజాస్వామ్య వాదా? అసలు ప్రజాస్వామ్యం అన్న పదం పలకడానికి ఆయనకి అర్హత ఉన్నదా? చట్టబద్ధ పాలనకు సమాధి కట్టి ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా స్వామ్యం అన్న పదానికి అర్థం లేకుండా చేసారు. వైసీపీ హయాంలో మంత్రులు,శాసన సభ్యులు, ఇతర నాయకులు గ్రామాలమీద పడి దండయాత్ర చేశారు. అధికార పక్షం సృష్టించిన అరాచకానికి, అడ్డంకుల మూలంగా ప్రతిపక్ష తెలుగుదేశం అనేక చోట్ల నామినేషన్స్ వేయలేక పోయింది. స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశం నామినేషన్స్ వేయకుండా వైసీపీ ఎంత అరాచకానికి పాల్పడింది ప్రసార సాధనాల ద్వారా దేశమంతా చూశారు. బెదిరించడం, నామినేషన్స్ పత్రాలు చించివేయడం, గుంజుకొని పారిపోవడం వంటి చర్యలతో బీభత్సం సృష్టించారు. ఇక్కడ ప్రజాస్వామ్యం వుందా? ఇక్కడ వ్యవస్థ పనిచేస్తుందా? ఈ పరిస్థితుల్లో ప్రతిపక్షం పోటీ చేయడం అవసరమా అన్న విధంగా వ్యవహరించారు. అడుగడుగునా ఆటంకాలు సృష్టించారు. రిజర్వుడు అభ్యర్థులకు అత్యవసరమైన కుల ధృవీకరణ పత్రాలు, నో డ్యూస్ సర్టిఫికెట్లు, ఇంటిపన్ను రసీదులు ఇవ్వడానికి అధికారులు వివక్ష చూపించారు. అధికార పార్టీ వైసీపీ వారు అడగగానే అడిగిన సర్టిఫికెట్స్ ఇచ్చి, ప్రతిపక్షానికి మాత్రం ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెట్టారు. కుల ధృవీకరణ పత్రం లేక పోవడంతో అనేకచోట్ల నామినేషన్స్ చెల్లలేదు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఎవరూ పట్టించుకోలేదు.

### రాజ్యాంగబద్ధ సంస్థకే కుల ముద్ర తీవ్ర పరిణామం!

నామినేషన్లు వేసేందుకు వస్తున్న వారిపై దాడి చేస్తున్నా, నామినేషన్ పత్రాలు గుంజుకొని చించి వేస్తున్నా పోలీసులది ప్రేక్షక పాత్రే. పైగా మీకు రాజకీయాలు అవసరమా? పోటీచేయడం అవసరమా? అంటూ పోలీసులే బెదిరించారు. నకిలీ మద్యాన్ని పోలీసులే ప్రతిపక్ష తెలుగుదేశం వారి ఇళ్ళల్లో పెట్టడం, కేసులు నమోదు చేయడం, వైకాపా కార్యకర్తలు తమంత తామే గాయపర్చుకొని ప్రతిపక్షం వాళ్ళపై కేసులు పెట్టడం వంటి ఘటనలు నాడు వ్యవస్థల దుర్వినియోగానికి అద్దం పట్టాయి. వైసీపీకి ఓటు వేయకపోతే పింఛన్లు రావని, రేషన్ కార్డులు రద్దు చేస్తామని, ఇళ్ల స్థలాలు ఇవ్వరని వాలంటీర్లు గ్రామాల్లో ఇల్లిల్లు తిరిగి బెదిరించారు. రాష్ట్రాన్ని ఐదు జోన్లుగా విభజించి ప్రభుత్వంలో ఏ భాధ్యతా లేని వ్యక్తులకు అధికారాలు కట్టబెట్టడం రాజ్యాంగవిరుద్ధం. వారు ఆర్థిక బలాన్ని ఉపయోగించి వ్యవస్థలను చేతుల్లోకి తీసుకొని ప్రతిపక్ష తెలుగుదేశం పోటీలో నిలవడానికే భయపడే వాతావరణాన్ని సృష్టించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, స్పీకర్, శాసన సభ్యులు హద్దులుదాటి ఆరోపణలు చేయడమే కాదు, రాజ్యాంగ వ్యవస్థలకు కులాన్ని ఆపాదించి చట్ట ఉల్లంఘనకి పాల్పడ్డారు. కరోనా తీవ్రత వల్ల తప్పని సరిపరిస్థితుల్లో ఎన్నికలు వాయిదా వేస్తే, రాజ్యాంగ బద్ధ సంస్థకే కుల ముద్రవెయ్యడం తీవ్ర పరిణామం. ప్రభుత్వంలో వున్న వారి నుంచి తనకు, తన కుటుంబానికి ప్రాణ హాని వుందని కేంద్ర బలగాలతో రక్షణ కల్పించాలని కేంద్ర హోమ్‌శాఖ కార్యదర్శికి రాష్ట్రఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ లేఖ రాయాల్సి వచ్చిందంటే రాష్ట్రంలో ఎంత భయానక వాతావరణం సృష్టించారో అర్థం అవుతుంది. ఎన్నికల నియమావళి ఉల్లంఘించి ఎన్నడూ లేనివిధంగా ఏకగ్రీవాలు చేసుకొన్నారని, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించలేదని ఎన్నికల సంఘం తరుపున కేంద్రానికి ఆయనే స్వయంగా లేఖ రాయడం చిన్న విషయం కాదు. చట్టబద్ధ పాలనకు తిలోదకాలు ఇచ్చి ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసి గెలవడానికి అడ్డదారులు ఎంచుకున్న జగన్‌రెడ్డి నాడు రాజ్యాంగ విలువలను కాలరాచి, నేడు ప్రజాస్వామ్య సూక్తులు చెప్పడం హాస్యాస్పదంగా లేదా? వ్యవస్థలను నిర్వీర్యం చేసిన పెద్దమనిషి ప్రజాస్వామ్య పరిరక్షణ గురించి మాట్లాడటం చూస్తే నవ్వి పోదురుగాక నాకేమి సిగ్గు అన్నట్లుగా వుంది.

భారత రాజ్యాంగంలోని 73, 74వ సవరణలు గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగబద్ధమైన గుర్తింపునిచ్చాయి. 243జి, 243డబ్ల్యూ అధికరణలు పంచాయతీలు, మున్సిపాలిటీలకు అధికారాలు, బాధ్యతలు అప్పగించేందుకు ప్రాతిపదికకల్పించగా, 243కె, 243 జెడ్ఏ అధికరణలు వరుసగా పంచాయతీ, పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రాష్ట్ర ఎన్నికల సంఘం పాత్రను నిర్దేశిస్తున్నాయి. అందువల్ల స్థానిక సంస్థల ఎన్నికలు కేవలం రాజకీయ ఆధిపత్య పోరు కాదు. పాలన వికేంద్రీకరణకు, గ్రామ స్వరాజ్యానికి ఇవి పునాదులు. ఆ స్ఫూర్తితోనే అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా వ్యవహరించాలి. అన్ని పార్టీలకు, పోటీలో ఉన్న అందరు అభ్యర్థులకు సమాన అవకాశాలు కల్పించాలి. ప్రతి పౌరుడికి స్వేచ్ఛగా ఓటు వేసే హక్కు కల్పించినప్పుడే ప్రజాస్వామ్య స్ఫూర్తి నిలబడుతుంది. ప్రజలకు అత్యంత చేరువగా ఉండే పాలనా వ్యవస్థను నిర్మించే కీలకమైన ప్రక్రియ విజయవంతంగా సాగుతుంది.

- నీరుకొండ ప్రసాద్

# మున్సిపల్ నామినేషన్లలో టీడీపీ ముందంజ

*8,774 నామినేషన్లు దాఖలు దాఖలు*

*హింసకు తావివ్వొద్దని ప్రతిపక్షానికి హితవు*

అమరావతి (చైతన్య రథం): ఆంధ్రప్రదేశ్‌లో 2026 మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ల దాఖలుపై రాజకీయంగా ఆసక్తికర చర్చ సాగుతోంది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ఘట్టం ముగింపునకు చేరుకున్న వేళ, ఎన్నికల బరిలో తెలుగుదేశం పార్టీ తన బలాన్ని చాటింది. అత్యధికంగా 8,774 నామినేషన్లు దాఖలు చేసిన టీడీపీ, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో పాల్గొనాలని వైఎస్సార్‌సీపీకి పిలుపునిచ్చింది. జనసేన తనకు కేటాయించిన స్థానాల్లో 1526 నామినేషన్లు దాఖలు చేస్తే.. ఇతరులూ పెద్దఎత్తున 4410 నామినేషన్లు దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ 8,128 నామినేషన్లు దాఖలు చేసింది.

### ప్రశాంతంగా, పారదర్శకంగా జరగాలి

ప్రజాస్వామ్యంలో ప్రతి రాజకీయ పార్టీకి ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉండాలని, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, పారదర్శకంగా సాగాలని టీడీపీ స్పష్టం చేసింది. తప్పుడు ప్రచారాలకు దూరంగా ఉండాలని, హింసకు, బెదిరింపులకు తావులేకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల్లో పాల్గొనాలని వైఎస్సార్‌సీపీకి పిలుపునిచ్చింది. ప్రజల తీర్పును గౌరవించడం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యతగా పేర్కొంది.

"ప్రజాస్వామ్యం అంటే పాల్గొనడం.. బెదిరించడం కాదు. చర్చకు ప్రాధాన్యం ఇవ్వాలి.. హింసకు కాదు" అని టీడీపీ వర్గాలు స్పష్టం చేశాయి. ఎన్నికల్లో ప్రజలే అంతిమ నిర్ణేతలని, రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాయి.

### ఎన్నికల షెడ్యూల్ ఇదీ

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ ఈనెల 14న స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించారు. ఈ ప్రక్రియ డిసెంబర్ 2వరకు కొనసాగుతుంది. పట్టణ స్థానిక సంస్థలకు అక్టోబర్ 28న పోలింగ్ జరగనుండగా, ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన అక్టోబర్ 30న ఉంటాయి. 17మున్సిపల్ కార్పొరేషన్లు, 87మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. నామినేషన్ల దాఖలుకు చివరితేదీ అక్టోబర్ 18కాగా,పరిశీలన అక్టోబర్ 19న జరుగుతుంది. పట్టణ స్థానికసంస్థల ఎన్నికల్లో నామినేషన్ల తిరస్కరణపై అప్పీళ్లకు అవకాశంలేదు. షెడ్యూల్ ప్రకటనతోనే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది.





విజయనగరం నగరపాలక సంస్థ మేయర్ తెలుగుదేశం పార్టీ అభ్యర్థినిగా కూటమి పార్టీలు బలపర్చిన అవనాపు భార్గవి నగరపాలక సంస్థ కార్యాలయంలో నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు, కూటమి పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యం

## కూటమి శ్రేణులకు కూటమి నేతల పిలుపు

విజయనగరం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో నెల్లిమర్ల నగర పంచాయతీని కైవసం చేసుకోవడమే లక్ష్యంగా కూటమి నాయకులు సమాయత్తమవుతున్నారు. ఇందులో భాగంగా విజయనగరంలో నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో ప్రత్యేక సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు, కిమిడి నాగార్జున, ఎమ్మెల్యే లోకం నాగ మాధవి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్, కౌన్సిలర్ స్థానాల్లో కూటమి అభ్యర్థుల విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. నెల్లిమర్ల నగర పంచాయతీపై కూటమి జెండా ఎగురవేయాలంటే నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నేతలు పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో పార్టీ శ్రేణులు ప్రజలకు అందుబాటులో ఉంటూ, కూటమి విజయానికి కృషి చేయాలని సూచించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయం, నాయకుల మధ్య పరస్పర సహకారం ఎన్నికల్లో కీలకమని నేతలు అభిప్రాయపడ్డారు. చైర్మన్ స్థానంతో పాటు కౌన్సిలర్ స్థానాల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు సువ్వాడ రవిశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కడగల ఆనందకుమార్, ఏఎంసీ ప్రతినిధి గేదెల రాజారావు, జనసేన నాయకులు లోకం ప్రసాద్, రవ్వ నాని తదితరులతో పాటు నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని కూటమి నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు, కౌన్సిలర్ అభ్యర్థులు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.



# టీడీపీలోకి 300 మంది వైసీపీ కార్యకర్తలు

## కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



భీమిలి (చైతన్యరథం): మండలంలోని మూలకుద్దు గ్రామానికి చెందిన 300 మంది వైసీపీ కార్యకర్తలు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. భీమిలి టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో పసుపు కండువాలు వేసి వీరందరిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందపురం, జీవీఎంసీ 1 వ వార్డు తగరపువలస, 6 వ వార్డు అమరావతి నగర్ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున వైసీపీ కార్యకర్తలు చేరారని, ఇంకా అనేకమంది సిద్ధంగా ఉన్నారన్నారు. 164 అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించి కూటమి చరిత్ర సృష్టించిందని, భవిష్యత్ లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు తీసుకు వెళ్లాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకపక్ష విజయాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. మాజీ సైనికోద్యోగుల కార్యాలయం స్థల కేటాయింపునకు కృషి చేస్తానన్నారు. పార్టీ ఇంచార్జి చిక్కాల విజయ్ బాబు, మండల పార్టీ అధ్యక్షుడు సరగడ అప్పారావు, మాజీ జడ్పీటీసీ గాడు వెంకటప్పుడు, పార్టీ మాజీ అధ్యక్షుడు డి.ఎ.ఎన్. రాజు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురం మున్సిపల్ ఎన్నికల్లో చైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థుల నామినేషన్లలో పాల్గొన్న రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహణ కార్యదర్శి కిడారి శ్రావణ్ కుమార్, మన్యం జిల్లా ఎన్నికల పరిశీలకులు దాడి రత్నాకర్, పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు కొరాడ రాజబాబు తదితరులు

# గురివింద సామెతలొద్దు జగన్ : ఎంపీ కలిశెట్టి ఎద్దేవా

విజయనగరం (చైతన్యరథం): ఐదేళ్ల తన నియంతృత్వ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని నిలువునా పాతరేసి, స్థానిక సంస్థల ఎన్నికలను రక్తసిక్తం చేసిన వైఎస్సార్సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం సిగ్గుచేటని, ఇది దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విజయవాడలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) వద్ద జగన్ చేసిన ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. జగన్ వ్యాఖ్యలపై నిప్పులు చెరిగారు ఆనాడు మాచర్ల, పుంగనూరుల్లో ఏం చేశారో గుర్తులేదా? స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలో జగన్ సాగించిన అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. మాచర్లలో టీడీపీ ఇన్ ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, బూదాటి లక్ష్మీనారాయణలపై నడిరోడ్డుపై రాడ్లు, కర్రలతో దాడి చేసి కార్లు ధ్వంసం చేసింది మీ గూండాలు కాదా? పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో ప్రతిపక్ష అభ్యర్థులు నామినేషన్ వేయడానికి వస్తే వారిని కిడ్నాప్ చేసి, భౌతిక దాడులు చేసి బలవంతంగా ఏకగ్రీవాలు చేసుకున్న చరిత్ర మీది కాదా? పుంగనూరు, మాచర్ల, తంబళ్లపల్లెల్లో నామినేషన్లు వేయకుండా ప్రతిపక్షాల కాగితాలు లాక్కొని చించివేసినప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా?" అని నిలదీశారు.

### అధికారులను భయపెట్టి.. ఏకగ్రీవాల పేరుతో అరాచకం

వైఎస్సార్సీపీ హయాంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులను సైతం బెదిరించి, ప్రతిపక్ష అభ్యర్థుల నామినేషన్లను బలవంతంగా తిరస్కరింపజేశారని గుర్తుచేశారు. రాజ్యాంగబద్ధమైన ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్‌పై జగన్ ప్రభుత్వం చేసిన కుట్రలు, వ్యక్తిత్వ హననం, రాత్రికి రాత్రే ఆర్డినెన్స్ తెచ్చి ఆయన్ను పదవి నుంచి తొలగించే ప్రయత్నాలు దేశ ప్రజాస్వామ్య చరిత్రలోనే చీకటి అధ్యాయమని మండిపడ్డారు. అలాంటి వ్యక్తి ఈరోజు నిష్పక్షపాతం, పారామిలటరీ దళాల గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. పోలీసులను మాఫియా అన్న జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. శాంతిభద్రతలను కాపాడుతూ నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్న పోలీస్ వ్యవస్థను, అధికారులను కించపరిచేలా జగన్ వ్యాఖ్యానించడం దారుణమని ఎంపీ అన్నారు. "మీ హయాంలో పోలీసులను వైఎస్సార్సీపీ కార్యకర్తల కంటే దారుణంగా వాడుకుని, అక్రమ కేసులు బనాయించి పైశాచిక ఆనందం పొందారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో నిబంధనల ప్రకారం ఎన్నికలు జరుగుతుంటే ఓటమి భయంతో అధికారులపై బురదజల్లుతున్నారు. ప్రజల తిరస్కరణకు గురై అధికారం కోల్పోయినా జగన్‌లో అహంకారం, అబద్ధాలు ఇంకా తగ్గలేదు" అని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో చట్టబద్ధ పాలన సాగుతోందని, ప్రజల తీర్పును గౌరవించే ధైర్యం లేకనే జగన్ ముందస్తు నెపాలు వెతుక్కుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా జగన్ తన పాత అరాచకాలను గుర్తుచేసుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలని ఆయన హితవు పలికారు.

# మునిసిపల్ ఎన్నికల్లో విజయఢంకా మోగించాలి

## దేవినేని ఉమామహేశ్వరరావు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, బూరుగుపల్లి శేషారావు పిలుపు




నిడదవోలు (చైతన్యరథం): మాజీ మంత్రివర్యులు తూర్పుగోదావరి జిల్లా పరిశీలకులు దేవినేని మామహేశ్వరరావు, రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, బూరుగుపల్లి శేషారావు నిడదవోలులో పర్యటించారు. నిడదవోలు మున్సిపల్ ఎన్నికల్లో కూటమిని భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో ఓటర్లకు రెండు ఓట్లు వేసే అవకాశం ఉన్న నేపథ్యంలో, ఆ రెండు ఓట్లను ఎలా వినియోగించుకోవాలనే విషయంపై ప్రజలకు స్పష్టంగా వివరించాలని అన్నారు. ఓటింగ్ విధానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పిస్తూ, ప్రజలను చైతన్యవంతం చేయాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకోవాలని బూరుగుపల్లి శేషారావు సూచించారు. ప్రతి వార్డు పరిధిలో ప్రజల ఇబ్బందులు, స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. నిడదవోలు మున్సిపాలిటీ అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని, ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి విజయమే లక్ష్యంగా ప్రజల్లోకి వెళ్లి, వారి సమస్యలను తెలుసుకుంటూ ఎన్నికల ప్రచారాన్ని ముందుకు తీసుకెళ్లాలని బూరుగుపల్లి శేషారావు సూచించారు. ముఖ్య అతిథులు మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, రూడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జిన్నాబాబు, నిడదవోలు పట్టణ అధ్యక్షులు కొమ్మిన వెంకటేశ్వరరావు స్టేట్ డైరెక్టర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ముందు కొట్టేది.. ఆ వెనక ఏడ్చేదీ జగనే!

## మిన్నల్ రవి, డాక్టర్ ఉమేష్‌రావు ఎద్దేవా



పుంగనూరు (చైతన్యరథం): భారత రాజ్యాంగం ప్రకారం నిర్దేశించిన విధంగా ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలను జగన్ రెడ్డి నాయకత్వంలోని వైసీపీ అరాచక శక్తులు భౌతిక దాడులతో రక్తసిక్తం చేసి ప్రజలను భయపెట్టి విజయం దక్కించుకోవడం కోసం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని వన్నెకుల క్షత్రియ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు ఆరోపించారు.పుంగనూరు, తిరుపతి, రాయచోటి వంటి ప్రాంతాల్లో ప్రజలను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టి, భౌతిక దాడులకు పాల్పడి, రక్తపు మరకలు అంటించుకొని తామే బాధితులమంటూ ప్రభుత్వంపై బురదజల్లుతూ ముసలి కన్నీరు కార్చడం వైసీపీ అధినేత జగన్ రెడ్డికి పరిపాటిగా మారిందని, ఆయన తీరు చూస్తే దొంగే...దొంగా దొంగా అని అరిచినట్లు ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సమాజం నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు.స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనీయకుండా చేయడం ద్వారా రాష్ట్రానికి అందవలసిన నిధులను, గ్రాంట్లు రానీయకుండా చేసి అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకోవాలనే దుర్బుద్ధితో ఎలాగైనా ఎన్నికలను అడ్డుకోవాలని జగన్ రెడ్డి, మిదున్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అవినాష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి తదితరులు బెంగళూరు ప్యాలస్‌లో కూర్చుని కుట్రలు చేశారని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి రౌడీలను, అల్లరి మూకలను తీసుకొచ్చి, ప్రశాంతంగా ఉండే ప్రాంతాల్లో విధ్వంసం సృష్టించి.. రాష్ట్ర వ్యాప్తంగా గొడవలు జరుగుతున్నాయనే అపోహలను ప్రజలలో సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఓడిపోతున్నామన్న నిస్పృహలో జగన్ రెడ్డి దాడులకు తెగబడుతున్నారు. పులివెందుల నియోజకవర్గం కేంద్రంగా చేసుకొని, తన చుట్టూ ఉన్న నియోజకవర్గాల నాయకులుగా చలామణి అవుతున్న మిథున్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, అవినాష్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, అమర్‌నాథ్ రెడ్డి తదితరులతో అలజడి సృష్టించి, దానిని రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నట్లు ప్రజలకు తెలియజేయడానికి వీధి నాటకాలు ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. తిరుపతి నామినేషన్ సెంటర్ల వద్ద భూమన అభినయ్ చేసిన రౌడీ చేష్టలు, బెదిరింపులే దీనికి నిదర్శనం అని, అలాగే రాజంపేటలో అమర్‌నాథ్ రెడ్డి చేసిన అరాచకం రాష్ట్ర ప్రజలంతా గమనించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ సంక్షేమం అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి చిల్లకూరు మణి, తిరుపతి పార్లమెంటు నాయకులు గాజుల భగత్ రాయల్, పూల శేఖర్, పసుపులేటి శంకరయ్య, గంగనపల్లి రమేష్, సులేమాన్, బిజెపి నాయకుడు గోపీ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ కొండలమ్మ అమ్మవారి గ్రామోత్సవం

## ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేక పూజలు



గుడ్లవల్లేరు (చైతన్యరథం): ప్రజలందరూ దసరా పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలని, అమ్మవారి కరుణాకటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆకాంక్షించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ మేలు జరగాలని, రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ కూటమి ప్రభుత్వం మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ప్రార్థించారు. గుడ్లవల్లేరు మండలం వేమవరంలోని ప్రసిద్ధ శ్రీ కొండాలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన గ్రామోత్సవ ఊరేగింపు భక్తిశ్రద్ధల నడుమ అత్యంత వైభవంగా ప్రారంభమైంది. దుర్గాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ కనకదుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసిన వాహన రథానికి శాస్త్రోక్తంగా పూజలు చేసి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉత్సవ వాహనాన్ని స్వయంగా నడుపుతూ భక్తుల్లో ఉత్సాహాన్ని నింపారు.అమ్మవారి గ్రామోత్సవం భక్తజన సందోహం మధ్య కన్నుల పండువగా సాగింది. ఎమ్మెల్యే రాముతో పాటు కూటమి నాయకులు, మండల ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఊరేగింపులో ప్రదర్శించిన శక్తి వేషాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు, కేరళతో పాటు దక్షిణ భారత సంప్రదాయ కళారూపాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంప్రదాయ కళాప్రదర్శనలు, మంగళ వాయిద్యాల నడుమ సాగిన ఊరేగింపుతో వేమవరం గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ముందుగా దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన నవరాత్రుల అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాము పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అమ్మవారి అన్న ప్రసాదాన్ని వడ్డిస్తూ ఎమ్మెల్యే రాము సమారాధనను ప్రారంభించారు. 20వేల మంది పైగా భక్తులకు సమారాధన ఏర్పాట్లు చేశామని అధికారులు తెలిపారు.



# బిడ్డగా ఆశీర్వదించి, సేవ చేసే అవకాశం కల్పించండి

## మున్సిపల్ ఛైర్మన్‌గా నామినేషన్ దాఖలు చేసిన చెదుర్తిపాటి ప్రవీణ్ కుమార్, పాల్గొన్న ఎమ్మెల్యే బోడే, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ

పెనమలూరు (చైతన్యరథం): ఉయ్యూరు మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా చెదుర్తిపాటి ప్రవీణ్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ఉయ్యూరు టీడీపీ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ డప్పు కొట్టి ర్యాలీని ప్రారంభించారు. ఉయ్యూరు మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థిగా ఎన్డీయే కూటమి బలపరిచిన చెదుర్తిపాటి ప్రవీణ్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు, ఈ సందర్భంగా ఉయ్యూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ఛైర్మన్, కౌన్సిలర్ అభ్యర్థులు,పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఛైర్మన్ అభ్యర్థి చెదుర్తిపాటి ప్రవీణ్ కుమార్‌తో కలిసి ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఉయ్యూరు మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధి,ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఎన్డీయే కూటమి ముందుకు సాగుతోందని తెలిపారు. పట్టణంలోని ప్రతి ఇంటికీ కృష్ణా నది తాగునీటిని అందించడంతో పాటు,హ్యామ్ పథకం కింద సుమారు రూ.9 కోట్లతో మట్టి రహదారులను సీసీ, తారు రహదారులుగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా నిలిచిన టిడ్కో గృహాల నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం పూర్తి చేసిందని, రానున్న డిసెంబర్, జనవరి నెలల్లో సామూహిక గృహప్రవేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు,పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విజయవాడ, మచిలీపట్నం నగరాల మధ్య కీలక ప్రాంతంలో ఉన్న ఉయ్యూరును భవిష్యత్తులో మెరుగైన నివాసయోగ్య పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలు ఉయ్యూరు పట్టణంలోనూ కొనసాగాలంటే స్థానిక సంస్థల్లో సమన్వయంతో పనిచేసే పాలన అవసరమని పేర్కొన్నారు. సామాన్యుడికి అవకాశం కల్పించినదానికి నిదర్శనం టీడీపీ చెదుర్తిపాటి ప్రవీణ్ కుమార్ అవకాశం ఇవ్వడమేనన్నారు. నామినేషన్ అనంతరం ఛైర్మన్ అభ్యర్థి చెదుర్తిపాటి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పేద కుటుంబంలో పుట్టిన సామాన్య కార్యకర్తకు సైతం ఉన్నత బాధ్యతలు అప్పగించి ప్రోత్సహించే అవకాశం తెలుగుదేశం పార్టీలో ఉందని అన్నారు. పార్టీకి నీతి,నిజాయితీలతో సేవలందించినందుకు తనకు ఈ అవకాశం లభించిందని తెలిపారు. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆధ్వర్యంలో ఉయ్యూరు పట్టణంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి, సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయని, సుమారు రూ.100 కోట్లతో స్వచ్ఛమైన తాగునీటి ప్రాజెక్టు పనులు చేపడుతున్నామని వెల్లడించారు. తనకు ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్‌కి కృతజ్ఞతలు తెలిపారు, వారి మార్గదర్శకత్వంలో ఉయ్యూరు పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఉయ్యూరు పట్టణ బిడ్డగా తనను ఆశీర్వదించి, మున్సిపల్ ఛైర్మన్‌గా సేవ చేసే అవకాశం కల్పించాలని పట్టణ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ఛైర్మన్ కౌన్సిలర్ అభ్యర్థులు,పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్ ఖాయం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీయే కూటమి (తెలుగుదేశం, జనసేన, బీజేపీ) ఘన విజయం సాధించి క్లీన్ స్వీప్ చేయబోతోందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థి కోవెలమూడి లక్ష్మీ అపర్ణ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలో ఎన్డీయే కూటమి బలపరిచిన 27వ డివిజన్ అభ్యర్థి ఉల్లి గోపాల్ కృష్ణ, 34వ డివిజన్ అభ్యర్థి గాలం వెంకటేశ్వర్లు, 31వ డివిజన్ అభ్యర్థి గంటా మౌళిక, 48వ డివిజన్ అభ్యర్థి మానం శ్రీనివాస్,29 డివిజన్ షేక్ షర్మిల నామినేషన్ల కార్యక్రమాలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసం, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలే ఎన్డీయే కూటమి అభ్యర్థులకు బలమని, ప్రజల ఆదరణతో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పిలుపునిచ్చారు. నగర మేయర్ అభ్యర్థిగా తెలుగుదేశం పార్టీ తరపున కోవెలమూడి లక్ష్మి అపర్ణ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలోఎమ్మెల్యేలు గల్లా మాధవి, బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్‌తో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో లక్ష్మి అపర్ణ భారీ మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని నాయకులు పేర్కొన్నారు. రాజధాని ప్రాంతం నుంచి మారుమూల గ్రామాల వరకు అభివృద్ధి ఫలాలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గుంటూరు నగరంలోనూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను యుద్ధప్రాతిపదికన చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు.



విజయవాడ మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే బోడే ప్రసాద్

## తాడేపల్లి డైరెక్షన్‌లోనే వైసీపీ దమనకాండ

### ఎంపీ సానా సతీష్ బాబు




కాకినాడ (చైతన్యరథం): రాయలసీమలో జరుగుతున్న గొడవల వెనుక తాడేపల్లి నుంచి ఆదేశాలు ఉన్నాయని రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు ఆరోపించారు. కిరాయి హంతకులను తీసుకొచ్చి టీడీపీ నేతలను ఏం చేయాలనుకుంటున్నారని వైసీపీ నాయకత్వాన్ని ప్రశ్నించారు. పుంగనూరులో కార్లతో ప్రజలను తొక్కించిన ఘటనలపై వైఎస్ జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పులివెందులలో మిథున్ రెడ్డి సాగిస్తున్నారని ఆరోపిస్తున్న అరాచకాల గురించి గవర్నర్‌కు వివరిస్తారా అని ప్రశ్నించారు. మిథున్ రెడ్డిపై క్రిమినల్ కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.వైసీపీ ఎంపీలు చేస్తున్న అరాచకాల వల్ల దేశవ్యాప్తంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతింటోందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు జగన్ కదలికలపై నిఘా ఉంచాలని కోరారు.

# అట్టహాసంగా కొండపల్లి కూటమి అభ్యర్థి అమూల్య నామినేషన్

## భారీ ర్యాలీ, పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, కూటమి నాయకులు



కొండపల్లి (చైతన్యరథం): మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో ఎన్డీఏ కూటమి బలపరిచిన చైర్‌పర్సన్ అభ్యర్థి కన్నెగంటి అమూల్య నామినేషన్ కార్యక్రమం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్ నుంచి కొండపల్లి వరకు సాగిన భారీ ర్యాలీతో పరిసర ప్రాంతాలు పసుపుమయమయ్యాయి. తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో రింగ్ సెంటర్ జనసంద్రంగా మారింది. కూటమి శ్రేణుల నినాదాలు, ఉత్సాహం మధ్య చైర్‌పర్సన్‌తో పాటు వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించారు. మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు గారు పాల్గొని అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. మిత్రపక్షాల నాయకులు పరస్పర సమన్వయంతో ముందుకు సాగుతూ ఎన్నికల్లో ఘనవిజయం సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు గారు మాట్లాడుతూ, కొండపల్లి మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. తాను తొలిసారి శాసనసభ్యుడిగా ఎన్నికైన సమయంలో రెండు గ్రామాలను కలిపి మున్సిపాలిటీగా ఏర్పాటు చేసినప్పటికీ, గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఆశించిన స్థాయిలో నిధులు మంజూరు కాలేదని విమర్శించారు. ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇంటింటికీ తాగునీటి కుళాయిల పథకానికి రూ.55 కోట్లను మంజూరు చేసి పనులు ప్రారంభించిందని వెల్లడించారు. ఇందులో భాగంగా మూడు కొత్త నీటి రిజర్వాయర్ల నిర్మాణంతో పాటు నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు కూడా జరుగుతోందని వివరించారు. రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.96 కోట్లను కేటాయించిందని పేర్కొన్నారు. ఇటీవలే రూ.25 కోట్లతో వివిధ ప్రాంతాల్లో రహదారి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు గారు స్పష్టం చేశారు. గత ఐదేళ్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో మైలవరం నియోజకవర్గానికి ముఖ్యమంత్రి సహాయనిధి లెటర్ ఆఫ్ క్రెడిట్ రూపంలో సుమారు రూ.5 కోట్ల సాయమే అందిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 28 నెలల్లోనే నియోజకవర్గానికి రూ.30 కోట్ల 20 లక్షల మేర ఆర్థిక సహాయం అందించినట్లు వివరించారు. ఇందులో కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలోని బాధిత కుటుంబాలకు సుమారు రూ.4.80 కోట్ల వైద్య సహాయం అందిందని తెలిపారు.

రాజకీయాలు, కులమతాలకు అతీతంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు ఆర్థిక అండ కల్పిస్తున్నామని చెప్పారు. అర్హులైన వారికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, రైతుభరోసా, తల్లికి వందనం, అన్న క్యాంటీన్లు, స్త్రీ శక్తి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణం, పక్కా గృహాల మంజూరు వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులతో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే కృష్ణప్రసాదు పేర్కొన్నారు. యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో పెద్దఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఎన్నో ఆర్థిక, పరిపాలనా సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ వాటిని అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమానికి సమాన ప్రాధాన్యమిస్తున్నట్లు తెలిపారు.

### కూటమి ఐక్యతే కొండపల్లి విజయానికి బలం

కొండపల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగాలంటే ప్రజలు కూటమి అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని వసంత వెంకట కృష్ణప్రసాదు గారు కోరారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ అభ్యర్థులందరినీ అత్యధిక మెజారిటీతో గెలిపించి పట్టణ ప్రగతికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో ఇప్పుడు రహదారులు, డ్రైనేజీలు సహా పలు మౌలిక వసతుల పనులు చేపడుతున్నామని గుర్తుచేశారు. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం వల్ల పట్టణానికి ఆశించిన ప్రయోజనం ఉండదని విమర్శించారు. ప్రజలు అభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని విచక్షణతో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు స్థానిక సంస్థలలోనూ ప్రజాప్రతినిధుల సహకారం లభిస్తే మరింత వేగంగా పనులు పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు. కూటమి తరపున చైర్‌పర్సన్ అభ్యర్థిగా కన్నెగంటి అమూల్యని బరిలో నిలిపామని, జనసేన నుంచి అక్కల రామ్మోహనరావు (గాంధీ) గారు సహా మిత్రపక్షాల నాయకులు, బీజేపీ ప్రతినిధులు సమష్టిగా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారని తెలిపారు. 40 వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయానికి కూటమి కుటుంబ సభ్యులంతా ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొండపల్లి మున్సిపాలిటీలో అన్ని కులాలకు ప్రాధాన్యత కల్పిస్తూ అభ్యర్థులను ఎంపిక చేశామన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు బీసీలకు 34 శాతానికి పైగా రిజర్వేషన్లు కల్పించాలమన్నారు. కొండపల్లి సమగ్రాభివృద్ధికి కూటమి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కూటమి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఒంగోలు మేయర్ కూటమి అభ్యర్థి గా పోటీచేస్తున్న నల్లమల్లి శిల్ప నామినేషన్ కార్యక్రమంలో ఒంగోలులోని కోర్ట్ సెంటర్ నుండి ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్న ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు, సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయ్ కుమార్, ఒడా చైర్మన్ షేక్ రియాజ్, మాజీ మేయర్ గంగాడ సుజాత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు కూటమి నాయకులు, కార్యకర్తలు.

## మదనపల్లె మునిసిపల్ అభ్యర్థి చినబాబు నామినేషన్

### పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు సుగవాసి

మదనపల్లె (చైతన్యరథం):మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి శ్రేణుల్లో నూతనోత్సాహం వెల్లివిరిసింది. మదనపల్లె మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి శ్రీరామ్ చిన్నబాబు నామినేషన్ దాఖలు చేసిన కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా, బీజేపీ రాష్ట్ర నాయకులు చల్లపల్లి నరసింహారెడ్డి, జనసేన నాయకులు రామదాసు చౌదరి, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి ఖాదర్ ఖాన్ తదితర కూటమి నాయకులతో కలిసి పాల్గొని శ్రీరామ్ చిన్నబాబుకు తమ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమం కూటమి నాయకుల ఐక్యతకు, సమష్టి కార్యాచరణకు నిదర్శనంగా నిలిచింది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా మదనపల్లె పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడం, మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, ప్రజా సమస్యలకు పరిష్కారాలు చూపడం వంటి లక్ష్యాలతో కూటమి నాయకులు ముందుకు సాగుతున్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకుల సమన్వయం.. కార్యకర్తల సమష్టి కృషి ప్రజల ఆశీస్సులు.. ఇవే కూటమి విజయానికి ప్రధాన బలాలని నాయకులు ఆకాంక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





కనిగిరి మున్సిపల్ చైర్మన్ కూటమి అభ్యర్థిగా అచ్చాల తిరుపతమ్మ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, తూర్పు కోడిగుడ్ల పాడు తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు దారపనేని రాజేంద్ర ప్రసాద్

## టీడీపీలోకి పది వైసీపీ కుటుంబాలు

### కండువాకప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కందుల అనుచరులు

మార్కాపురం (చైతన్యరథం): శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి ఆదేశాల మేరకు తర్లపాడు మాజీ జడ్పీటీసీ సభ్యుడు రావి భాషా పతి రెడ్డి తర్లుపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉడుముల చిన్నపరెడ్డి ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలోని జవహర్ నగర్‌లో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తర్లుపాడు మండలంలోని గానుగ పెంట గ్రామానికి చెందిన 10 వైసీపీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ లో చేరిన వారు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు సంక్షేమం అభివృద్ధి అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణ రెడ్డి ముందుచూపు సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలతో తాము తెలుగుదేశం పార్టీలో చేరుతున్నామని ఇప్పటికే మార్కాపురం శాసనసభ్యుడు కందుల నారాయణరెడ్డి మార్కాపురం నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశారని భవిష్యత్తులో ఇంకా అభివృద్ధి చేస్తారని అన్నారు.



## పోలీసులపైనే తెగబడిన వైసీపీ గూండాలకు గుణపాఠం చెప్పాలి

### దర్శి టీడీపీ ఇన్చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి (చైతన్యరథం): మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను ఎదుర్కోలేక అల్లర్లు సృష్టించే ప్రయత్నంలో భాగంగా గుంపులుగా సైకో గొడ్డలి బ్యాచి రోడ్లపైకి వచ్చి చట్టాన్ని తమ చేతుల్లో తీసుకొని నిబంధనలను అతిక్రమిస్తూ దర్శి ఎస్సై జి. ఏడుకొండల పై దాడి చేయడం ఈ సంఘటన చాలా బాధాకరం. పోలీస్ సిబ్బంది మనోధైర్యంతో ఉండాలని ప్రభుత్వం పరంగా అల్లరి మొక్కలపై కఠినంగా వ్యవహరిస్తుందని ఈ సంఘటనపై సంబంధిత హోం శాఖ మంత్రివర్యులు అనిత గారికి, డీజీపీ గారికి, డిఐజి గారికి, జిల్లా ఎస్పీ గారికి లేఖ రాయడం జరిగిందని సంబంధిత అధికారులతో ఫోన్లో కూడా మాట్లాడామని పోలీసులు మనోధైర్యం కోల్పోవద్దని భరోసాని ఇచ్చారు. కడపలో గొడ్డలి పార్టీ అరాచకం ఆకృత్యాలు దౌర్జన్యాలు ప్రశాంతమైన దర్శిలో కూడా చూపించారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు చట్టపరంగా ప్రశాంతమైన వాతావరణం కోసం ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు కూటమి పక్షాలు సహకరిస్తాయని ప్రజాస్వామ్యతంగా ప్రజల మద్దతు కూటమికి ఉందని డాక్టర్ లక్ష్మీ స్పష్టం చేశారు. ఓటమి భయంతో వైసీపీ శ్రేణులు నామినేషన్ వేయకుండా అల్లర్లు సృష్టించి పోలీసులపై దాడులు చేసి మా పార్టీ కార్యకర్తలు నాయకులు పై దౌర్జన్యాలు చేసి దర్శిలో గత అసెంబ్లీ ఎన్నికలలో చేసిన గొడవలు తిరిగి సృష్టించే ప్రయత్నాన్ని పోలీసులు తిప్పి కొడుతుంటే వారిపై తెగబడ్డారని దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నామని డాక్టర్ లక్ష్మీ హెచ్చరించారు. దర్శిలో ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, ఉండేందుకు చట్టపరంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పోలీసులపై దాడులు చేసిన ఏ ఒక్కరిని వదిలే ప్రసక్తే లేదని డాక్టర్ లక్ష్మీ హెచ్చరించారు. ఇప్పటికైనా వైసీపీ సైకో బ్యాచి గొడ్డలి పార్టీ వారు అరాచకాలు ఆపాలని లేనట్లయితే ప్రభుత్వం చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు జరగడం చాలా బాధాకరంగా ఉందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కూడా బొట్లపాలెంలో బీసీలు ఓట్లు వేయటానికి రాకుండా గొడ్డలి పార్టీ వారు గొడ్డలి ఎక్కుపెట్టారని నేను అడ్డుగా ఉన్నానని అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా గొడవలు సృష్టించి అల్లలు సృష్టించి గెలవాలని చూస్తున్నారని కూటమి నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని ప్రభుత్వం చట్టం తమ పని తమ చేసుకుపోతుందని డాక్టర్ లక్ష్మీ వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు అఖండ విజయంతో గెలుస్తారని స్పష్టం చేశారు.



# అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలి : మంత్రి సవిత

## రొద్దం, పెనుకొండ మండలాల నాయకులతో స్థానిక ఎన్నికలపై సమావేశం



పెనుకొండ (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవిత పిలుపునిచ్చారు. రొద్దం, పెనుకొండ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 28 నెలల్లోనే నియోజకవర్గంలో అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక కార్యక్రమాలు చేపట్టామని మంత్రి సవిత తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని విమర్శించారు. గ్రామాల అభివృద్ధి మరింత వేగవంతం కావాలంటే సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలుగా కూటమి అభ్యర్థులు గెలుపొందాలని ఆమె పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలకు, సర్పంచ్‌లకు నిధులు సక్రమంగా అందించలేదని ఆరోపించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల అమలుకు స్థానిక సంస్థల్లో కూటమి ప్రజాప్రతినిధులు ఉండటం ఎంతో అవసరమన్నారు. యువతకు సైతం రాజకీయాల్లో తగిన అవకాశాలు కల్పిస్తూ, వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పనిచేయాలని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. కూటమి విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి ఓటర్ల మద్దతు కూడగట్టాలని పిలుపునిచ్చారు. వైసీపీ నాయకులు ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే నైతిక హక్కును కోల్పోయారని మంత్రి విమర్శించారు. ఇతర రాష్ట్రాల నుంచి జనాలను తీసుకొచ్చి రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహారావు నగర కార్పొరేషన్ చైర్మన్ వెంకట రమణ డైరెక్టర్లు శ్రీనివాసులు, కేశవయ్య, డీవీ ఆంజనేయులు సీనియర్ నాయకులు మాధవనాయుడు నారాయణ స్వామి చంద్ర మౌళి కన్వీనర్ లు ప్రసాద్ నరహరి సింగిల్ విండో అధ్యక్షుడు వీరాంజినేయులు, రామచంద్ర,టైలర్ ఆంజనేయులు నరసింహులు మాజీ సర్పంచ్ అశ్వర్థ నారాయణ రొద్దం, పెనుకొండ మండలాల నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..



# మేయర్ అభ్యర్థిని గెలిపించుకుంటాం

## టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు అట్టహాసంగా కూటమి మేయర్ అభ్యర్థి నామినేషన్, పాల్గొన్న కూటమి పార్టీల అగ్రనేతలు

అనంతపురం (చైతన్యరథం): నగరంలో కూటమి శ్రేణుల కోలాహలం మధ్య బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ యాదవ్ నామినేషన్ కార్యక్రమం ఘనంగా జరిగింది. కోర్టు రోడ్డు నుంచి టవర్ క్లాక్ మీదుగా సాగిన భారీ నామినేషన్ ర్యాలీలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వివిధ పార్టీల అభ్యర్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నగర వీధులన్నీ కూటమి పార్టీల జెండాలతో రెపరెపలాడాయి. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ రాష్ట్ర మంత్రి సత్యకుమార్ టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ , మాజీ మంత్రి, ఎన్నికల పరిశీలకుడు ప్రతాప్ రెడ్డి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు దేవేంద్రప్ప, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి , అహుడా చైర్మన్‌టీసీ వరుణ్, తదితర కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు. నామినేషన్ అనంతరం టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు గారు మాట్లాడుతూ అనంతపురం నగర మేయర్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఐక్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. బీజేపీ అభ్యర్థి అజేష్ యాదవ్‌ను కూటమి ఉమ్మడి అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిపించేందుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే తమ విజయానికి ప్రధాన బలమని పూల నాగరాజు అన్నారు. 2024 ఎన్నికల్లో కూటమికి ప్రజలు అందించిన మద్దతు కంటే స్థానిక ఎన్నికల్లో మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రజల సంక్షేమం, నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజలు తమ అభివృద్ధి కార్యక్రమాలను గుర్తించి కూటమి అభ్యర్థికి పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో విధ్వంసకర పాలన సాగిందని, రాజకీయ దాడులు, బెదిరింపుల ద్వారా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నాలు జరిగాయని ఆయన విమర్శించారు. ఇప్పుడు కూడా అలాంటి చర్యలతో రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం ఉందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు, మంత్రి నారా లోకేష్ గారి నాయకత్వంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పూల నాగరాజు గారు పేర్కొన్నారు. . అనంతపురం నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి నాయకులు సమన్వయంతో పనిచేస్తున్నారని, మేయర్ ఎన్నికల్లో అజేష్ యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి నగర అభివృద్ధికి మరింత బాటలు వేయాలని పూల నాగరాజు కూటమి శ్రేణులకు పిలుపునిచ్చారు.

# కోలాహలంగా బీజేపీ మేయర్ అభ్యర్థి అజేష్ నామినేషన్

అనంతపురం (చైతన్యరథం): అనంతపురంలో అజేష్ యాదవ్ నామినేషన్ కోలాహలంగా జరిగింది. కోర్టు రోడ్డు నుంచి టవర్ క్లాక్ మీదుగా సాగిన నామినేషన్ ర్యాలీ జరిగింది. నామినేషన్ ర్యాలీలో కూటమి అగ్రనేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే దగ్గుపాటి, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షుడు పూలనాగరాజు, ఎన్నికల పరిశీలకుడు ఏరాసు ప్రతాప్ రెడ్డి, టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు దేవేంద్రప్ప బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. భారీగా తరలివచ్చిన కూటమి పార్టీల అభ్యర్థులు నగర వీధుల్లో రెపరెపలాడిన కూటమి పార్టీల జెండాలు మా 3పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా అజేష్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ భరోసా ఇచ్చారు. 2024లో వచ్చిన స్ట్రైక్ రేట్ కంటే ఇంకా ఎక్కువ ఉంటుందన్నారు. చేసిన అభివృద్ధికి ప్రజలు పట్టం కడుతారన్నారు. 2021లో రాష్ట్రంలో గొడ్డలిపార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి విధ్వంసం సృష్టించారని, ఇప్పుడు కూడా అలానే దాడులు చేసి భయభ్రాంతులు సృష్టించాలనుకుంటున్నాడని అన్నారు. కానీ ఇక్కడ ఉండేది ఎన్డీఏ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇలాంటివి చేస్తే తాట తీస్తారని హెచ్చరించారు.



# గెలుపే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపికపై కసరత్తు : ఎమ్మెల్యే సునీత

రాప్తాడు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో రాప్తాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ మూడో రోజు కూడా కొనసాగింది. అన్ని స్థానాల్లో



క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఆదివారం కూడా ఎమ్మెల్యే పరిటాల సునీత ముఖ్య నాయకులతో సమావేశాలు నిర్వహించారు. ప్రధానంగా ఆత్మకూరు మండలం పరిధిలోని ఎంపీటీసీ అభ్యర్థులతో పాటు, అనంతపురం రూరల్ మండలంలో కొన్ని ఎంపీటీసీ స్థానాల అభ్యర్థుల ఎంపికపై సుదీర్ఘంగా చర్చించారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లోని పలు కీలక స్థానాల అభ్యర్థుల ఎంపికపై ఒక స్పష్టమైన అవగాహన వచ్చింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. స్థానికంగా ప్రజల్లో మంచి గుర్తింపు ఉండి, నిరంతరం అందుబాటులో ఉండే నాయకులనే అభ్యర్థులుగా ఎంపిక చేస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థుల ఎంపికలో ఎలాంటి ఏకపక్ష నిర్ణయాలు ఉండవని, స్థానిక నాయకులు, కార్యకర్తల అందరి అభిప్రాయాలను, సమీకరణాలను నిశితంగా పరిశీలించిన తర్వాతే తుది జాబితాను ప్రకటిస్తామని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు.

# చీరాల మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా హనీ స్పందన

చీరాల (చైతన్యరథం): మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా హనీ స్పందన నామినేషన్ దాఖలు చేశారు. కూటమి బలపరిచిన మున్సిపల్ అభ్యర్థులు కూడా నామినేషన్ దాఖలు చేశారు. టీడీపీ పార్టీ కార్యాలయం నుంచి మున్సిపాలిటీ కార్యాలయం వరకు భారీ ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు. వీరితో పాటు చీరాల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్ర నాథ్ యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్, పట్టణ అధ్యక్షుడు సురేష్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు. పెద్ద ఎత్తున కూటమి కార్యకర్తలు, నాయకులు పాల్గొని నామినేషన్ ర్యాలీని విజయవంతం చేశారు.



### స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి

# ప్రవాసాంధ్రులు కృషి చేయాలి

- ప్రసార మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలి
- ప్రతిఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి
- గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు పిల్లి గురురాజా



**అమరావతి(చైతన్యరథం):** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు ప్రవాసాంధ్రులు భాగస్వాములు కావాలని గ్లోబల్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు పిల్లి గురురాజా పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తూ కూటమి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వీలైనంత ఎక్కువమంది ప్రవాసాంధ్రులు కూడా స్వగ్రామాలకు వచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకునేలా కృషి చేయాలి. ప్రవాసాంధ్రులు తమ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, పరిచయస్తులతో టచ్‌లో ఉంటూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వ పనితీరును వివరించాలి. ప్రజలకు ప్రభుత్వం అందిస్తు న్న సంక్షేమ ఫలాలను, రాష్ట్ర అభివృద్ధి కోసం చేపడుతున్న కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా తెలియజేయాలి. ప్రజల్లో అవగాహన కల్పించి కూటమి అభ్యర్థులకు మద్దతు లభించేలా ప్రతి ప్రవాసాంధ్రుడు తన వంతు కృషిచేయాలి. పల్లె నుంచి పట్టణం, నగరం నుంచి రాష్ట్రం, రాష్ట్రం నుంచి కేంద్రం వరకు ఒకే ప్రభుత్వం ఉన్నప్పుడే అభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు, సంక్షేమ ఫలాలు అందుతాయి. డబుల్ ఇంజిన్ తరహా పాలనతో రాష్ట్ర అభివృద్ధి రెట్టింపు వేగంతో ముందుకుసాగుతుందని తెలిపారు.



## టీటీఏ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

**అమెరికా:** తెలంగాణ అమెరికన్ తెలుగు అసోసియేషన్(టీటీఏ) ఆధ్వర్యంలో న్యూజెర్సీలోని ఫోర్డ్స్ రాయల్ ఆల్బర్ట్ ప్యాలెస్ గ్రాండ్ బ్యాంకెట్ హాలులో బతుకమ్మ సంబరాలకు 300 మందికి పైగా తెలుగు ప్రజలు హాజరయ్యారు. టీటీఏ వ్యవస్థాపకులు పైల్ల మల్లారెడ్డి ఆశీస్సులతో విజయపాల్‌రెడ్డి (అడ్వైజరీ చైర్), మోహన్‌రెడ్డి పటలోల్ల (అడ్వైజరీ కో చైర్), భరత్‌రెడ్డి మాదడి (అడ్వైజరీ మెంబర్), నవీన్ మలిపెడ్డి (ప్రెసిడెంట్), వంశీరెడ్డి కంచర్లకుంట్ల (పాస్ట్ ప్రెసిడెంట్), శివారెడ్డి కొల్లా (జనరల్ సెక్రెటరీ) ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అడ్వైజరీ కౌన్సిల్ కో చైర్ మోహన్ పటలోల్ల స్వరాష్ట్రం న్యూజెర్సీలో జరిగిన ఈ వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శివారెడ్డి కొల్లా (సెక్రటరీ), నర్సింహ పెరుక (ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్), సుధాకర్ ఉప్పల (న్యూస్ లెటర్ డైరెక్టర్), అరుణ్ ఆర్కాల (బీవోడీ), నరేంద్ర యరవ (స్టాండింగ్ కమిటీ చైర్), దీపా జలగం నాయకత్వంలో ఈ వేడుకలు సమన్వయంతో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి టీటీఏ న్యూజెర్సీ ఆర్‌వీపీఎస్ ప్రశాంత్ నలుబందు, రాజా నీలం, చీజీ కోర్ టీమ్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి మల్యా, శంకరరెడ్డి వులుపాల, నవీన్ కోలురు, శ్రీనివాస్ జక్కిరెడ్డి, అనేకమంది వాలంటీర్లు కృషి చేశారు.

## మలేషియాలో ఉట్టిపడిన తెలుగు సంస్కృతి

**మలేషియా:** తెలుగు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు మలేషియాలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఫెడరేషన్ ఆఫ్ ఎన్నారై కమ్యూనిటీ అసోసియేషన్స్(ఎఫ్ఎన్‌సీఏ) మలేషియా ఆధ్వర్యంలో కౌలాలంపూర్‌లోని బ్రిక్‌ఫీల్డ్స్ కందయ్య హాల్‌లో ఈ వేడుకలు జరిగాయి. ప్రవాస తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగు కుటుంబాలు పెద్దసంఖ్యలో పాల్గొనడం విశేషం. బతుకమ్మ అలంకరణకు ప్రత్యేక బహుమతిగా రెండు బంగారు నాణేలు, బతుకమ్మలను తీసుకొచ్చిన ప్రతి మహిళకు వెండి నాణేలు, వేడుకల్లో పాల్గొన్న ప్రతి మహిళకు వెండి నాణేలు అందజేశారు. ఎఫ్ఎన్‌సీఏ మలేషియా అధ్యక్షుడు కృష్ణ ముత్తినేని బతుకమ్మ విశిష్టతను వివరించారు. ముఖ్యఅతిథులుగా పెరాక్ రాష్ట్ర శాసనసభ సభ్యురాలు వాసంతి సిన్ని సామి, ఇండియన్ లేబర్ వింగ్ అటాచ్ వినయ్ ఆనంద్ హాజరయ్యారు. తెలుగు ఎక్స్‌పాట్స్ అసోసియేషన్ స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ చందు, ప్రధాన కార్యదర్శి ఇంద్రనీల్, మలేషియా ఆంధ్రా అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామ్, భారతీయ అసోసియేషన్ ఆఫ్ మలేషియా అధ్యక్షుడు సత్య, ఉపాధ్యక్షుడు రవితేజ, మలేషియా తెలుగు ఫౌండేషన్ అధ్యక్షుడు దాతో కాంతారావు, మలేషియా తెలుగు వెల్ఫేర్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, తెలుగు ఇంటెలెక్చువల్ సొసైటీ ఆఫ్ మలేషియా అధ్యక్షుడు కొణతాల ప్రకాశ్‌రావు తదితర ప్రముఖులు పాల్గొన్నారు.



# బహ్రెయిన్, దుబాయిలో బతుకమ్మ సంబరాలు









**బహ్రెయిన్:** బహ్రెయిన్‌లో నివసిస్తున్న తెలుగు ప్రవాసీయులు దసరా, బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన దసరా, బతుకమ్మ ఉత్సవాలలో తెలుగు సంప్రదాయాలకు అద్దం పట్టేలా మహిళలు, చిన్నారులు రంగురంగుల బతుకమ్మలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన భారత రాయబారి డాక్టర్ ప్రదీప్‌సింగ్ రాజ్ పురోహిత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగు కళా సమితి ఉపాధ్యక్షులు వెంకట్ స్వామి, ప్రధాన కార్యదర్శి సతీష్ శెట్టి, కోశాధికారి అరుణ్‌కుమార్, బినత, కవిత, ఉష, రేవతి, సింధూజ, శ్వేత, మధుమతి, కావ్య, సంధ్య, ఐశ్వర్య, శ్రీలక్ష్మి, సుచిత్ర, మమత, ఇతర కమిటీ సభ్యులు, స్థానిక ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. విదేశీ గడ్డపై తెలుగు పండుగలను ఘనంగా నిర్వహిస్తూ, తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను పరిరక్షించడంలో తెలుగు కళా సమితి చేస్తున్న కృషిని ఈ వేడుకలు మరోసారి చాటి చెప్పాయని తెలుగు కళా సమితి అధ్యక్షుడు యుగంధర్ కరణం పేర్కొన్నారు.




**దుబాయి:** యూఏఈలోని ప్రముఖ ప్రవాసీ భారతీయ సంఘాలలో ఒకటైన ఇండియన్ పీపుల్స్ ఫోరం (ఐపీఎఫ్) తెలంగాణ చాప్టర్ దుబాయిలో శనివారం సాయంత్రం బతుకమ్మ సంబరాలు వైభవంగా జరిగాయి. భారతీయ జాతీయవాదం, సనాతన ధార్మిక విలువల పరిరక్షణ కోసం పాటుపడే ఐపీఎఫ్ బతుక మ్మ, ఇతర భారతీయ పండుగలను దుబాయిలో ఘనంగా నిర్వహిస్తుంది. ఓ స్థానిక పాఠశాల ఆడిటో రియంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ వచ్చారు. సమీప అల్‌ఖోజ్ ప్రాంతంలోని నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలకు చెందిన ప్రవాసీ కార్మికులు పెద్దఎత్తున సభా ప్రాంగణానికి చేరుకున్నారు. తెలంగాణ పండుగ, సంస్కృతి వారసత్వాన్ని విదేశాలలో కూడా పరిరక్షించడానికి కృషి చేస్తున్న ప్రవాసీయులను అర్వింద్ అభినందించారు. మహిళలు పేర్చిన బతుకమ్మలను చూస్తూ వారిని అభినందించారు. దుబాయి, ఇతర గల్ఫ్ ప్రవాసీయుల సాధకబాధకల గురించి తనకు అవగాహన ఉందని, దీని కోసం తన వ్యక్తిగత ట్రస్ట్ కూడా నిరంతరం పనిచేస్తోందని తెలిపారు. తన ప్రతి దుబాయి పర్యటనలో వీలైనంత ఎక్కువమందితో సమావేశం కావాలనే అభిలాష ఉన్నా సమయాభావం వలన కలువలేకపోతున్నందుకు క్షమించాలని కోరుతూ ఇక నుంచి వీలైనంత ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తానని పేర్కొన్నారు. ఎంపీ అర్వింద్‌తో పాటు బీజేపీ నాయకుడు, వరంగల్ నగరానికి చెందిన మాజీ మంత్రి దివంగత దాస్యం ప్రణయ్ భాస్కర్ కుమార్ కుమారుడు అభినవ్ కూడా పాల్గొన్నారు. యువకుడైన అభినవ్ బీజేపీ తెలంగాణ ప్రవాసీ విభాగానికి సంయుక్త కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నట్లుగా నిర్వాహకులు తెలిపారు. బతుకమ్మలు అలంకరించడం, గౌరమ్మకు పూజలు, వాయినాలు సమర్పించడంలో పావని అడ్లగట్ట, రజిత, అపర్ణ తదితరులు పాటుపడ్డారు. ఐపీఎఫ్ ఉపాధ్యక్షులు రాకేష్ బోహ్రా, జాతీయ కార్యదర్శి రాజీవ్ రంజన్ సింగ్, తెలంగాణ బాధ్యులు తలకొక్కుల మదన్, కృష్ణ మేగి, అరె శరత్ గౌడ్, కుంభాల మహేందర్‌రెడ్డి, నవనీత్ గాజ, రమేశ్ గౌడ్ గాడర్ల, గోవర్ధన్ యాదవ్, వినోద్ ఆర్మూరీ, కృష్ణా, జగదీశ్ భరతపు, రమేశ్ పిట్ల, యోగేశ్ జమాల్ పూర్ తదితరులు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

# విదేశీ శక్తుల మద్దతుతో కుట్ర?





### • ఇమ్రాన్‌ఖాన్, రాహుల్ గాంధీపై చిరాగ్ పాశ్వాన్ విమర్శలు

ఢిల్లీ: భారతదేశంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ వివాదం, ఎన్నికల కమిషన్ తొలగింపు డిమాండ్ల నిరసనలపై కేంద్ర మంత్రి, లోక్ జనశక్తి పార్టీ (రామ్ విలాస్) అధినేత చిరాగ్ పాశ్వాన్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ ఆందోళనల్లో విదేశీ శక్తుల మద్దతుతో దేశంలో అరాచకం సృష్టించే కుట్ర జరుగుతోందని ఆయన ఆరోపించారు. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ముంబైలోని ఆగస్టు క్రాంతి మైదాన్‌లో జరిగిన ఆందోళనలో బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ ఖాన్ పాల్గొనడంపై పశ్వాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇమ్రాన్ ఖాన్ సుదీర్ఘకాలం భారతదేశంలో నటుడిగా పనిచేసినప్పటికీ, ఆయన అమెరికా పౌరసత్వం ఉన్న వ్యక్తి అని గుర్తుచేశారు. భారత పౌరులు నిరసనలు తెలిపితే గౌరవిస్తామని, కానీ ఓసీఐ కార్డ్ కలిగిన విదేశీ పౌరులు అంతర్గత అంశాల్లో ఆందోళనలు చేయడం తీవ్ర ఆందోళనకరమని పేర్కొన్నారు. ఫారినర్స్ యాక్ట్ ఉల్లంఘన ఆరోపణలపై ఇమ్రాన్ ఖాన్‌కు లభించిన 'లీవ్ ఇండియా' (అక్టోబర్ 28 నాటికి దేశం విడిచి వెళ్లాలని) నోటీసులను చిరాగ్ పాశ్వాన్ సమర్థించారు.

**కోల్‌కతా తొక్కిసలాట..**
**రాహుల్ గాంధీ-అమిత్ షాలకు పోలిక**

కోల్‌కతాలోని దుర్గాపూజ పండల్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో 19 మంది ప్రాణాలు కోల్పోయారు. అయితే కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే స్పందించి తన రాజకీయ కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకుని బాధితులను పరామర్శించారని కొనియాడారు. అదే సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గోవాలో జరగనున్న ఎన్నికల ర్యాలీలకు ప్రాధాన్యమినిస్తూ పర్యటించడంపై మండిపడ్డారు. ఒకవైపు మానవత్వంతో వ్యవహరించే నాయకులు ఉంటే, మరోవైపు ప్రజల ప్రాణాల కంటే రాజకీయాన్నే మిన్నగా భావించే ప్రతిపక్ష నేతలు ఉన్నారని విమర్శించారు.

**ఎంపీ పదవికి రాజీనామా చేస్తారా..**
**రాహుల్ గాంధీకి సవాల్**

ఇటీవల 'ఎస్ఐఆర్' ప్రక్రియను తప్పుబడుతున్న రాహుల్ గాంధీకి చిరాగ్ పాశ్వాన్ సవాల్ విసిరారు. ప్రస్తుతం ఉన్న ఎన్నికల ప్రక్రియ ద్వారానే లోక్‌సభ స్థానాల్లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో పాటు కాంగ్రెస్ ఎంపీలు గెలిచారని, ఆ వ్యవస్థనే ప్రశ్నించాలనుకుంటే ముందుగా రాహుల్ గాంధీ తన ఎంపీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.



## భక్తులపైకి ట్రక్కు..12 మంది మృతి

### మధ్యప్రదేశ్‌లో ఘోర ప్రమాదం

గ్వాలియర్: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. శీతలాదేవి ఆలయ సమీపంలో గుమిగూడిన భక్తులపైకి ఓ భారీ ట్రక్కు అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 12 మంది భక్తులు మృతిచెందారు. మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. అలాగే కొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి. శనివారం అర్ధరాత్రి 1:30 నిమిషాల సమయంలో జరిగిందీ దారుణ ఘటన. నవరాత్రుల సందర్భంగా భక్తులు శీతలా దేవి ఆలయాన్ని పెద్ద సంఖ్యలో సందర్శిస్తున్నారు. శనివారం రాత్రి చిన్నూర్ నుంచి వరి ధాన్యం లోడుతో వస్తున్న ట్రక్కు వాలుగా ఉన్న రోడ్డును ఎక్కించబోయి అదుపుతప్పింది. సమీపంలో ఉన్న భక్తులపైకి దూసుకెళ్లింది. దీంతో కొందరు భక్తులు అక్కడికక్కడే మరణించారు. భక్తులతో పాటు ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు పోలీసులూ గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 39 క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ వారిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. కాగా ఈ ప్రమాదంలో ఆలయ గేటు, గోడలు కూడా ధ్వంసమయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ప్రమాదం జరిగిన దారిలో భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించామని, అయినా ఆ ట్రక్కు పోలీసుల బారికేడ్లు, చెక్‌పోస్టులను దాటుకుంటూ వచ్చిందని గ్వాలియర్ కలెక్టర్ రుచికా చౌహాన్ తెలిపారు. ఆ భారీ వాహనం పోలీస్ చెక్‌పోస్ట్‌ను ఎలా దాటగలిగింది.. అనే దానిపై దర్యాప్తు చేపట్టామని ఆమె వివరించారు. 12 మంది భక్తుల మృతిపై విచారం వ్యక్తం చేశారు.

## ఉపాధి హామీ కార్మికులపై దూసుకెళ్లిన కారు

### పంజాబ్‌లో 8 మంది దుర్మరణం

పంజాబ్: పంజాబ్‌లోని సంగ్రూర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఉపాధి హామీ కార్మికులపై కారు దూసుకెళ్లడంతో 8 మంది కార్మికులు చనిపోయారు. సంగ్రూర్ జిల్లాలోని లెహ్రాగాగా-ఝఖర్ రోడ్డులో ఆదివారం ఈ ఘోర ప్రమాదం జరిగింది. దాదాపు 25 మంది కార్మికులు రోడ్డు పక్కన పనిచేసుకుంటూ ఉండగా.. ఒక కారు అకస్మాత్తుగా వారిపై నుంచి దూసుకెళ్లిందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారని పోలీసులు చెప్పారు. ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే చనిపోగా.. మిగతా ముగ్గురు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారని పోలీసులు వెల్లడించారు. అలాగే గాయపడిన మరికొందరిని ఆసుపత్రికి తరలించారు. మృతులందరినీ సంగ్రూర్ జిల్లా లెహ్రాగాగా సమీపంలోని అలిషెర్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. ఇక.. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను గుర్తించామని, అతడిని ట్రేస్ చేశామని సంగ్రూర్ పోలీస్ సూపరింటెండెంట్ పల్విందర్ చీమా తెలిపారు. త్వరలోనే అతడిని అదుపులోకి తీసుకుంటామని వెల్లడించారు. అతడిని పర్గత్ సింగ్ అలియాస్ కాలాగా గుర్తించామని చెప్పారు.

# సరసమైన ధరలో క్యాన్సర్ మందులు

### • నవంబరు 9 నుంచి అందించాలని కేంద్రం నిర్ణయం

ఢిల్లీ: అత్యవసర క్యాన్సర్ మందుల జాబితాను కేంద్ర ప్రభుత్వం విస్తరించింది. దేశంలో క్యాన్సర్ చికిత్సను మరింత సరసమైన ధరలకు అందించాలని నిర్ణయించింది. క్యాన్సర్ మందుల ధరలపై నియంత్రణను విస్తరించి, గుర్తించిన 137 రకాల క్యాన్సర్ మందుల ధరలను 70 శాతం వరకు తగ్గించనుంది. ఈ మేరకు కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. 20 రకాల క్యాన్సర్లకు ఉపయోగించే ఇమ్యునోథెరపీ మందులతో పాటు బ్రెస్ట్, ప్రోస్టేట్, పెద్దపేగు, అండాశయ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ల చికిత్సకు ఉపయోగించే మందులు ఈ జాబితాలో ఉన్నాయి. నవంబరు 9 నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయి. దీంతో క్యాన్సర్ రోగులకు ఏడాదికి రూ.2,500 కోట్ల వరకు ఆదా అవుతుందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఈ మందుల గరిష్ఠ చిల్లర ధరలో మార్జిన్‌ను 30 శాతానికి పరిమితం చేయనున్నారు.

**ఆర్థిక భారం తగ్గించేందుకు**

భారత్‌లో క్యాన్సర్ చికిత్స ఖర్చులు అధికంగా ఉండడంతో రోగులు, వారి కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతోంది. దేశంలో ఆరోగ్య సంరక్షణ కోసం చేసే మొత్తం ఖర్చుల్లో సుమారు 44 శాతం ప్రజలు తమ జేబుల నుంచి చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలోఆసుపత్రుల్లో మందులపై అధిక ధరలు, లాభాల మార్జిన్లను నియంత్రించి వైద్య ఖర్చులను తగ్గించాలని కేంద్రం నిర్ణయించింది. కాగా.. 2019లో ప్రభుత్వం 42 రకాల క్యాన్సర్ మందులపై ధరల నియంత్రణ విధించింది. అప్పట్లో కొన్ని మందుల ధరలు 90 శాతం వరకు తగ్గాయి. ఇప్పుడు మరో 137 రకాల మందులపై నియంత్రణను విస్తరించనుంది. బ్రాండెడ్, జనరిక్ మందులు, దేశీయ, దిగుమతి చేసుకున్న ఉత్పత్తులతో పాటు పేటెంట్ ఉన్నవి, పేటెంట్‌లేని వాటిపైనా ఈ నియంత్రణ ఉంటుంది.




# కోల్‌కతా దుర్గాపూజ వేడుకల్లో తొక్కిసలాట



### • 19 మంది మృతి: ఏడుగిరి అరెస్ట్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో శనివారం రాత్రి దుర్గాపూజ వేడుకల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. చోర్‌బగాన్ దుర్గాపూజ మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో 19 మంది ప్రాణాలు కోల్పోగా, మరో 25 మంది గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి పూజా కమిటీ నిర్వాహకులు సహా ఏడుగురిని పోలీసులు అరెస్టు చేశారు. జనసమూహాన్ని నియంత్రించడంలో నిర్లక్ష్యం జరిగిందా? భద్రతా ఏర్పాట్లలో లోపాలున్నాయా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతోంది. శనివారం రాత్రి సుమారు 7.40 గంటల సమయంలో ఉత్తర కోల్‌కతాలోని చోర్‌బగాన్ దుర్గాపూజ మండపం వద్ద ఈ ఘటన జరిగింది. దుర్గాపూజలో ఏడో రోజైన సప్తమి సందర్భంగా అమ్మవారిని దర్శించుకు నేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆ సమయంలో భారీ వర్షం కురవడంతో వర్షం నుంచి తప్పించుకునేందుకు పలువురు మండపం వైపు పరుగులు తీశారు. ఇరుకైన వీధిలో ఒక్కసారిగా రద్దీ పెరగడంతో భక్తులు ఒకరినొకరు తోసుకున్నారు. కొందరు కిందపడటంతో తొక్కిసలాట చోటుచేసుకున్నట్లు ప్రాథమిక సమాచారం. ఈ ఘటనలో మహిళలు, చిన్నారులు సహా 19 మంది మృతిచెందారు. మరో 25 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన కోల్‌కతా పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. వారిలో పూజా కమిటీ కార్యదర్శి రాజ్‌కుమార్ సెవ్రా, ఉపాధ్యక్షుడు శంతను దూబే ఉన్నారు. మండపం వద్ద వెదురు నిర్మాణ పనుల్లో పాల్గొన్న బిప్లబ్ ముఖర్జీతో పాటు జనసమూహాన్ని నియంత్రించే బాధ్యతలు నిర్వహించిన కౌశిక్ సాహా, పింటు దేలను కూడా అరెస్టు చేశారు. ప్రైవేటు భద్రతా సిబ్బంది పర్యవేక్షకులు సుమన్ చక్రవర్తి, రాజేశ్ పాల్ కూడా అరెస్టైన వారిలో ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తొలుత 14 మందిని విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఏడుగురిని అరెస్టు చేశారు.







# మనమూ అక్కడకు పోదాం






**ఫ్రాన్స్‌లో నిరసనలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎద్దేవా**

అమెరికా: హింసాత్మక నిరసనలతో ఫ్రాన్స్ అట్టుడుకుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సెటైర్లు పేల్చారు. ఫ్రాన్స్ సుందరమైన దేశమని, ఎలాంటి తిరుగుబాట్లు, లూటీలు ఉండవని ఎద్దేవా చేశారు. యూఎస్ మిడ్‌టర్మ్స్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల కెంటకీ రాష్ట్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ట్రంప్ ఈ కామెంట్స్ చేశారు. తమ ప్రభుత్వం ప్రజలకు ఇవ్వబోయే 5 వేల డాలర్ల గురించి మాట్లాడుతూ ఫ్రాన్స్ ప్రస్తావన కూడా తెచ్చారు. 'నేనిచ్చే 5 వేల డాలర్లతో ఫ్రాన్స్‌కు వెళ్లవచ్చు. అది చాలా సుందరమైన ప్రాంతం. విప్లవాలు, తిరుగుబాట్లు ఏవీ ఉండవు' అంటూ ఫ్రాన్స్‌లో తాజా పరిస్థితుల గురించి ట్రంప్ ఎద్దేవా చేశారు. 'పదండి ఫ్రాన్స్‌కు వెళదాము. విప్లవకారులతో చేతులు కలుపుదాము. విప్లవాలకు ఫ్రాన్స్ సహజసిద్ధమైన స్థానం. అక్కడి పరిస్థితులు నమ్మలేనట్టుగా ఉన్నాయి' అని మరో సెటైర్ పేల్చారు. మూడో ప్రపంచ దేశాల నుంచి వలసలను పాశ్చాత్య ఉదారవాదులు ప్రోత్సహించడమే ప్రస్తుత పరిస్థితులకు కారణమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యానించారు. కారుణ్యం, మానవత్వం పేరిట వలసలను ప్రోత్సహించారని అన్నారు. పాశ్చాత్య సమాజంలో వారు ఇమడగలరా? అన్న విషయాన్ని పట్టించుకోలేదని ఆయన విమర్శించారు.

# ఫ్రాన్స్ టౌన్‌హాలుకు నిప్పుపెట్టిన నిరసనకారులు



ఫ్రాన్స్: దేశంలో చరిత్రాత్మక కట్టడమైన లిమోజెస్ టౌన్‌హాల్ మంటల్లో చిక్కుకుంది. ఈ ఘటనలో భవనం పైకప్పు కూలడంతో మూడింట రెండొంతుల భాగం పూర్తిగా ధ్వంసమైంది. 1883వ సంవత్సరంలో నిర్మించిన ఈ టౌన్‌హాల్‌ను.. ఫ్రాన్స్ ప్రభుత్వం 1975లో చరిత్రాత్మక కట్టడంగా గుర్తించింది. నిరసనకారులు ఉద్దేశపూర్వకంగానే ఈ చారిత్రక కట్టడానికి నిప్పంటించినట్లు అధికారులు భావిస్తున్నారు. ఆందోళనకారులు ప్రభుత్వ ఆస్తులు, వ్యాపార కేంద్రాలు, చరిత్రాత్మక కట్టడాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు ఫ్రాన్స్‌లో ఉన్న ఇతర చరిత్రాత్మక కట్టడాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది.

**చర్యలు తీసుకుంటాం**

**- ప్రధాని ఇమ్మాన్యుయేల్ మెక్రాన్**

ఈ ఘటనపై ఫ్రాన్స్ ప్రధాని ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ స్పందించారు. ప్రభుత్వ ఆస్తులపై, చారిత్రక కట్టడాలపై దాడికి పాల్పడిన నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ప్రధాని తెలిపారు. ప్రజలకు నిరసనలు తెలిపే హక్కు ఉంటుంది కానీ.. హింసాత్మక చర్యలకు పాల్పడితే మాత్రం కఠిన చర్యలు తప్పవన్నారు. కాగా.. దేశంలో పెరుగుతున్న నిత్యావసర ధరలు, ఆర్థిక సమస్యలు, విద్యావ్యవస్థలో లోపాలకు వ్యతిరేకంగా ఫ్రాన్స్ యువత ఆందోళనలు చేపట్టిన సంగతి తెలిసిందే. అయితే.. కొన్ని చోట్లలో ఈ నిరసనలు శాంతియుత మార్గంలో కొనసాగుతుండగా.. మరికొన్ని చోట్లలో హింసాత్మకంగా మారుతున్నాయి.

# అగ్ని కీలల్లో ఫ్రాన్స్..వీధుల్లో నిరసనలు





ఫ్రాన్స్: ఫ్రాన్స్‌లో భయానక వాతావరణం నెలకొంది. ప్రజల నిరసనలు తీవ్ర రూపం దాల్చడంతో దేశం అట్టుడుకుతోంది. మాస్కులు ధరించిన వేల మంది నిరసనకారులు పోలీసులపై దాడులు చేస్తూ లూటీలకు తెగబడ్డారు. భవనాలకు నిప్పు పెట్టారు. దీంతో, ముఖ్య నగరాల్లో అరాచక వాతావరణం కనిపిస్తోంది. ఇందుకు సంబంధించిన అనేక దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతున్నాయి. మీడియా కథనాల ప్రకారం దేశవ్యాప్తంగా 5 లక్షల మంది వీధుల్లోకి వచ్చి నిరసనకు దిగారు. పెరుగుతున్న జీవన వ్యయాలు, ఆర్థిక అసమానతలు, దిగజారిన ప్రజాసేవల నాణ్యతకు వ్యతిరేకంగా కదనుతొక్కుతున్నారు. దేశవ్యాప్తంగా 5.5 లక్షల మంది నిరసనకు దిగారని అంతర్గత వ్యవహారాల మంత్రి తెలిపారు. వాస్తవ సంఖ్య ఇంతకంటే ఎక్కువేనని నిరసనకారులు చెబుతున్నారు. రాజధాని పారిస్‌లో 1.1 లక్షల మంది నిరసనకు దిగడంతో నగరంలో భయానకవాతావరణం నెలకొంది. నిరసనలు హింసాత్మకంగా మారడంతో 1200 మందిని పోలీసులు ఇప్పటి వరకూ అరెస్టు చేశారు. నిరసనకారులతో ఘర్షణల్లో 150 మంది పోలీసులు గాయపడ్డారు. పోలీసులు, వారి వాహనాలపై ప్రజలు రాళ్లు రువ్విన దృశ్యాలు వైరల్‌గా మారాయి. గత నెలలో విద్యార్థులతో ప్రారంభమైన నిరసనల్లో ప్రస్తుతం కార్మిక సంఘాలు, ఇతర వర్గాలు చేరడంతో పరిస్థితులు తీవ్ర రూపం దాల్చాయి. సామాన్యుల కష్టాల విషయంలో ప్రభుత్వం సరైన చర్యలు తీసుకోలేదని నిరసనకారులు అగ్గిమీద గుగ్గిలం అవుతున్నారు. పలు భవనాలకు నిరసనకారులు నిప్పు పెట్టడంతో భయోత్పాతం నెలకొంది. పారిస్‌లో శనివారం మధ్యాహ్నం శాంతియుతంగా ప్రారంభమైన నిరసన సాయంత్రానికల్లా తీవ్ర రూపం దాల్చింది. నిరసనకారులు వీధుల్లో నిప్పు రాజేశారు. వాహనాలను దహనం చేశారు. పోలీసులతో ఘర్షణకు దిగారు. కొన్ని షాపుల్లో లూటీలు కూడా జరిగాయి. బోర్డోలోని లూయి వొట్టాన్ షాపులో, లిల్లీలోని యాపిల్ స్టోర్‌లో ఆగంతుకులు అందినకాడికి దోచుకెళ్లారు. దుస్తులు, ఆహార దుకాణాలు కూడా టార్గెట్ చేశారు. లిల్లీ, మార్సియెల్ నగరాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లోకి దూసుకెళ్లి రణరంగం సృష్టించారు. చారిత్రక కట్టడమైన సిటీ టూరిస్టు ఆఫీసును కూడా వదిలిపెట్టకపోవడంతో లియోన్ నగర మేయర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. లిమోజెస్ సిటీలోని టౌన్ హాల్‌లో కూడా మంటలు చెలరేగడంతో గంట ఉన్న టవర్ కూలిపోయింది. ఇందుకు సంబంధించిన దృశ్యాలు వైరల్‌గా మారాయి. గ్రెనోబెల్ నగరంలో కొందరు నిరసనకారులు ఓ టూరిస్టు ట్రెయిన్‌తో పోలీసుల వైపు దూసుకెళ్లారు. ఈ ఘర్షణల్లో నిరసనకారులు కూడా తీవ్రంగా గాయపడ్డారు. గ్రెనేడ్ పేలడంతో ఓ వ్యక్తి తన చేయిని కోల్పోవాల్సి వచ్చింది. దాడులు, లూటీలకు పాల్పడుతున్న వారిని వదిలిపెట్టేది లేదని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయెల్ మాక్రాన్ తేల్చి చెప్పారు.

# ఇరాన్ రక్షణ మంత్రిగా మెహ్రాదాద్

**ఆదేశ పార్లమెంట్ ఆమోదం**





ఇరాన్: ఇరాన్ మాజీ రక్షణ మంత్రి అజీజ్ నసీర్‌జాదే అమెరికా-ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన దాదాపు 8 నెలల తర్వాత ఆ దేశ పార్లమెంట్ (ఇస్లామిక్ కన్సల్టేటివ్ అసెంబ్లీ) నూతన రక్షణ మంత్రిగా మెహ్రాదాద్ అఖ్లాఘీ అభ్యర్థిత్వానికి అధికారికంగా ఆమోదం తెలిపింది. ఆదివారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో రక్షణ, సాయుధ దళాల లాజిస్టిక్స్ మంత్రిగా ఆయనకు ఎంపీలు విశ్వాస ఓటు ప్రకటించారు. మొత్తం పోలైన 277 ఓట్లలో మెహ్రాదాద్ అఖ్లాఘీకి అనుకూలంగా 237 ఓట్లు వచ్చాయి. దీంతో ఆయన ఇరాన్ నూతన రక్షణ మంత్రిగా పగ్గాలు చేపట్టారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన మొదటి విడత దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, ఇతర సీనియర్ మిలిటరీ కమాండర్లతో పాటు అప్పటి రక్షణ మంత్రి అజీజ్ నసీర్ జాదే మరణించారు. ఆ ఘటన తర్వాత సుదీర్ఘకాలం ఖాళీగా ఉన్న ఈ అత్యంత కీలకమైన పదవికి ఇప్పుడు అఖ్లాఘీ ఎంపికయ్యారు. అఖ్లాఘీకి ఎలాంటి ప్రత్యక్ష సైనిక హోదా లేకపోయినప్పటికీ ఆయన ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖలో 42 సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నారు. 2013 నుంచి ఇరాన్ ఆయుధాల తయారీ సంస్థ అయిన 'ఇరానియన్ డిఫెన్స్ ఇండస్ట్రీస్ ఆర్గనైజేషన్' అధిపతిగా వ్యవహరిస్తున్నారు.

**ఐక్యరాజ్యసమితి ఆంక్షలు**

న్యూక్లియర్, బాలిస్టిక్ మిస్సైల్ తయారీ కార్యకలాపాల్లో భాగస్వామ్యం ఉందనే ఆరోపణలతో 2007లోనే ఐక్యరాజ్య సమితి అఖ్లాఘీపై ఆంక్షలు విధించింది. కాగా, ఓటింగ్ ముందు అఖ్లాఘీ మాట్లాడుతూ 'ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న పరిస్థితుల నేపథ్యంలో రక్షణ శాఖ బాధ్యతలు స్వీకరించడం అత్యంత సున్నితమైన అంశం. దేశ రక్షణకు ప్రస్తుత పరిణామాల వెనుక ఉన్న లాజిక్‌ను అర్థం చేసుకోవడం, భవిష్యత్తు సవాళ్లకు అనుగుణంగా సిద్ధంగా ఉండటం ఎంతో అవసరం' అని స్పష్టం చేశారు. కాల్పుల విరమణ ప్రయత్నాలు, యుద్ధ పరిణామాలు ఊపందుకుంటున్న వేళ ఇరాన్ క్షిపణి, సైనిక సాంకేతిక పరిజ్ఞానంలో అనుభవజ్ఞుడైన అఖ్లాఘీని రక్షణ మంత్రిగా ఎన్నుకోవడం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# యెమెన్‌లో కూలిన హెలికాప్టర్

**ఇద్దరు పైలట్ల మృతి**



యెమెన్: సౌదీ అరేబియాకు చెందిన హెలికాప్టర్ కూలిపోవడంతో ఇద్దరు పైలట్లు చనిపోయారు. టెక్నికల్ ఫాల్ట్ కారణంగా తమ హెలికాప్టర్ యెమెన్ సరిహద్దుల్లో కూలిపోయిందని హౌతీలపై పోరాడుతున్న సౌదీ నేతృత్వంలోని కూటమి ఆదివారం తెలిపింది. అయితే, ఆ హెలికాప్టర్‌ను తామే కూల్చివేశామని ఇరాన్ మద్దతు ఉన్న హౌతీలు పేర్కొన్నారు. రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై హౌతీల గ్రూప్ దాడి చేయడంతో 13 మంది చనిపోయిన వారం రోజులకు సౌదీ హెలికాప్టర్ కూలిపోయింది. కూలిపోయిన హెలికాప్టర్‌ను సౌదీ అరేబియా నేషనల్ గార్డ్ మంత్రిత్వశాఖకు చెందిన ఏహెచ్-6ఐ రికనైసెన్స్ చాపర్‌గా గుర్తించారు. నజ్రాన్ ప్రాంతంలోని సౌదీ భూభాగంలో హెలికాప్టర్ కూలిపోయిందని హౌతీలపై పోరాడుతున్న సౌదీ నేతృత్వంలోని కూటమి ప్రతినిధి తుర్కి అల్ మల్కీ.. సౌదీ ప్రెస్ ఏజెన్సీకి వెల్లడించారు. టెక్నికల్ ఫాల్ట్ కారణంగానే హెలికాప్టర్ కూలిపోయిందని, అందులోని ఇద్దరు పైలట్లు అమరులయ్యారని అల్ మల్కీ చెప్పారు. అయితే.. సౌదీ శత్రువుకు చెందిన ఒక అపాచీ హెలికాప్టర్‌ను తాము కూల్చివేశామని హౌతీ ప్రతినిధి యహ్యా సరీ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా.. సౌదీ, హౌతీల మధ్య గత కొంతకాలంగా యుద్ధ వాతావరణం నెలకొంది. ఇటీవలే సౌదీ అరేబియాకు చెందిన మౌలిక సౌకర్యాలు, ఎర్ర సముద్రంలోని ట్యాంకర్లతో పాటు రియాద్‌లోని కింగ్ ఖలీద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై హౌతీలు దాడి చేసిన విషయం తెలిసిందే. దీంతో సౌదీ నేతృత్వంలోని కూటమి కూడా హౌతీల స్థావరాలపై ప్రతిదాడి చేసింది. శనివారం రాత్రి రియాద్ ప్రాంతంలో రెండు డ్రోన్లను అడ్డుకున్నామని, తూర్పు ప్రావిన్స్‌లో మూడో డ్రోన్‌ను అడ్డుకున్నామని కూటమి పేర్కొంది.

# హార్దిక్‌కు ప్రత్యామ్నాయం ఆపేయండి





భారత స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య గాయాల కారణంగా జట్టుకు దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే అతడికి ప్రత్యామ్నాయం కోసం టీమ్ మేనేజ్‌మెంట్ ప్రయోగాలు చేస్తూనే ఉంది. కానీ హార్దిక్‌కు తగ్గ ప్రదర్శన చేసే ప్లేయర్ మాత్రం దొరకలేదు. కొంతమేర తెలుగు కుర్రాడు నితీశ్‌కుమార్‌రెడ్డి పర్వాలేదనిపిస్తున్నాడు. కానీ అతడికి అవకాశాలు రావడం లేదు. శివమ్ దూబె, హర్షిత్ రాణా పూర్తిగా విఫలమవుతున్నారు. ఇటీవలే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన యువ ప్లేయర్ నమన్ ధీర్ రాణిస్తున్నాడు. ఇదే విషయంపై టీమిండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. హార్దిక్‌కు రీప్లేస్‌మెంట్ కోసం ఇకనైనా ప్రయత్నాలు ఆపండని మేనేజ్‌మెంట్‌కు సూచించాడు. 'హార్దిక్ లాంటి ప్లేయర్ కోసం ప్రత్యామ్నాయాన్ని వెతుకుతూ కొన్నిసార్లు ఎక్కువగా ఆలోచిస్తున్నామని అనిపిస్తోంది. అతడిని భర్తీ చేయడం అసాధ్యం. హార్దిక్ స్థాయి ప్లేయర్ దొరకనప్పుడు భిన్నమైన నైపుణ్యం కలిగిన ఆటగాడిని ప్రయత్నించడం మంచిది. అందుకు నమన్ ధీర్ సరిగ్గా సరిపోతాడు. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ అతడు ఉపయోగపడగలడు. వెస్టిండీస్‌తో వర్షం అంతరాయం కలిగించిన ఐదో టీ20లో నమన్ ధీర్ ఆరు బంతుల్లోనే అజేయంగా 24 పరుగులు సాధించాడు. ఈ ఇన్నింగ్స్ అతడి బ్యాటింగ్ సామర్థ్యాన్ని తెలియజేస్తోంది. బౌలింగ్‌లోనూ తనకు కేటాయించిన ఓవర్లను సమర్థంగా వేయగలడు' అని గావస్కర్ తెలిపాడు.

**టీమిండియా విభాగంలో**

**నలుగురు బౌలర్లు తప్పనిసరి!**

'టీమిండియా బౌలింగ్ విభాగంలో కనీసం నలుగురు రెగ్యులర్ బౌలర్లు ఉండాలి. ఐదు, ఆరో బౌలర్లుగా బ్యాటింగ్ చేయగల ఆల్‌రౌండర్లను ఎంచుకోవచ్చు. నమన్ ధీర్ లాంటి బ్యాటర్ రెండు లేదా మూడు ఓవర్లు వేయగలిగితే జట్టుకు అదనపు బలం చేకూరుతుంది. అక్షర్ పటేల్ తన నాలుగు ఓవర్ల కోటాను పూర్తి చేయడంతో పాటు బ్యాటింగ్‌లోనూ రాణించగలడు. ఇలా జట్టును సమతూకం చేసుకుంటే హార్దిక్ అందుబాటులో లేని సమయంలోనూ భారత్ మెరుగైన ప్రదర్శన చేసే అవకాశం ఉంటుంది. అలా కాకుండా తొమ్మిదో నంబర్ వరకూ బ్యాటింగ్ లైనప్ ఉండాలని అనుకుంటే మాత్రం బౌలింగ్ బలహీనపడుతుంది. అందుకే ప్రత్యర్థులే సులువుగా విజయాలు సాధిస్తున్నారు' అని గావస్కర్ వివరించాడు.

## కివీస్ టెస్టు సిరీస్‌కు ముందు

# నిరాశపరిచిన గిల్

న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు ముందు భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రంజీ ట్రోఫీలో చేదు అనుభవం ఎదురైంది. పంజాబ్ తరఫున ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో అతడు కేవలం ఒక్క పరుగుకే ఔటయ్యాడు. ఎడమచేతి వాటం స్పిన్నర్ అజయ్ మండల్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డయ్యాడు. ఐదు బంతులు మాత్రమే ఎదుర్కొన్న గిల్.. బ్యాట్‌కు, ప్యాడ్‌కు మధ్య నుంచి దూసుకొచ్చిన బంతిని అడ్డుకోవడంలో విఫలమయ్యాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కొనే క్రమంలో అతడి డిఫెన్స్‌పై క్రికెట్ అభిమానులు చర్చించుకుంటున్నారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో స్పిన్నర్లను ఎదుర్కొనే విషయంలో గిల్ తన టెక్నిక్‌ను మరింత మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందా? అంటూ కొందరు ప్రశ్నిస్తున్నారు. న్యూజిలాండ్‌తో కీలక టెస్టు సిరీస్‌కు ముందు గిల్ ఇలా ఔట్ కావడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. భారత జట్టు వచ్చే నెలలో న్యూజిలాండ్‌తో రెండు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరాలంటే టీమిండియాకు ఈ సిరీస్ అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో గిల్‌కు రంజీ మ్యాచ్ మంచి సన్నాహకంగా ఉపయోగపడుతుందని భావించారు.

# వైభవ్‌కు కష్టమే...

## న్యూజిలాండ్ సిరీస్‌పై పూజారా వ్యాఖ్యలు



మరికొద్ది రోజుల్లో భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్టోబరు 22 నుంచి కివీస్‌తో ఐదు టీ20ల సిరీస్ ఆడనుంది. ఇందులో అయిన యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీకి అవకాశం దక్కుతుందా? అనే చర్చ మొదలైంది. ఈ క్రమంలో భారత మాజీ క్రికెటర్ ఛతేశ్వర్ పుజారా ఈ విషయంపై స్పందించాడు. వైభవ్‌కు ఇప్పుడే అవకాశం దక్కడం కష్టమేనని అభిప్రాయపడ్డాడు. సంజు-వైభవ్‌ను ఒకే జట్టులో ఆడించలేరని తెలిపాడు. 'న్యూజిలాండ్ పరిస్థితుల్లో ఎక్కువ మంది టాప్ ఆర్డర్ బ్యాటర్ల కంటే జట్టుకు సమతూకం తీసుకొచ్చే ఆల్‌రౌండర్లు అవసరమవుతారు. స్పిన్ లేదా పేస్ బౌలింగ్ చేయగల ఆల్‌రౌండర్లు జట్టులో ఉండటం ఉపయోగకరం. ప్రస్తుతం సంజు శాంసన్ అద్భుతంగా రాణిస్తున్నాడు. ఒక మ్యాచ్‌లో విఫలమైనప్పటికీ మరో మ్యాచ్‌లో పుంజుకునే సత్తా అతడిలో ఉంది. ఈ నేపథ్యంలో సంజు శాంసన్, వైభవ్ సూర్యవంశీలలో ఒకరికే తుది జట్టులో చోటు దక్కే అవకాశం ఉంటుంది. సంజు ఓపెనర్‌గా బరిలోకి దిగినా, వైభవ్ ఆడినా.. ఇద్దరూ ఒకేసారి ఆడటం కష్టమే. వైభవ్ తన అవకాశాల కోసం ఇంకాస్త సమయం వేచి చూడాల్సిందే. అయితే భవిష్యత్తులో అతడికి అవకాశాలు తప్పకుండా వస్తాయి. పరిస్థితులు అనుకూలించి.. జట్టులోని ఆటగాళ్ల ఫిట్‌నెస్ సమస్యల కారణంగా అవకాశం ఏర్పడినా వైభవ్ తుది జట్టులోకి వచ్చే అవకాశం లేకపోలేదు' అని పుజారా వివరించాడు.

టీమిండియా మాజీ అసిస్టెంట్ కోచ్ అభిషేక్ నాయర్ కూడా సంజు శాంసన్ ఆటతీరుపై స్పందించాడు. 'సంజు రెండు మ్యాచ్‌ల్లో పరుగులు చేయకపోతే చాలు.. అతడి ఎంపికపై ప్రశ్నలు మొదలవుతాయి. అయినప్పటికీ ఓ భారీ ఇన్నింగ్స్ ఆడి విమర్శకుల నోళ్లు మూయించగల సామర్థ్యం సంజుకు ఉందని తెలిపాడు.

# విండీస్ క్రికెట్‌కు అండగా నిలవండి

**- కోచ్ డారెన్ సామీ**



భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య జరిగిన ఐదు టీ20ల సిరీస్ డ్రాగా ముగిసింది. విండీస్ ప్లేయర్లు అద్భుత ప్రదర్శనతో టీమిండియాను దీటుగా ఎదుర్కొన్నారు. అయితే భారత్‌తో సిరీస్ ఆడటం వల్ల తమకు ఎలాంటి ఆదాయం రాదని ఇటీవలే వెస్టిండీస్ క్రికెట్ బోర్డు సీఈవో డెహ్రింగ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఇదే విషయంపై విండీస్ కోచ్ డారెన్ సామీ కీలక వ్యాఖ్యలు చేశాడు. ఆర్థిక ఇబ్బందులతో కుదేలవుతున్న తమకు చేయూతనివ్వాలని కోరాడు. 'మా అమ్మ ఎప్పుడూ ఒక మాట చెప్పేవారు. బాధ్యతాయుతమైన శ్రద్ధ ఉండాలి. ఏ పని చేసినా దానిని మాత్రం కోల్పోవద్దు. ఇప్పుడు విండీస్ క్రికెట్ కూడా ఇదే పరిస్థితుల్లో ఉందని అనుకుంటున్నా. మాకు ఆర్థికంగా అండగా నిలిచే వారు అవసరం. భారత్‌లోని క్రికెట్ మౌలిక సదుపాయాలు, విండీస్ ఎదుర్కొంటున్న సవాళ్లను పోల్చి చూస్తే పరిస్థితుల్లో ఎంత వ్యత్యాసం ఉందో అర్థమవుతుంది. ఐసీసీ టోర్నీల్లో భారత్ ఎక్కడ ఆడినా విజయం సాధించాలనే అంచనాలతో బరిలోకి దిగుతుంది. అందుకు కారణం ఆ దేశంలో క్రికెట్ అభివృద్ధి కోసం తీసుకున్న నిర్ణయాలు, పెట్టుబడులు, పటిష్ఠమైన వ్యవస్థలు. అదే విండీస్ విషయానికి వస్తే ఎన్నో సవాళ్లను అధిగమిస్తూ ఆడాల్సి వస్తోంది. అయినప్పటికీ మా కుర్రాళ్లు అద్భుతంగా ఆడారు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో రాణించగలమనే నమ్మకం తిరిగి వచ్చింది. మా ప్లేయర్లు అందరికీ నా అభినందనలు. భారత్‌తో ఇలాంటి సిరీస్‌లు ఆడటం వల్ల తమ జట్టుపై స్పాన్సర్లు, పెట్టుబడిదారుల్లో ఆసక్తి పెరుగుతుందని ఆశిస్తున్నా. ఈ ప్రదర్శనతో క్రికెట్ వెస్టిండీస్ బోర్డు సంబంధిత వర్గాలతో మరింత మెరుగ్గా చర్చలు జరిపే అవకాశం ఉంటుందని అనుకుంటున్నా. పెట్టుబడులు వస్తే జట్టును అన్ని విధాలా మెరుగుపర్చుకోవచ్చు' అని డారెన్ సామీ వివరించాడు.



# శ్రేయస్ అయ్యర్‌కు ఇంపాక్ట్ ప్లేయర్ అవార్డ్

వెస్టిండీస్‌తో టీ20 సిరీస్‌లో టీమిండియా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అదరగొట్టాడు. బ్యాటింగ్‌తో పాటు ఫీల్డింగ్‌లోనూ ఆకట్టుకున్న అతడికి టీమ్ మేనేజ్‌మెంట్ అరుదైన గుర్తింపు నిచ్చింది. ఐదు టీ20ల సిరీస్‌లో అత్యంత ప్రభావవంతమైన ఆటగాడిగా నిలిచిన శ్రేయస్‌కు 'ఇంపాక్ట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' మెడల్‌ను అందించింది. ఇందుకు సంబంధించిన వీడియోను బీసీసీఐ ఆదివారం విడుదల చేసింది. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వెస్టిండీస్‌తో సిరీస్‌లో శ్రేయస్ అయ్యర్ బ్యాట్‌తో పరుగుల వరద పారించాడు. ఐదు ఇన్నింగ్స్‌ల్లో 181 పరుగులు చేసి అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో మూడో స్థానంలో నిలిచాడు. 45.25 సగటుతో పాటు 205.68 స్ట్రైక్‌రేట్‌తో పరుగులు సాధించాడు. లఖ్‌నవూ వేదికగా జరిగిన తొలి టీ20లోనే శ్రేయస్ తన తొలి అంతర్జాతీయ టీ20 సెంచరీని నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు సాధించిన ఏడో భారత పురుష క్రికెటర్‌గా అరుదైన ఘనత అందుకున్నాడు. సిరీస్ ముగిసిన తర్వాత డ్రెస్సింగ్ రూమ్‌లో జరిగిన కార్యక్రమంలో టీమిండియా ట్రైనింగ్ అసిస్టెంట్ నువాన్ సేనవిరత్నే.. శ్రేయస్‌కు మెడల్‌ను అందించాడు. మూడు ఫార్మాట్లలోనూ సెంచరీలు చేసిన కొద్దిమంది భారత ఆటగాళ్లలో శ్రేయస్ ఒకడని, బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో జట్టు ముందుండి నడిపించాడని ఈ సందర్భంగా ప్రశంసించాడు. ఈ వీడియోను బీసీసీఐ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పంచుకుంది. వర్షం, పరుగులు, డ్రెస్సింగ్ రూమ్ సందడి.. ఇలా సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్ చుట్టూ జరిగిన విశేషాలను వీడియోలో చూపించింది. ఇదిలా ఉంటే భారత్-వెస్టిండీస్ ఐదు టీ20ల సిరీస్ సమం అయిన సంగతి తెలిసిందే.

## ఐదో స్థానం ఈజీ కాదు: తిలక్ వర్మ

టీ20 మ్యాచుల్లో ఐదు లేదా ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దిగడం కొంచెం కష్టమేనని భారత వైస్ కెప్టెన్ తిలక్ వర్మ అన్నాడు. అయితే ఈ బాధ్యతకు ఇప్పటికే తాను మానసికంగా నైపుణ్యాల పరంగా సిద్ధమయ్యానని చెప్పాడు. నెం.5 పొజిషన్‌లో రాణిస్తానన్న నమ్మకం తనకు ఉందని చెప్పా డు. 'నెం.3 పొజిషన్ నుంచి నెం.5 లేదా నెం.6కు మారడం అంత ఈజీ కాదు. సవాళ్లు ఉంటాయి. కానీ నేను వాటిని అధిగమించేందుకు కృషి చేస్తున్నాను. చివర్లో వచ్చి ఆటను గొప్పగా ముగించడం నాకు ఇష్టమే' అని శనివారం వెస్టిండీస్‌తో



మ్యాచ్ అనంతరం తిలక్ వర్మ చెప్పాడు. 'ఓ వ్యక్తిగా నాకు నెం.3 పొజిషన్ బెటర్. కానీ టాప్ కాంబినేషన్ ఇప్పటికే సెట్ అయ్యింది. కాబట్టి నేను నెం.5 లేదా నెం.6 స్థానంలో ఆడాలి. నెం.3 స్థానంలో కిషన్ అద్భుతంగా రాణిస్తున్నాడు. కాబట్టి నాకు నెం.5 లేదా నెం.6 తప్ప మరో ఆప్షన్ లేదు. కాబట్టి నేను ఈ బాధ్యతలకు మానసికంగా సిద్ధంగా ఉన్నాను. మీరు నా గత మ్యాచ్‌లను చూస్తే నేను విజయం సాధించినట్టు అర్థం అవుతుంది. కాబట్టి మంచి ఆటతీరు కనబరుస్తానన్న నమ్మకం నాకు ఉంది' అని అన్నారు. షాట్స్ రేంజ్‌ను, నైపుణ్యాన్ని పెంచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నానని అతడు చెప్పాడు. లేకపోతే క్లిష్ట పరిస్థితులు ఎదురవుతాయని చెప్పాడు. వాస్తవానికి తాను గతంలో కూడా ఈ పొజిషన్‌లో ఆడానని తిలక్ వర్మ అన్నాడు. ఏ స్థానంలోనైనా ఆడగలనన్న నమ్మకం తనకు ఉందని అన్నారు. నెం.6గా ఆడిన గత తొమ్మిది మ్యాచ్‌ల్లో తిలక్‌వర్మ 195 స్ట్రైక్ రేట్‌ను సాధించాడు. నెం.6, నెం.5 స్థానాల్లో పర్ఫార్మెన్స్‌ను కలిపితే అతడి యావరేజ్ 46గా, స్ట్రైక్ రేట్ 158గా ఉంది.

చైతన్య రథం

# సినిమా

సోమవారం 19 అక్టోబరు 2026 X



# రాజమౌళి వారణాసికి కొత్త చిక్కులు?

ఇండియన్ సినిమా చరిత్రలోనే మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌లో వారణాసి సినిమా ముందు వరుసలో ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అటువంటి వారణాసి సినిమా అనుకున్న టైంకి రాకపోవచ్చనే వార్తలు జోరుగా వినిపిస్తున్నాయి. మొదటినుంచీ వినిపిస్తున్న సమాచారం ప్రకారం ఈ ప్రతిష్ఠాత్మక చిత్రాన్ని 2027 ఏప్రిల్ 7న ఉగాది పండుగ కానుకగా గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేశారు. కానీ తాజా ఇండస్ట్రీ టాక్ ప్రకారం చూస్తే ఆ డేట్‌కు సినిమా రావడం దాదాపు అసాధ్యమనే వార్తలు బలంగా వినిపిస్తున్నాయి. రాజమౌళి పనితీరు ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన పర్ఫెక్షన్ కోసం ఎంతటి సమయాన్నైనా వెచ్చిస్తారు. ప్రస్తుతానికి షూటింగ్ దాదాపు పూర్తయినా విఎఫ్ఎక్స్, పోస్ట్-ప్రొడక్షన్ పనులకు భారీగా సమయం పట్టే అవకాశం ఉంది.

ఇప్పటివరకు రిలీజ్ డేట్ వాయిదాపై చిత్ర యూనిట్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రానప్పటికీ లోపల జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే సినిమా విడుదల మరింత ఆలస్యం కావచ్చనే ప్రచారం జోరందుకుంది. మరో ఆసక్తికరమైన అంశం. సినిమా మార్కెటింగ్ స్ట్రాటజీ. 'వారణాసి' చిత్రాన్ని కేవలం భారతదేశానికే పరిమితం చేయకుండా. అమెరికా, బ్రెజిల్, ఫ్రాన్స్, మెక్సికో లాంటి మార్కెట్లలో భారీ స్థాయిలో విడుదల చేసి, సరికొత్త రికార్డులు సృష్టించాలని మేకర్స్ భావిస్తున్నారు. 'ఆర్ఆర్ఆర్' సాధించిన అద్భుతమైన విజయం తర్వాత రాజమౌళి తర్వాతి ప్రాజెక్ట్‌పై పశ్చిమ దేశాల్లో విశేషమైన క్రేజ్ ఉంటుందని అందరూ అంచనా వేశారు. అయితే ప్రస్తుతానికి అంతర్జాతీయ మార్కెట్లలో ఆశించిన స్థాయిలో చర్చ గానీ, ఆ స్థాయి ఎగ్జైట్‌మెంట్ గానీ ఇంకా కనిపించడం లేదన్నది వాస్తవం. సరైన కంటెంట్ డ్రాప్స్, టీజర్లు లేదా ఇంటర్నేషనల్ ప్రెస్ కాన్ఫరెన్సులు ఇంకా మొదలు కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణం కావచ్చు. అంతేకాదు గ్లోబల్ రీచ్‌పైనే ఎక్కువ దృష్టి పెట్టే క్రమంలో లోకల్ ప్రమోషన్లను కాస్త నెమ్మదించాయనే టాక్ కూడా సినీ వర్గాల్లో వినిపిస్తోంది. ఎంత అంతర్జాతీయ సినిమా అయినా, ఏ పాన్-వరల్డ్ ప్రాజెక్ట్‌కైనా పునాది స్వదేశీ మార్కెట్టే. ట్రేడ్ వర్గాల లెక్కల ప్రకారం ఈ సినిమా సేఫ్ జోన్‌లోకి వెళ్లాలంటే దాదాపు 2,000 కోట్ల భారీ బ్రేక్-ఈవెన్ టార్గెట్‌ను అందుకోవాల్సి ఉంటుందని అంచనా.

అంతటి భారీ మైలురాయిని చేరాలంటే ముందుగా మన దేశంలోని అన్ని భాషల ప్రేక్షకుల నుంచి తిరుగులేని ఆదరణ లభించాలి. లోకల్ ఫ్యాన్స్, ట్రేడ్ వర్గాల్లో పాజిటివ్ బజ్ ఉంటేనే గ్లోబల్ మార్కెట్‌లోనూ ఆ వేవ్ కొనసాగుతుంది. ఏదేమైనా సినిమా ప్రమోషన్ల విషయంలో జక్కన్న వ్యూహాలు ఎప్పుడూ ఊహాకందని విధంగా ఉంటాయి. సరైన సమయం చూసి ఒక్క వీడియో గ్లింప్స్ లేదా ఫస్ట్ లుక్ వదిలితే చాలు ప్రపంచవ్యాప్తంగా రికార్డుల లెక్కలు తారుమారవ్వడం ఖాయం.



# ప్రభాస్ 'ఫౌజీ'కి అసలైన పరీక్ష

విజయ్ దేవరకొండ కథానాయకుడిగా వచ్చిన పీరియడ్ డ్రామా 'రణబాలి' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనతో నడుస్తోంది. భారీ సెట్టింగులు, బ్రిటిష్ పాలన నాటి వాతావర ణం ఉన్నప్పటికీ ఆడియన్స్ నుంచి వస్తున్న రెస్పాన్స్ ఇండస్ట్రీ వర్గాల్లో మరోసారి ఆసక్తికర చర్చకు తెరలేపింది. భారత స్వాతంత్ర్య పోరాటం, బ్రిటీష్ రూల్ నేపథ్యంగా వచ్చే సినిమా లను టాలీవుడ్ బాక్సాఫీస్ ఎప్పుడూ అంత సులువుగా స్వాగ తించదా? ఇలాంటి సమయంలోనే గ్లోబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'ఫౌజీ'పై ఒక్కసారిగా ఇండస్ట్రీ ఫోకస్ పెరిగింది. దర్శకుడు హను రాఘవపూడి ఈ చిత్రాన్ని 1940 కాలం నాటి బ్యాక్‌డ్రాప్‌లో, రెండో ప్రపంచ యుద్ధం అలాగే బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన సాయుధ పోరాటం నేపథ్యం లో రూపొందిస్తున్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుడి పాత్రలో ప్రభాస్ కనిపిస్తారనే సమాచారం ఈ ప్రాజెక్ట్‌పై భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. భారత చరిత్రలో ఎక్కువ మందికి అంతగా పరిచయం లేని ఒక విశిష్టమైన అంశాన్ని ఎంచుకోవడం వరకు మంచి ప్రయత్నమే. పైగా ప్రభాస్ లాంటి భారీ కటౌట్ ఉన్న స్టార్ తోడయ్యారు. కానీ, చరిత్రను కేవలం డాక్యుమెంటరీలా కాకుండా ప్రతి సీన్‌లోనూ హై-వోల్టేజ్ డ్రామా ఉండేలా మలచడం ఇక్కడ అతిపెద్ద టాస్క్. దర్శకుడు హను రాఘవపూడి సినిమాల్లో క్లాసిక్ టచ్, అద్భుతమైన విజువల్స్, ఆహ్లాదకరమైన సంగీతం పుష్కలం గా ఉంటాయి. అయితే చాలా సినిమాల్లో సెకండాఫ్‌లో వేగం తగ్గడం, కథనం కాస్త నెమ్మదించడం లాంటి అంశాలపై గతం లో విమర్శలు వచ్చాయి. 'ఫౌజీ' లాంటి భారీ బడ్జెట్ యాక్షన్ డ్రామాకు ఆ తరహా నెమ్మది ఏ మాత్రం వర్కవుట్ కాదు. మొదటి ఫ్రేమ్ నుంచి చివరివరకు ప్రేక్షకుడిని ఉత్కంఠకు గురిచేసే సంఘర్షణలు, బలమైన ఎమోషన్స్, స్క్రీన్ మీద కనిపిం చే కొత్తదనం మాత్రమే ఈ సినిమాను నిలబెట్టగలవు. ప్రభాస్ మార్కెట్ పరిధిని దృష్టిలో పెట్టుకుని అటు మాస్ ఆడియన్స్‌కు నచ్చే యాక్షన్, ఇటు పీరియడ్ స్టోరీకి కావాల్సిన నేటివిటీని సమపాళ్లలో మిక్స్ చేయాల్సి ఉంటుంది.

రణబాలి అందించిన మిశ్రమ ఫలితం తర్వాత, టాలీవుడ్‌లో బ్రిటిష్ కాలం నాటి కథల భవిష్యత్తును నిర్ణయించడంలో ఫౌజీ పాత్ర చాలా కీలకం కానుంది. హను రాఘవపూడి తన విజన్‌తో ప్రభాస్ స్టార్‌డమ్ ను సరైన రీతిలో ప్రజెంట్ చేసి బాక్సాఫీస్‌ను షేక్ చేస్తారా? పీరియడ్ చిత్రాల చుట్టూ ఉన్న ఆ సెంటిమెంట్‌ను చెరిపేస్తారా అనేది రాబోయే రోజుల్లో తేలనుంది.

# బాలయ్య సినిమాకి కొత్త విలన్!



గాడ్ ఆఫ్ మాసెస్ నందమూరి బాలకృష్ణ, స్టార్ డైరెక్టర్ కొరటాల శివ కలయికలో ఓ భారీ ప్రాజెక్ట్ తెరకెక్కనున్న విషయం విధితమే. ఈ క్రేజీ కాంబో అనౌన్స్ అయినప్పటి నుంచే అభిమా నులతో పాటు సినీ ప్రేక్షకుల్లోనూ అంచనాలు ఆకాశాన్ని తాకుతు న్నాయి. 'దేవర' తర్వాత కొరటాల శివ చేస్తున్న సినిమా ఇది. అందుకే ఈ ప్రాజెక్ట్ కోసం ఆయన చాలా రోజుల పాటు బలమైన కసరత్తు చేశారట. బాలయ్య మార్క్ ఊరమాస్ ఎలిమెంట్స్‌కు తోడు, కొరటాల శైలిలో గుండెల్ని హత్తుకునే ఫ్యామిలీ ఎమోషన్స్ ను పక్కాగా బ్యాలెన్స్ చేస్తూ కథను సిద్ధం చేశారని టాక్. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ డిసెంబర్ నుంచి ప్రారంభం కానుండగా.. సుధాకర్ చెరుకూరి భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి తాజాగా ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఒక వార్త తెగ చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఓ విలక్షణమైన బాలీవుడ్ స్టార్ దర్శకుడు, నటుడు కీలక పాత్రలో కనిపించబోతున్నారని గట్టిగా వినిపిస్తోంది. ఆయనే అనురాగ్ కశ్యప్. ఈ చిత్రంలో ఆయన విభిన్నమైన వేరియేషన్స్ ఉన్న నెగెటివ్ రోల్‌లో కనిపిస్తా రనే ప్రచారం మొదలైంది. ఇప్పటికే కొరటాల శివ ఆయన్ను కలిసి కథ, పాత్ర స్వభావాన్ని వివరించారని సమాచారం. పవర్‌ఫుల్ నటనకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే అనురాగ్ కశ్యప్. మాస్ హీరో బాలకృష్ణకు ఎదురుపడితే ఆ సన్నివేశాలు థియేటర్లలో పూనకాలు తెప్పించడం ఖాయమంటున్నారు సినీ విశ్లేషకులు.

ఇక్కడ మరో ఆసక్తికరమైన అంశం ఏంటంటే.. అనురాగ్ కశ్యప్ ఇప్పటికే మెగాస్టార్ చిరంజీవి, డైరెక్టర్ బాబీ కాంబినేషన్‌లో వస్తున్న 'కాకా' చిత్రంలో ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇటీవలే ఆయన ఆ సెట్స్‌లో కూడా అడుగుపెట్టారు. 'వాల్తేరు వీరయ్య' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, బాబీ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో 'కాకా'పై భారీ హైప్ నెలకొంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 13న రాబోతోంది. అలా మెగాస్టార్ సినిమాలో నటిస్తున్న అనురాగ్ కశ్యప్.. ఇప్పుడు బాలయ్య ప్రాజెక్ట్‌లోకి కూడా వస్తున్నారనే ప్రచారం రావడంతో టాలీవుడ్‌లో ఇది హాట్ టాపిక్‌గా మారింది. అనురాగ్ కశ్యప్ ఎంట్రీపై చిత్ర బృందం నుంచి గానీ, అటు ఆయన నుంచి గానీ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. గతంలో కూడా ఈ సినిమా కోసం సీనియర్ నటి విజయశాంతి, యాంగ్రీ యంగ్ మ్యాన్ రాజశేఖర్, కోలీవుడ్ హీరో ఆర్య, టాలెంటెడ్ నటి ఐశ్వర్య రాజేష్ పేర్లు గట్టిగా విని పించాయి. మరి వీరిలో ఎవరు నిజంగా నటిస్తున్నారు, ఎవరు కేవలం రూమర్లకే పరిమితం అవుతారు అనేది మేకర్స్ క్లారిటీ ఇచ్చే వరకు వేచి చూడాల్సిందే. ఏదేమైనా లీకుల రూపంలో వస్తున్న వార్తలు సినిమాపై అంచనాలను రోజురోజుకూ పెంచే స్తున్నాయి. మరి బాక్సాఫీస్ వద్ద ఈ ప్రాజెక్ట్ ఎలాంటి ప్రభంజనం సృష్టిస్తుందో చూడాలి.




# అర్ధరాత్రి భయపెట్టనున్న '418'

ఈ మధ్యకాలంలో హారర్ సినిమాలకు సపరేట్ ఫ్యాన్‌బేస్ ఉందని చెప్పొచ్చు. అయితే ప్రతి సినిమా భయపెడుతుంది అని చెప్పలేం. కానీ, '418'చిత్రం మాత్రం కచ్చితంగా భయపెడ తాను అంటోంది. చైత్ర జే.ఆచార్, సూర్య రాజ్ వీరభద్రబతిని, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకి కీర్తన్ నాగగౌడ దర్శకత్వం వహించాడు. ప్రశాంత్ నీల్ సమర్పణలో, మైత్రీ మూవీమేకర్స్ నిర్మించిన ఈసినిమా ఎప్పుడో రిలీజ్ కావాల్సింది. కానీ, కొన్ని కారణాల వల్ల వాయి దా పడింది. ఇక సెన్సార్ సభ్యులే ఈ సినిమా చూసి భయపడిపోయారనే వార్తా తెలియడంతో ఎప్పుడెప్పుడు ఈ సినిమా రిలీజ్ అవుతుందా అని ప్రేక్షకులు ఎదురుచూశారు. ఎట్టకేలకు ఈ సినిమా అక్టోబర్ 23న రిలీజ్ కానుంది. ఇక రిలీజ్ డేట్ దగ్గరపడుతుండడంతో ప్రమోషన్స్ మొదలుపెట్టిన మేకర్స్.. తాజాగా ప్రీమియర్స్ షోస్ వేయాలని ప్లాన్ చేస్తున్నారట. ఆ.. ప్రీమియర్స్ షోస్ వేయడంలో తప్పేముంది.. అన్నీ సినిమాలకు వేస్తారుగా అంటే.. ప్రత్యేకంగా అర్ధరాత్రి మిడ్‌నైట్ ప్రీమియర్ షోలతో ప్రేక్షకులను భయపెట్టేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. నార్మల్ హారర్ సినిమాలే రాత్రిపూట చూస్తే భయపడేవారు ఉన్నారు. అలాంటిది సెన్సార్ సభ్యులే భయపడిన ఈ సినిమా అర్ధరాత్రి మిడ్‌నైట్ ప్రీమియర్ షో చూస్తే ఏంటి పరిస్థితి అని నెటిజన్స్ భయపడుతున్నారు. కొందరు అయితే.. అర్ధరాత్రి ప్రీమియర్స్.. భయపడి గుండె ఆగితే ఎవరిదిరా రెస్పాన్సిబిలిటీ అంటూ సరదాగా కామెంట్స్ చేస్తున్నారు. కథ విషయానికొస్తే సుమారు 15 ఏళ్లుగా మూసివేసి ఉన్న ఒక మెడికల్ కాలేజీ భవనం నేపథ్యం ఆధారంగా ఈ కథ తిరుగుతుంది. ముఖ్యంగా అందులోని రూమ్ నంబర్ 418 వెనుక ఉన్న నిగూఢమైన రహస్యం, అక్కడ జరిగే భయానక సంఘటనలే ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. హారర్ సినిమాలను రాత్రివేళల్లో చూడటం ప్రేక్షకులలో మరింత థ్రిల్, ఉత్కంఠను కలిగిస్తుందనే ఉద్దేశంతో చిత్రబృందం అక్టోబర్ 22న మిడ్‌నైట్ ప్రీమియర్స్ ప్లాన్ చేసింది.